

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 230

శుక్రవారం 11-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈ సారీ ఫ్లాప్ షో

సెమీ ఫైనల్‌లో ఓడిన భారత్
మళ్లీ ప్రపంచకప్‌లో భంగపాటు - 12లో



యాక్సిస్ నుంచి ప్రభుత్వం ఔట్

మిగిలిన వాటా విక్రయానికి రెడీ
1.55%కి రూ.4,000 కోట్లు - 13లో

ఐదుగురు మంత్రులకు నో టికెట్

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుగురు మంత్రులకు సీటు దక్కలేదు. క్రికెటర్ జడేజా భార్యకు బీజేపీ జాబితాలో చోటు దక్కింది.

వివరాలు 6లో



తండ్రి కోసం తనయ దాతృత్వం

బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్‌కు కిడ్నీ మార్పిడి జరగనుంది. కిడ్నీ దానానికి కుమార్తె రోహిణి ముందుకు వచ్చారు.

వివరాలు 6లో



మాల్దీవుల్లో ఘోర అగ్నిప్రమాదం

మాలేలో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనలో 8 మంది భారతీయులు సహా 10 మంది వలస కార్మికులు మృతి చెందారు.

వివరాలు 6లో



పదేళ్లకోసారి 'ఆధార్' అప్‌డేట్

ఆధార్ పొంది పదేళ్లయిన వారు ధృవీకరణ పత్రాలను కనీసం ఒక్కసారైనా అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం సూచించింది.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

రాజధానిని వదులుకుంటే చరిత్ర క్షమించదు



విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని వక్తలు నొక్కి వక్కాణించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో గురువారం నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు.

వివరాలు 14లో ▸

లిక్కర్ స్కామ్‌లో మరో ఇద్దరి అరెస్ట్



దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మరో ఇద్దరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. పెర్నాడ్ రికర్డ్ లిక్కర్ కంపెనీ జనరల్ మేనేజర్ వినయ్ బాబు, హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా కంపెనీ డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు.

వివరాలు 6లో ▸

ఇకపై నెలకి లక్ష వీసాలు జారీ



అమెరికా వీసాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూపులు ఇక తగ్గే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది వేసవి తర్వాత వీసాల మంజూరుకయ్యే రోజులు బాగా తగ్గిపోతాయని, నెలకి లక్ష వీసాలు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది.


వివరాలు 6లో ▸

గృహ యజ్ఞం

'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు'తో 30 లక్షల మందికి పైగా పేదల సొంతింటి కల సాకారం

ఇప్పటికే రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

- డిసెంబర్ 21 కల్లా ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేయడమే లక్ష్యం
- కోవిడ్‌లోనూ నిర్విఘ్నంగా కొనసాగిన పనులు
- అక్క చెల్లెమ్మల చేతికి విలువైన స్థిరాస్తి
- రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపద సృష్టి
- ఈ మహాయజ్ఞం పూర్తయితే తన రాజకీయ జీవితం ముగిసినట్టేనని చంద్రబాబు బెంబేలు
- తొలి నుంచి పథకాన్ని అడ్డుకునేందుకు పలు కుట్రలు
- టీడీపీ నాయకుల ద్వారా కోర్టులను ఆశ్రయించి అడ్డంకులు సృష్టి
- ఆ పాచికలన్నీ పారకపోవడంతో తాజాగా రంగంలోకి దత్తపుత్రుడు
- డిజిటల్ క్యాంపెయిన్ పేరిట పథకంపై బురద జల్లే యత్నం



కోనసీమ జిల్లా ఆలమూరులోని ఎర్రా కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న పేదల ఇళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గూడు లేని లక్షల మంది పేదలు సొంతింటి యజమానులు అవుతున్నారు. రెండు దశల్లో 21.25 లక్షలకుపైగా (టిడ్కో ఇళ్లతో కలిపి) గృహ నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. పేదల ఆవాసాల కోసం దాదాపు రూ.1.06 లక్షల కోట్లను వ్యయం చేస్తూ అక్క చెల్లెమ్మల చేతికి విలువైన స్థిరాస్తిని కానుకగా అందచేస్తోంది. ఇది ఎంత పెద్ద యజ్ఞమంటే.. 30.25 లక్షల మంది పేదలకు 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.56,102.91 కోట్లు వెచ్చించింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.36,026 కోట్లు ఖర్చు చేస్తుండటంతో ఏకంగా కొత్త పట్టణాలే తయారవుతున్నాయి. ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర వాటా కింద చెల్లింపులతోపాటు ఇతర రాయితీల రూపంలో రూ.13,758 కోట్లను ప్రభుత్వమే భరిస్తోంది. సకల సదుపాయాలతో నిర్మిస్తున్న ఒక్కో ఇంటి విలువ సగటున కనీసం రూ.10 లక్షల వరకు ఉంటుందని అంచనా. కొన్ని చోట్ల

మిగతా 3వ పేజీలో ▶

రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి

నాడూ నేడూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ది ఇదే విధానం

- ప్రత్యేక హోదాతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ప్రధానికి విజ్ఞప్తి చేయనున్న ముఖ్యమంత్రి
- 2016లో పోలవరంలో కమీషన్ల కోసం హోదాను తాకట్టు పెట్టిన చంద్రబాబు
- చంద్రబాబు తీరుపై నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ నిరసన
- ఢిల్లీ వెళ్లినప్పుడు, రాష్ట్రానికి ప్రధాని వచ్చినప్పుడల్లా హోదా ఇవ్వాలని విజ్ఞప్తి
- ప్రత్యేక హోదా ఆవశ్యకతను విశాఖ వేదికగా ప్రధానికి నొక్కి చెప్పాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా.. అధికారంలోకి వచ్చాకైనా తన విధానం ఒకటేనని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాటి చెబుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే తనకు పరమావధి అని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్నారు. ప్రతిపక్ష నేతగా ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తి, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కోసం వైఎస్ జగన్ రాజీలేని పోరాటం చేశారు. అధికారంలోకి వచ్చాక

మిగతా 2వ పేజీలో ▶

నేడు విశాఖకు ప్రధాని, సీఎం

- సాయంత్రం 7.25 గంటలకు ఐఎన్ఎస్ డేగకు చేరుకోనున్న మోదీ
- స్వాగతం పలకనున్న గవర్నర్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్
- 12న ఏయూలో బహిరంగ సభ
- రూ.15,233 కోట్లతో చేపట్టే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

2లో

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

- రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే బహిరంగ సభ
- ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేయడం తగదు.. ప్రజలకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి

2 లో

నిర్దేశించిన ధరలకు రొయ్యలు కొనాల్సిందే

ప్రాసెసింగ్ యూనిట్లకు ఆక్వా సాధికార కమిటీ హెచ్చరిక

- రైతులకు అంతకంటే తక్కువ చెల్లిస్తామంటే కుదరదు
- 100 కౌంట్ రొయ్యల్ని రూ.210కు తగ్గకుండా చెల్లించాలి

5 లో



బాణసంచా పేలి ముగ్గురు మృతి



ఘటనా స్థలి వద్ద ఎగిసిపడుతున్న మంటలు

- మరో వ్యక్తికి తీవ్రగాయాలు.. తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో ఘోర దుర్ఘటన
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం
- సహాయక చర్యలు పర్యవేక్షించిన డిప్యూటీ సీఎం, ఏలూరు రేంజ్ డీఐజీ, ఎస్పీ

14 లో

వేమన సైతం సిగ్గుపడేలా..

నాడు



ఇదివరకు వేమన విగ్రహం ఇలా..



పాఠకులను తప్పుదోవ పట్టిస్తూ ఈనాడు ప్రచురించిన కథనం

నేడు



వైవీయూలో నూతనంగా నిర్మించిన ప్రధాన ముఖద్వారం వద్ద వేమన విగ్రహం

ఎద్దు ఈనిందంటాడు రామోజీ. దూడను కట్టేయమంటాడు చంద్రబాబు. పాలు పితుకుతానంటాడు పవన్ కల్యాణ్. అసలు ఎద్దు ఎందుకు ఈనుతుందనే సందేహం సామాన్యులకు వస్తుందనే ఆలోచనే వీళ్లకుండదు. ఎందుకంటే రామోజీకి పత్రిక ఉంది. వీళ్లిద్దరికీ పార్టీలున్నాయి. గురువారంనాడు 'వేమన పోయి వైఎస్ వచ్చే..' అంటూ 'ఈనాడు' సహితంగా రామోజీ ప్రకటించిన అబద్ధం కూడా అలాంటిదే. వైఎస్సార్ కడప జిల్లాలో యోగి వేమన పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు... లోపలెక్కడో ఉన్న వేమన విగ్రహాన్ని తెచ్చి యూనివర్సిటీ గౌరవం ఇనుమడించేలా ప్రధాన ద్వారం వద్ద ఆదిలోనే అందరికీ కనిపించేలా ఠీవిగా ప్రతిష్టించారు. లోపల అడ్మిన్ భవనానికి వైఎస్సార్ పేరు పెట్టారు కనక లోపలే ఉన్న వైఎస్ విగ్రహాన్ని అక్కడ పెట్టారు. కానీ... వేమన విగ్రహాన్ని గేటు పక్కన పెట్టారంటూ సగం నిజమే చెప్పి... పాత ఫొటోలు మాత్రమే వేసి... అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది 'ఈనాడు'. దాన్ని ప్రస్తావిస్తూ పవన్ కల్యాణ్‌తో పాటు ఎల్లో నేతలు సోషల్ మీడియాల్లో వేమన పద్యాలతో చెలరేగిపోయారు. యోగి వేమన సైతం సిగ్గుపడ్డ ఈ పరిణామాన్ని చూశాక... ''అబద్ధాలు ప్రకటించడానికి అలవాటు పడిపోయిన.. కాదు కాదు అంకితమైపోయిన దుర్వార్తా పత్రికలారా! ఏమిటీ ఘోరం?'' అన్న శ్రీశ్రీ మాటలు 'ఈనాడు'కు సరిపోతాయనటంలో ఆశ్చర్యమేమీ లేదు.

● తెలంగాణ

12న తెలంగాణలో నరేంద్ర మోదీ పర్యటన

● రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని జాతికి అంకితం చేయనున్న ప్రధాని

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, పెద్దపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ శనివారం తెలంగాణకు రానున్నారు. శనివారం విశాఖపట్నం నుంచి బయలు దేరి మధ్యాహ్నం 1.30కి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రామగుండానికి చేరుకుని, ఎరువుల ఫ్యాక్టరీని సందర్శించాక ఎన్టీపీసీ మహాత్మాగాంధీ స్టేడియంలో బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని, కొత్తగూడెం-సత్తుపల్లి రైల్వేలైన్‌ను జాతికి అంకితం చేస్తారు. ఎల్కతుర్తి- సిద్దిపేట- మెదక్ జాతీయ రహదారి విస్తరణ, బోధన్-బాసర-భైంసా, సిరోంచ-మహదేవ్‌పూర్ రహదారి పనులను ప్రారంభిస్తారు. అనంతరం 5.30 గంటలకు రామగుండం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం బేగంపేటకు, అక్కడి నుంచి ఢిల్లీకి పయనమవుతారు.

నేడు విశాఖకు ప్రధాని, సీఎం

సాయంత్రం 7.25 గంటలకు ఐఎన్ఎస్ డేగకు చేరుకోనున్న ప్రధాని నరేంద్ర మోదీ

● స్వాగతం పలకనున్న గవర్నర్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్
● 12వ తేదీన ఏయూ మైదానంలో బహిరంగ సభ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖకు రానున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రధానితో కలిసి సీఎం పాల్గొననున్నారు. రూ.7,614 కోట్లతో చేపట్టనున్న ఐదు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.7,619 కోట్లతో పనులు పూర్తి చేసిన ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. ఈ సభకు లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని భావిస్తున్నారు. పీఎం, సీఎంతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి వస్తున్న దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.




ప్రధాని మోదీ పర్యటన సాగేదిలా..

11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మధురై విమానాశ్రయం నుంచి బయలుదేరి సాయంత్రం 7.25 గంటలకు విశాఖ పాత విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగకు చేరుకుంటారు. తర్వాత చోళ (నౌకాదళానికి చెందిన గెస్ట్ హౌస్)కు వెళ్లి రాత్రి అక్కడే బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 10.10 గంటలకు చోళ నుంచి బయలుదేరి 10.30 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరగనున్న బహిరంగ సభకు హాజరవుతారు. అనంతరం 9 అభివృద్ధి ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఆ తర్వాత ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని తిరుగు ప్రయాణమవుతారు.

గవర్నర్ విశ్వభూషణ్ రాక: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ 11వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. నోవాటెల్ హోటల్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత రాత్రి 7 గంటలకు ఐఎన్ఎస్ డేగకు చేరుకొని ప్రధానికి స్వాగతం పలుకుతారు. అనంతరం నోవాటెల్‌కు చేరుకొని రాత్రి బస చేస్తారు. 12న 10.20 గంటలకు ఏయూకు చేరుకొని ప్రధానితో కలిసి పలు శంకుస్థాపనలు, ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని ప్రధానికి వీడ్కోలు పలుకుతారు. ఆ తర్వాత గన్నవరం పయనమవుతారు.

సీఎం జగన్ పర్యటన సాగేదిలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 6.35 గంటలకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగకు చేరుకుని, ప్రధానికి స్వాగతం పలుకుతారు. రాత్రికి పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం ప్రధానికి వీడ్కోలు పలికి.. తిరిగి తాడేపల్లిలోని నివాసానికి బయలుదేరుతారు.

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

● రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే బహిరంగ సభ
● వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి,విశాఖపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి తెలిపారు. పీఎం, సీఎం పర్యటనల నేపథ్యంలో గురువారం ఆయన సర్క్యూట్ హౌస్‌లో పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల మంది.. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి లక్ష మంది వరకు ప్రజలు బహిరంగ సభకు హాజరవుతారని.. అందుకు సుమారు 30 ఎకరాల ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిపై ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. ఇది రాజకీయ సభ కాదని.. అభివృద్ధికి సంబంధించిన సభ అన్నారు. రూ.15 వేల కోట్ల అభివృద్ధి పనులంటే చాలా తక్కువని అంటున్న చంద్రబాబు.. తను ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుని తిన్నారని ఆరోపించారు. ఆయన దోచుకున్న రూ.5 లక్షల కోట్లతో పోల్చితే ఈ రూ.15 వేల కోట్లు తక్కువేనని ఎద్దేవా చేశారు. విశాఖ రైల్వే జోన్ విషయమై ప్రధానితో చర్చిస్తామని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.




సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ● పక్కన సభా ప్రాంగణంలోని ఓ భాగం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ఎప్పుడూ వ్యతిరేకమే..

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ అనేక ఉద్యమాలు, పాదయాత్రలు, నిరసనలు చేపట్టిందని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ వ్యతిరేకమేనన్నారు. స్టీల్ ప్లాంట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి వాటా కూడా లేదని, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చెందిందన్నారు. ఈ ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి బీజేపీ వాళ్లను అడిగితే బాగుంటుందని సూచించారు. చెట్లను తొలగించిన చోట రెట్టింపుగా మొక్కలు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సుధాకర్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ వెళ్లినప్పుడల్లా.. రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు వచ్చినప్పుడల్లా ప్రత్యేక హోదా కల్పించాలని.. పోలవరాన్ని సత్వరమే పూర్తి చేయడానికి సహకరించాలని.. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నడిపించాలని.. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ప్రారంభించాలనే తదితర అంశాల గురించి సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేడు, రేపటి విశాఖ పర్యటనలో ఆయా అంశాల గురించి మరోసారి విజ్ఞప్తి చేయాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు.

ప్రత్యేక హోదాపై ఒకే మాట..

విభజన నేపథ్యంలో ఐదేళ్లు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ హామీ ఇచ్చారు. పార్లమెంటు ద్వారా హక్కుగా సంక్రమించిన ప్రత్యేక హోదా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిలా నిలుస్తుందని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ అప్పట్లో స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కానీ.. నాటి సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టులో కమీషన్ల కోసం ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టారు. దాంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగిస్తూ.. ప్రత్యేక హోదా స్థానంలో ఆర్థిక సహాయాన్ని 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి కేంద్రం ప్రకటించింది. ప్రత్యేక హోదా కంటే కేంద్రం ప్రకటించిన సహాయంతోనే రాష్ట్రానికి అధికంగా ప్రయోజనం కలుగుతుందని అప్పట్లో సీఎంగా చంద్రబాబు ప్రశంసించారు. శాసనసభలో ప్రధాని మోదీ, నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని అభినందిస్తూ తీర్మానం చేశారు. ఆర్థిక సహాయం వల్ల ఎలాంటి ప్రయోజనం ఒనగూరదని.. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రం రూపురేఖలు మారుతాయని ప్రజలకు వివరిస్తూ వైఎస్ జగన్ ఉద్యమించారు. తద్వారా ప్రత్యేక హోదాను సజీవంగా ఉంచారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించాక.. సీఎం హోదాలో సీఎం వైఎస్ జగన్ ఢిల్లీకి వెళ్లిన తొలిసారే ప్రత్యేక హోదాపై తన విధానాన్ని కుండబద్దలు కొట్టారు. కేంద్రంలో పూర్తి మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా లేదా రాష్ట్రానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు వచ్చినప్పుడల్లా ప్రత్యేక హోదా కల్పించాలని విజ్ఞప్తి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అదే బాటలో పయనిస్తున్నారు.

ప్రణాళికాయుతంగా పోలవరం

పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు కమీషన్ల కోసం ఏటీఎంగా మార్చుకున్నారని అప్పట్లో ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరంలో చంద్రబాబు పాల్పడిన అక్రమాలను ప్రక్షాళన చేశారు. ప్రణాళికా రాహిత్యంతో కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పనులు చేపట్టడం వల్ల అస్తవ్యస్తంగా మారిన పోలవరాన్ని గాడిలో పెట్టి పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే 2017-18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి.. ఆ మేరకు నిధులు ఇచ్చి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేలా చూడాలని కేంద్రాన్ని కోరుతూ వస్తున్నారు. అడ్‌హాక్‌గా రూ.పది వేల కోట్లు ఇచ్చి పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేలా చూడాలని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ప్రధాని మోదీకి ఇదే అంశాన్ని మరోసారి గుర్తు చేయనున్నారు.

విశాఖ ఉక్కుపై ఉడుం పట్టు

విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడులను పూర్తిగా ఉపసంహరించుకుని, ప్రైవేటీకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ రాశారు. ప్రభుత్వ రంగంలోనే లాభాల బాటలో విశాఖ ఉక్కు పరిశ్రమను నడిపించేందుకు ఉక్కు గనులను కేటాయించడం.. రుణాలను పునర్ వ్యవస్థీకరించడం.. మిగులుగా ఉన్న ఏడు వేల ఎకరాల భూమిని ప్లాటింగ్ చేసి అమ్మడం.. రెండేళ్ల గడువు ఇవ్వడం తదితర ప్రత్యామ్నాయ మార్గాలను ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్ సూచించారు. విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేపట్టిన ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సంఘీభావం ప్రకటించింది. అటు రాజ్యసభలో.. ఇటు లోక్‌సభలో కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ పోరాటం చేసింది. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ 120 మంది ఎంపీల సంతకాలను సేకరించి ప్రధాని నరేంద్ర మోదీకి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ వినతిపత్రంపై సంతకాలు చేసేందుకు టీడీపీ ఎంపీలు నిరాకరించడం ద్వారా విశాఖ ఉక్కు పరిశ్రమపై కూడా తమది రెండు నాల్కల ధోరణే అని చాటి చెప్పారు. విశాఖపట్నంకు వస్తున్న ప్రధాని మోదీకి మరోసారి ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నడపాలని సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేయనున్నారు.

క్లుప్తంగా

ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ ఫలితాలు విడుదల

లబ్బీపేట (విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అక్టోబరులో నిర్వహించిన ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసింది. ఈ ఫలితాలు యూనివర్సిటీ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

సచివాలయాల్లో రేషన్ లబ్ధిదారుల జాబితా

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషన్ లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు రేషన్ డేటా బేస్ మొత్తం ఇంగ్లిష్‌లో ఉండేదని.. సోషల్ ఆడిట్ పేరిట రూపొందించిన జాబితా ఆంగ్లంలో ఉండడంతో లబ్ధిదారుల్లో చాలామంది తమ వివరాలు తెలుసుకునేందుకు ఇబ్బంది పడేవారన్నారు. ఇప్పుడు తెలుగులో కార్డులోని కుటుంబ పెద్దతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, రేషన్ దుకాణం పరిధిని జాబితాలో పొందుపరుస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద ఈ నెల 19 నుంచి ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల జాబితా కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.


'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామీణులకు పూర్తివైద్యం

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు


సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా పనిచేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వోలకు) వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సూచించారు. ఆయన గురువారం మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సీహెచ్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వైద్యసేవలన్నీ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అందుబాటులోకి వస్తాయని, సీహెచ్‌వోలు టీం లీడర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. సెర్ప్ ఆధ్వర్యంలోని విలేజ్ ఆర్గనైజేషన్ల ద్వారా గ్రామీణుల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక పెద్దల సహకారం తీసుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ సర్వేను త్వరగా పూర్తిచేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు టెలిమెడిసిన్ ద్వారా అవసరమైన మేరకు వైద్య సహాయం అందించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యుడు గ్రామాన్ని సందర్శించే ముందురోజు సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు రోగులను ఆస్పత్రికి తీసుకొచ్చేలా పనిచేయాలన్నారు. జిల్లా హబ్‌ల సూచనల మేరకు రోగులను ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపించడంతోపాటు చికిత్స అనంతరం తిరిగివచ్చిన రోగుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారంతో ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా (ఏబీహెచ్ఏ-అభా) నమోదు ప్రక్రియలో మిగిలిన 30 శాతాన్ని డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. గర్భిణుల విషయంలో సీహెచ్‌వోలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు.



గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మంచాల లేఅవుట్లో నిర్మాణం పూర్తయిన పేదల ఇళ్లు



శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపురం లేఅవుట్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పరిధిలోని నామవరం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

గృహ యజ్ఞం

10 లక్షల ఇంటికి యజమాని

అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన తాకాసి దేవీ సత్యనారాయణ కుటుంబం చాలా ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. టీడీపీ హయాంలో ఎన్నిసార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా కనికరించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారి అర్జీ పెట్టుకున్నారు. ఏ ఆఫీస్ చుట్టూ తిరగలేదు. కొద్ది రోజులకే స్థలం మంజూరై ఇంటి పట్టా అందింది. ఇప్పుడు ఇంటి నిర్మాణం కూడా పూర్తయింది. రూ.10 లక్షల విలువ చేసే ఆస్తిని సీఎం జగన్ అందించారని ఆ కుటుంబం సంతోషంగా చెబుతోంది.

▶ మొదటి పేజీ తరువాయి

ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను అందిస్తున్న నేపథ్యంలో వీటి విలువ మరింత అధికంగా ఉండే అవకాశం ఉంది. మొత్తమ్మీద పేదల గృహ నిర్మాణాల ద్వారా రూ.2.5 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల మేర సంపదను సృష్టిస్తోంది. మరోవైపు పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలను కొనసాగించి పనులు కల్పించడం ద్వారా కోవిడ్ సమయంలోనూ ఆర్థిక కార్యకలాపాలు మందగించకుండా ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది.

డిసెంబర్‌కు ఐదు లక్షల ఇళ్లు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం నిరుపేద కుటుంబాలకు వరంగా మారింది. దశాబ్దాలుగా గూడు లేక అవస్థలు పడుతున్న లక్షల మందికి ఊరటనిస్తోంది. పథకం కింద రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్లను మంజూరు చేయగా 17.24 లక్షల గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణం 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ఏడాది డిసెంబర్ 21 కల్లా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 3.5 లక్షలు, టిడ్కో ఇళ్లు 1.5 లక్షలు ఈ గడువులోగా పూర్తి చేసేలా గృహ నిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. ఒకవైపు ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతూనే మరోవైపు కనీస సదుపాయాల కల్పన పనులను ప్రభుత్వం కొనసాగిస్తోంది. నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు చకచకా కరెంట్, నీటి సరఫరా కనెక్షన్‌లు సమకూరుస్తోంది.

మనిషికి కనీస అవసరాలైన కూడు, గూడు, దుస్తులు లాంటి కనీస అవసరాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా రాష్ట్రంలో లక్షల కుటుంబాలకు నిలువ నీడ లేదు. ఆ నిరుపేదల గోడును 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా విన్నారు. నేనున్నానని హామీ ఇచ్చారు. మాట మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని ప్రవేశపెట్టారు. పథకం ద్వారా ఏకంగా 30.25 లక్షల మంది నిరుపేదలకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో ఏకంగా ఊళ్లనే నిర్మిస్తూ ఓ మహాయజ్ఞాన్ని తలపెట్టారు. దీన్ని చూసి 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబులో ఆందోళన మొదలైంది. ఆయన అధికారంలో ఉండగా రాష్ట్రంలో పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదు. పారదర్శకంగా పక్కా ఇళ్లను నిర్మించిన పాపాన పోలేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ మహాయజ్ఞం పూర్తయితే ఇక తనకు రాజకీయ భవిష్యత్తే ఉండదని ఓ నిర్ణయానికి వచ్చిన చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలు, నాయకుల ద్వారా కోర్టులకెక్కి పలు అడ్డంకులు సృష్టించారు. అయితే ప్రభుత్వ దృఢ సంకల్పం ముందు ఆ పాచికలు పారలేదు. దీంతో తాజాగా దత్తపుత్రుడిని రంగంలోకి దింపి డిజిటల్ క్యాంపెయిన్ పేరిట పేదల ఇళ్లపై బురద జల్లే మరో కార్యక్రమానికి టీడీపీ తెర తీసింది.

ఫిబ్రవరిలో గృహప్రవేశం

అంబేడ్కర్ కోనసీమ జిల్లా బుల్లియ్యారేవుకు చెందిన వి.రమాదుర్గ వాలంటీర్ కాగా ఆమె భర్త కార్పెంటర్. ఇద్దరి సంపాదన నెలకు రూ.20 వేల లోపే. ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు సంపాదన సరిపోక అవస్థలు ఎదుర్కొన్నారు. అక్కడ సెంటు స్థలం రూ.3 లక్షల పైమాటే ఉండటంతో సొంతిల్లు కలేనని రమాదుర్గ వేదనకు గురయ్యేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా ఆమెకు ఉచితంగా ఇంటి స్థలం అందింది. గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందడంతో వేగంగా కొనసాగుతోంది. ఇటీవల స్లాబ్ కూడా వేశారు. ప్రస్తుతం గోడలకు ప్లాస్టింగ్, ఇతర పనులు జరుగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరికి ఇంటి నిర్మాణం పూర్తవుతుందని, ఆ నెలలో మంచి రోజులు ఉన్నందున గృహ ప్రవేశం చేస్తామని రమాదుర్గ చెబుతోంది. ఆమెతో పాటు బుల్లియ్యారేవులోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో పేదలకు ప్రభుత్వం 170 ఇళ్లను మంజూరు చేసింది. 60 ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి కాగా మిగిలినవి వేగంగా కొనసాగుతున్నాయి.

పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఇలా

- 30.25 లక్షల మందికి 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పంపిణీకి– రూ.56,102.91 కోట్లు
- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పన కోసం రూ.36,026 కోట్లు (ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి వీలుగా తాత్కాలిక సదుపాయాలకు రూ.3,117 కోట్లు, శాశ్వత సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు)
- లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా కింద చెల్లింపులు, ఇతర రాయితీల రూపంలో రూ.13,758 కోట్లు (రూ.15 వేల విలువ చేసే ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. రూ.40 వేల విలువైన సిమెంట్, ఇనుము, ఇతర నిర్మాణ సామగ్రిని మార్కెట్ ధరల కన్నా తక్కువకు రాయితీతో సరఫరా చేస్తోంది.)

జగనన్న కాలనీల్లో శాశ్వత సదుపాయాల కల్పన వ్యయం రూ.కోట్లలో

నీటి సరఫరా	4,128
విద్యుత్, ఇంటర్నెట్	7,989
డ్రైనేజీ, సీవరేజ్	7,227
రోడ్లు, ఆర్చ్‌లు	10,251
పట్టణ ప్రాంత లేఅవుట్‌లలో వసతుల కల్పన	3,314

ఇళ్ల నిర్మాణాలకు చేసిన ఖర్చు

(2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు గానూ ఇప్పటి వరకూ)

లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు	రూ.6149,10,54,963
నిర్మాణ సామగ్రి	రూ.1629,99,83,047
ఇతర ఖర్చు	రూ. 656,68,14,937
మొత్తం	రూ.8435,78,52,947

జగనన్న కాలనీలు కంటికి కనపడటం లేదా?

- కనీసం నారావారి పల్లెలో టీడీపీని గెలిపించుకునే సత్తా ఉందా?
- అరబిందో నుంచి చంద్రబాబు పార్టీ ఫండ్ తీసుకోలేదా?
- మాజీ మంత్రి కొడాలి నాని

గుడివాడ టౌన్: పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ పాలన కొనసాగుతోందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పారు. కృష్ణా జిల్లా గుడివాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు 31లక్షల మంది ఉన్నట్లు గుర్తించారన్నారు. వారికి నివాసం కల్పించేందుకు సుమారు 71 వేల ఎకరాలను సేకరించారని తెలిపారు. రోడ్లు, విద్యుత్, డ్రెయిన్‌లు, నీటి సరఫరా లాంటి కనీస సదుపాయాలను కల్పిస్తూ పొలాలను మెరక చేసి లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రూ.వేల కోట్లు వెచ్చించి జగనన్న కాలనీలలో ఇళ్లను నిర్మిస్తుంటే విపక్ష నాయకులకు ఏం చేయాలో తోచక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ అనుకూల మీడియాలో పాత ఫొటోలతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 71 వేల ఎకరాలను అభివృద్ధి చేసి జగనన్న కాలనీలను నిర్మిస్తుంటే ఏమీ చేయలేదని జనసేన నాయకులు ప్రచారం చేయడం నీచ రాజకీయమన్నారు.



14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కాలర్ పట్టుకుని ప్రశ్నించాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు. ఇప్పటం గ్రామంలో ఆక్రమణలను తొలగించేందుకు ఏప్రిల్‌లో నోటీసులు ఇస్తే స్పందించని లోకేశ్ ఇప్పుడు హడావుడి చేయటాన్ని చూసి అంతా నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు జీవిత కాలంలో పులివెందుల నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామ పంచాయతీలోనైనా టీడీపీ అభ్యర్థిని గెలిపించగలరా? అని సవాల్ చేశారు. కనీసం నారావారి పల్లెలో టీడీపీని గెలిపించుకునే సత్తా ఉందా? అని ప్రశ్నించారు.

ఆలయంలో ప్రమాణం చేద్దామా?

ఢిల్లీ లిక్కర్ స్కాంలో విజయసాయిరెడ్డి బంధువులున్నట్లు టీడీపీ ఆరోపించటాన్ని ఖండించారు. ఈడీ కేసులో ఉన్న వ్యక్తి విజయసాయిరెడ్డి అల్లుడు కాదన్నారు. అరబిందో కంపెనీ నుంచి చంద్రబాబు 2004, 2009, 2014, 2019లో పార్టీ ఫండ్ తీసుకోలేదా? అని ప్రశ్నించారు. 'దీనిపై చంద్రబాబు గుడిలో ప్రమాణం చేస్తారా? అందుకు నేను సిద్ధమే' అని నాని ప్రకటించారు.

పాస్టర్లకు చెల్లింపులపై కౌంటర్ దాఖలు చేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఖజానా నుంచి పాస్టర్లకు గౌరవ వేతనం ఎలా చెల్లిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. దీన్ని ఎలా సమర్థించుకుంటారని అడిగింది. మత సంబంధిత కార్యకలాపాల కోసం ప్రభుత్వం కొంత ఆర్థిక సాయం చేయడంలో తప్పు లేదని, అయితే నెల నెలా గౌరవ వేతనం కింద ఖజానా నుంచి చెల్లించడం ఎంత మాత్రం సరికాదని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాస్టర్ల గౌరవ వేతనానికి బడ్జెట్ కేటాయింపులు చేస్తూ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో 52ను సవాలు చేస్తూ విజయవాడకు చెందిన వై.అనిల్‌కుమార్ గత ఏడాది హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు.

సీఎం వైఎస్ జగన్‌కు కురుబ సంఘాల ప్రతినిధుల కృతజ్ఞతలు

కుల ధ్రువీకరణ పత్రాన్ని ఆర్డీవో పరిధి నుంచి తహసీల్దార్ పరిధిలోకి మార్చడంపై హర్షం



సీఎం వైఎస్ జగన్‌ను కంబళితో సన్మానించిన కురుబ సంఘ నేతలు, ఎంపీ గోరంట్ల మాధవ్

సాక్షి, అమరావతి : మదాసి కురుబ, మదారి కురుబ కులాలకు ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రాన్ని ఆర్డీవో పరిధి నుంచి తహసీల్దార్ పరిధిలోకి మారుస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌కు కురుబ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం సీఎం వైఎస్ జగన్‌ను హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మదాసి కురుబ, మదారి కురుబ సంఘాల ప్రతినిధులు కలిశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో ప్రయోజనకరమని సంతోషం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కురుబ సంప్రదాయం ప్రకారం కంబళి కప్పి ముఖ్యమంత్రిని సన్మానించారు. తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎంను కలిసిన వారిలో సుంకన్న, శివలింగ, సోమలింగ, సాయిరామ్, మద్దిలేటి తదితరులున్నారు.

కొమ్మినేని బాధ్యతల స్వీకారం

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడి



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, డొక్కా మాణిక్యవరప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో కొమ్మినేని శ్రీనివాసరావు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తనపై అపారమైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కొమ్మినేని దంపతులు

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించినందుకు శ్రీనివాసరావు దంపతులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు, పవన్‌లను నిలదీయండి

- ప్రజలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల పిలుపు
- మూడు సెంట్లలో ఇల్లు నిర్మిస్తానన్న బాబు హామీ ఏమైంది?
- 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాలు కన్పించడం లేదా?
- విజయసాయిరెడ్డికి ఢిల్లీ లిక్కర్ స్కాంకు ఏమిటి సంబంధం?

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య ప్రజలను మోసం చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌తో కలిసి మళ్లీ మోసం చేయడానికి వస్తున్నారని, వారిని ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్లలో ఏ ఒక్కరికీ మూడు సెంట్ల స్థలం ఇవ్వకపోవడంపై పవన్ కళ్యాణ్ ఏనాడైనా నిలదీశారా? అని ప్రశ్నించారు. నాడు



ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేలా, నేడు చీలకుండా చూసేలా పవన్ ఆడిన, ఆడుతున్న డ్రామాలు చంద్రబాబు కోసమేనని మండిపడ్డారు. ఇప్పటంలో జనసేన ఆవిర్భావ సభకు స్థలం ఇచ్చిన వారి ఇళ్లను, ప్రహరీలను కూల్చకున్నప్పటికీ కూల్చినట్లు.. చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి జరిగినట్లు తప్పుడు ప్రచారం చేశారు. ఇప్పటంకు నారా లోకేశ్ వెళ్లారు. ఒకట్రెండు రోజుల్లో చంద్రబాబు వెళ్లినా వెళ్లొచ్చు' అని అన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఇళ్లు, ఇంటి స్థలాలు కన్పించడం లేదా?

- 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. 87 శాతం కుటుంబాలకు డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) కింద రూ.1.80 లక్షల కోట్లు పంపిణీ చేశారు. తన 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.71 వేల కోట్ల విలువైన ఇంటి స్థలాలను ఇచ్చారు.
- 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడితే.. అందులో జగనన్న కాలనీల్లోనే 15.60 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నారు. 3 లక్షల ఇళ్లు సీలింగ్ వరకు వచ్చాయి. ఇప్పుడు జగనన్న కాలనీల్లో పవన్ సోషల్ ఆడిట్ చేస్తాడట! జగనన్న కాలనీలు చూడాలంటే గడప గడపకు వెళుతున్న మా ఎమ్మెల్యేలతో పాటు మీరూ వెళ్లండి. ప్రతి ఇంటికి ఏమేమి పథకాలు అందుతున్నాయో తెలుసుకోండి.

లిక్కర్ స్కాంతో మాకు సంబంధం లేదు

- ఢిల్లీ లిక్కర్ స్కాంతో మాకు, ప్రభుత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డికి ఏం సంబంధం? ఆ స్కాంలో విజయసాయిరెడ్డి అల్లుడు అన్న పేరు బయటకు వచ్చినంత మాత్రాన మోకాలికి, బోడి గుండుకు ముడి పెట్టడం సమంజసం కాదు. లేనిది ఉన్నట్లుగా ఎల్లో మీడియాలో ప్రచారం చేసి, విత్తనం నుంచి వాళ్లే లీకులు ఇస్తూ.. మళ్లీ మేం ముందు చెప్పినట్టే జరుగుతుందని వాళ్లే మాట్లాడడం, రాతలు రాయడం వాళ్ల నైజం.
- 2000లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అరబిందో సంస్థకు చెందిన ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్‌లో.. చంద్రబాబు కూడా పార్ట్‌నర్. మరి చంద్రబాబుకు కూడా లిక్కర్ స్కాంతో లింకు ఉందా?
- యోగి వేమన విశ్వవిద్యాలయం లోపల ఉన్న వేమన విగ్రహాన్ని, అందంగా తీర్చిదిద్దిన ముఖద్వారం వద్ద పెట్టి.. మరింత ప్రాముఖ్యతను ఇస్తే.. దానిని కూడా వక్రీకరిస్తూ అడ్డగోలు కథనాలు రాయడం ఎల్లో మీడియా దిగజారుడుతనానికి పరాకాష్ట.

వేమన విగ్రహానికి అగ్రస్థానం

యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ సూర్యకళావతి ఆవేదన



వేమన విగ్రహం వద్ద వీసీ ఆచార్య సూర్యకళావతి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహానికి మరింత ప్రాధాన్యత కల్పించామని, దీనిని గుర్తించకుండా రాజకీయం చేయడం తగదని వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆమె మీడియాతో మాట్లాడుతూ 'విశ్వవిద్యాలయంలో ఎక్కడా కొత్త విగ్రహాలు ఏర్పాటు చేయలేదు. తొలగించనూ లేదు. వేమన విగ్రహాన్ని కొత్తగా నిర్మించిన ప్రధాన ముఖద్వారం వద్ద గత నెల 31న ఏర్పాటు చేయడంతో ఖాళీ అయిన స్థానంలో వైవీయూ వ్యవస్థాపకుడు వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేశాం. ఈ మార్పు వల్ల వేమనకు మరింత ప్రాధాన్యత లభిస్తుంది. ఇదివరకు లోపలికి వస్తే కానీ కనిపించని వేమన విగ్రహం.. ఇప్పుడు ప్రధాన ద్వారం వద్దే అందరికీ బాగా కనిపిస్తుంది. ఈ వాస్తవం కళ్లెదుటే కనిపిస్తున్నా, దీనిని రాజకీయం చేయడం సరికాదు' అని అన్నారు. ఇదిలా ఉండగా, ఆ పత్రికల్లో సాగిన దుష్ప్రచారంపై విశ్వవిద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 'మేము ఇక్కడే ఉంటున్నాం కాబట్టి ఆ పత్రికలు తప్పుడు వార్త ప్రచురించాయని తెలిసింది. వేరే ఊళ్లలో ఉంటున్న వారు అదే వాస్తవమని నమ్మే ప్రమాదం ఉంది. అమ్మో.. ఇంత భయంకరంగా, పచ్చిగా, నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతారా?' అని వాపోయారు.

కర్ణాటకలో తెగబడిన యూపీ ముఠా

- బాగేపల్లిలో భారీ చోరీ
- కిలో బంగారం, రూ.75 లక్షల నగదు చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డైన దొంగల ముఠా కదలికలు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లిలో భారీ చోరీ జరిగింది. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన ముఠా కారులో ఓ ఏఎస్సై ఇంట్లోకి చొరబడి, ఇంటిల్లిపాదిని నిర్బంధించి తుపాకులతో బెదిరించి, భారీ మొత్తంలో బంగారం, నగదుతో ఉడాయించింది. ముఠా సభ్యులు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన ఏఎస్సై కుమారుడిపై కాల్పులు జరిపింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు ముఠా సభ్యులు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో నెల రోజులకుపైగా మకాంవేశారు. కదిరిలో పరిచయమైన ఓ యువకుడి సహకారంతో బుధవారం రాత్రి కారులో బాగేపల్లికి వెళ్లారు. తెరేసంద్రం శివారు ప్రాంతంలోని ఏఎస్సై నారాయణస్వామి ఇంటిని టార్గెట్ చేశారు. రాత్రి ఇంట్లోకి చొరబడి ఏఎస్సై భార్య, పిల్లలను తుపాకులతో బెదిరించి తాళ్లతో కట్టేశారు. అనంతరం బీరువాలో ఉన్న కిలో బంగారం, రూ. 75 లక్షల నగదు తీసుకొని ఉడాయించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఏఎస్సై కుమారుడు పెనుగులాడటంతో అతని కాలిపై కాల్పులు జరిపి, ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. అదే సమయంలోనే విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న ఏఎస్సై వీరిని గుర్తించారు. పట్టుకునేందుకు ప్రయత్నించగా, దుండగులు తుపాకీని తిరగేసి తలపై మోదడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆ వెంటనే ముఠా సభ్యులు కారులో ఉడాయించారు. ఇంటి లోపలకు వెళ్లిన ఏఎస్సై భార్యా పిల్లలను విడిపించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేశారు. ముఠాకు సహకరించిన కదిరి పట్టణానికి చెందిన యువకుడిని గురువారం అదుపులోకి తీసుకొని, కారును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు రహస్యంగా ఉంచారు. ముఠా సభ్యుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వాటి ఆధారంగా చోరులను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

అల్లా సృష్టిని ప్రారంభిస్తాడు;
తర్వాత దాన్ని పునరావృతం చేస్తాడు;
తర్వాత నువ్వు ఆయనలో లీనమవుతావు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, నవంబర్, 11

తప్పిన అంచనాలు

'డెమోక్రసీకి ఇది శుభదినం!' అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాల సరళిని చూసి, ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ చేసిన తాజా వ్యాఖ్య ఇది. అమెరికాలోని డెమోక్రసీ మాటెలా ఉన్నా, బైడెన్ ప్రాతినిధ్యం వహిస్తున్న డెమోక్రాటిక్ పార్టీకి మాత్రం దాదాపు సార్వత్రిక ఎన్నికల లాంటి ఈ పోల్స్ కొంత శుభప్రదంగా పరిణమించాయి. భారీ ద్రవ్యోల్బణం, ప్రజల్లో బైడెన్‌పై పెరిగిన అసంతృప్తి ఆసరాగా రిపబ్లికన్ల జెండా రంగైన 'ఎర్ర గాలి' దేశమంతటా వీస్తుందన్న అంచనా తప్పింది. అమెరికన్ కాంగ్రెస్‌లో ఇటు ప్రతినిధుల సభలోనూ, అటు ఎగువ సభ సెనేట్‌లోనూ తిరుగులేని ఆధిక్యం తమదే అవుతుందన్న రిపబ్లికన్ పార్టీ అంచనాలను మంగళవారం నాటి మధ్యంతర ఎన్నికలు నీరుగార్చాయి. 435 మంది సభ్యుల ప్రతినిధుల సభలో 218 స్థానాల మెజారిటీకి రిపబ్లికన్లు మెల్లగా దగ్గరవుతున్నారు. సెనేట్‌లో నువ్వానేనా పోటీ నడుస్తోంది. అయితే, నేవడా, అరిజోనా రాష్ట్రాల ఫలితాల్లో తప్పని జాప్యం – డిసెంబర్ 6న జరిగే జార్జియా ఎన్నిక వల్ల పార్లమెంట్‌లో అంతిమ బలాబలాలు తెలియడానికి మరికొన్ని రోజులు వేచిచూడక తప్పదు.

సాధారణంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలతో పోలిస్తే మధ్యంతర ఎన్నికలపై అంతర్జాతీయంగా ఏమంత ఆసక్తి వ్యక్తం కాదు. ఏ రాష్ట్రానికి ఎవరు గవర్నర్ అయ్యారు, ఎవరు సెనేటర్ అయ్యారనేది ప్రపంచానికి పెద్దగా పట్టని వ్యవహారం. కానీ, ట్రంప్ హయాం నుంచి పరిస్థితి మారింది. అయితే, మంగళవారం నాటి మధ్యంతర ఎన్నికలంతగా అందరి దృష్టినీ ఆకర్షించినవి చాలాకాలంగా మరేవీ లేవనే చెప్పాలి. 2020 నాటి అధ్యక్ష ఎన్నికల తర్వాత జరిగిన తొలి ఎన్నికలివే. ఆ ఎన్నికల ఫలితాలను మసిపూసి మారేడుకాయ చేశారన్న అప్పటి ట్రంప్ తప్పుడు వాదననే ఇప్పుడీ నవంబర్ 8 నాటి మధ్యంతర ఎన్నికల్లోనూ రిపబ్లికన్లు తెగ ఊదరగొట్టడం గమనార్హం. అలా చివరకు ఈ ఎన్నికలు ట్రంప్‌వాదపు దీర్ఘకాల మన్నికకు అగ్నిపరీక్షగా, అమెరికన్ ప్రజాస్వామ్యం ఏ మేరకు ఒత్తిడిని తట్టుకుంటుందో పరీక్షించే గీటురాయిగా మారాయి. ప్రపంచం ఆసక్తిగా చూసేలా చేశాయి.

అభ్యర్థుల ఎంపికలో దూకుడు చూపిన ఎర్రరంగు రిపబ్లికన్లకూ, అధికార పీఠంపై అస్తుబిస్తు అవుతున్న నీలిరంగు డెమోక్రాట్లకూ ఈ ఎన్నికలు పాఠాలు నేర్పాయి. నిజానికి, అమెరికాలో అధ్యక్షుడి నాలుగేళ్ళ పదవీకాలంలో దాదాపు మధ్యలో జరిగే మధ్యంతర ఎన్నికలు అధికార పార్టీ, దేశాధ్యక్షుల పనితీరుపై రిఫరెండమ్ లాంటివి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన ప్రతి మిడ్‌టర్మ్ పోల్స్‌లోనూ అధికార పార్టీ సగటున 26 స్థానాలు సర్వప్రతినిధి సభలో, 4 సీట్లు సెనేట్‌లో కోల్పోతుందని లెక్క. ఆ లెక్కన అధికార డెమోక్రాట్ పార్టీకీ ఎదురుదెబ్బలు అనూహ్యమేమీ కాదు. కానీ, దిగువసభలో రిపబ్లికన్లు పైచేయి సాధిస్తున్నా అంచనాలకు తగ్గట్టు భారీ సంఖ్యలో విజయాలు రాలేదు. భయపడినంత గట్టిదెబ్బ డెమోక్రాట్లకు తగలలేదు. ఇది సర్వేలు సైతం అంచనా వేయని ఆశ్చర్యకర పరిణామం. పెన్సిల్వేనియా లాంటి రాష్ట్రాల్లో డెమోక్రాట్ల గెలుపుతో, ఫలితాలు తాము అనుకున్నదాని కన్నా మెరుగ్గా ఉన్నాయని బైడెనే ఒప్పుకున్నారు. ఇక, ట్రంప్ గట్టిగా బలపరిచిన పలువురు మితవాదులు వివిధ రాష్ట్రాల్లో ఓటమి పాలవడం విడ్డూరం.

మిగిలిన బైడెన్ పదవీకాలం ఎలా గడుస్తుంది, అమెరికా రాజకీయాలపై ట్రంప్ నీడ ఏ మేరకు పరుచుకుంటుంది లాంటివన్నీ ఇక ఆసక్తికరం. మునుపెన్నడూ లేని విధంగా దేశం నిట్టనిలువునా రెండు వర్గాలుగా చీలిన నేపథ్యంలో, దిగువసభలో రిపబ్లికన్ల ఆధిక్యం బైడెన్‌కు కష్టాలు తేనుంది. ఒకప్పుడు ఎరుపు, నీలం పార్టీలు రెంటికీ సమాన బలాబలాలుండి, అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా నిలిచిన ఫ్లోరిడా రాష్ట్రంలో ఇప్పుడు దాదాపు 20 శాతం పాయింట్ల పైగా భారీ తేడాతో రిపబ్లికన్ అభ్యర్థి డీశాంటిస్ గెలవడం గమనార్హం. ఆ రాష్ట్రం అంతకంతకూ ఎరుపుమయం అవుతోందనడానికి ఇది నిదర్శనం. వచ్చే అధ్యక్ష ఎన్నికలకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వంలో ట్రంప్‌కు గట్టి సవాలు ఆయన నుంచే ఎదురుకావచ్చు. ఏమైనా, ఈ మధ్యంతర ఎన్నికల ఫలితాలను బట్టి ఒకటి స్పష్టమవుతోంది. అమెరికా రాజకీయాల్లో ట్రంప్ శకం అస్వాభావికమేమీ కాదు. ఆ సంగతి గ్రహించిన అమెరికా మిత్రపక్షాలు రానున్న రోజుల్లో నాటో, ఉక్రెయిన్‌లకు మద్దతు లాంటి వాటిపై ఎలా వ్యవహరిస్తాయన్నదీ ఆసక్తికరమే.

ఈ ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన పలువురి నేపథ్యాలు వైవిధ్యానికి ప్రతీకగా నిలవడం చెప్పుకోదగ్గ అంశం. భారత అమెరికన్లు అయిదుగురు ప్రతినిధుల సభకు ఎన్నికైతే, మేరీల్యాండ్‌కు గవర్నర్‌గా నల్లజాతీయుడు, లెఫ్టినెంట్ గవర్నర్‌గా తెలుగు మహిళ అరుణా మిల్లర్, ఇతర రాష్ట్రాల్లో ఒక స్వలింగ సంపర్క మహిళ, ఒక ట్రాన్స్‌జెండర్ గవర్నర్లుగా గెలవడం విశేషం. వీరందరూ డెమోక్రాట్ అభ్యర్థులే కావడం గమనార్హం. ఇలాంటి పరిణామాలు బాగున్నా, అమెరికా రాజకీయాలు అంతకంతకూ రెండు విరుద్ధ వర్గాల విద్వేషంగా మారుతున్నాయనే బెంగ పుట్టిస్తోంది. ఇప్పటి దాకా దిగువ, ఎగువ సభలు రెంటిలోనూ ఆధిక్యం డెమోక్రాట్లదే. ఎన్నికల తుది ఫలితాలతో రేపు బలాబలాల్లో తేడా వస్తే బైడెన్ అజెండా భవితవ్యం ప్రశ్నార్థకమే. ప్రతినిధుల సభ పూర్తిగా రిపబ్లికన్ల చేతిలోకి వెళితే, మిగిలినవన్నీ పక్కకు పోయి బైడెన్, ఆయన కుటుంబంపై దర్యాప్తుల పరంపర మొదలవుతుంది. సెనేట్ గనక గ్రాండ్ ఓల్డ్ పార్టీ కైవసమైతే న్యాయ నియామకాల్లోనూ అధ్యక్షుడు బైడెన్ సత్తా కుంటుపడుతుంది. వెరసి, అమెరికన్ రాజకీయాల్లో మరిన్ని మలుపులు ఖాయం.

మందగమనంలో ఆర్థిక వ్యవస్థ

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ పలు సందర్భాలలో సంక్షోభాల వలయంలో చిక్కుకొన్నప్పటికీ, ఇప్పటి పరిస్థితి అన్నింటికంటే దయనీయంగా ఉంది. సంక్షోభం ఏ ఒక్క రంగానికో పరిమితం కాకుండా సర్వవ్యాపితంగా కనిపిస్తోంది. సెంచరీ దాటిపోయిన పెట్రోల్, డీజిల్ ధరలు ఏడాదవుతున్నా కిందకి దిగడం లేదు. గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,100 దాటింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఈ 8 ఏళ్లలో దాదాపు 42 శాతం మేర పతనం అయింది. వాస్తవం ఈ విధంగా ఉంటే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి క్షీణించలేదు... డాలర్ బలపడిందంటూ చేసిన ప్రకటన క్రూర పరిహాసమే!

దేశంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పి చాలాకాలమే అయింది. నూనెలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, గోధుమలు వంటి నిత్యావసరాల ధరలు పైపైకి పోతున్నాయి. నిరుద్యోగం తీవ్రంగా ఉంది. ఎరువుల ధరలు పెరగడంతో వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం గణనీయంగా పడిపోయింది. కరోనా వల్ల మందగించిన పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల రేటు కొంత మెరుగయినప్పటికీ ఆశించిన స్థాయిలో లేదు. దేశంలో దిగుమతులు పెరిగాయి. ఎగుమతులలో క్షీణత నమోదవుతోంది. ఫలితంగా కరెంట్ ఎకౌంట్ బ్యాలెన్స్‌లో లోటు పెరిగిపోతోంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు క్రమంగా అడుగంటుతున్నాయి. ఇక, రూపాయి శీఘ్రంగా పతనం అవుతూ సెంచరీ కొట్టే దిశగా సాగిపోతోంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా విధిస్తున్న పన్నులు, సెస్సులు అంతకంతకూ పెరిగిపోతున్నా, ఇబ్బడి ముబ్బడిగా విదేశీ రుణాలు తీసుకొంటున్నా, బడ్జెట్ అవసరాలను తీర్చలేక కేంద్ర ప్రభుత్వం సతమతమవుతోంది.

ఆర్థికరంగం ముఖచిత్రం ఇంత ఘోరంగా తయారవుతుంటే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించకుండా, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, అమెరికా డాలర్ బలపడటం వంటి బయటి అంశాలే కారణమని ఎటువంటి వెరపు లేకుండా సమర్థించుకోవడం అందర్నీ నిశ్చేష్టుల్ని చేస్తోంది. ఎవరు అధికారంలో ఉన్నా... సమస్యలు ఉత్పన్నం కావడం సహజం. కానీ, వాటిని ఎదుర్కొని ప్రతికూల పరిణామాల ప్రభావం ప్రజలపై దీర్ఘకాలం పాటు పడకుండా చూడడమే ప్రభుత్వ బాధ్యత. కేంద్రంలోని ఎన్డీయే తీరు ఎంత బాధ్యతారహితంగా ఉన్నదంటే.. తమ తప్పుల్ని గత పాలకుల పాపాలుగా చూపి చేతులు దులుపుకొనే ప్రయత్నమే చేస్తోంది.

ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు సగటున 90 డాలర్లు మాత్రమే ఉన్నప్పటికీ. దేశీయ మార్కెట్‌లో లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు రూ.110 కిందికి దిగడం లేదు. 2013లో బ్యారెల్ ధర 140 డాలర్లు పలికినపుడు కూడా లీటర్ పెట్రోల్ రూ. 70 కే లభించిందికదా? అని ఎవరైనా ప్రశ్నిస్తే... ఆయిల్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన బకాయిల్ని చెల్లించడానికి ధర పెంచాం అనే సమాధానం ఇస్తున్నారు. కశ్మీర్‌లో శాంతిభద్రతలు అదుపు తప్పితే.. అందుకు దేశ తొలి ప్రధాని నెహ్రూని నిందిస్తారు. ఆకలి సూచీలో భారత్ ర్యాంకు దిగజారిందంటే, అవన్నీ తప్పుడు లెక్కలని దబాయిస్తున్నారు. రూపాయి పతనానికి వింత భాష్యం చెప్పారు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఈ 8 ఏళ్లలో దాదాపు 42 శాతం మేర పతనం అయింది. ఇటీవలికాలంలో విదేశీ మారకద్రవ్య నిల్వల నుండి దాదాపు ఒక బిలియన్ డాలర్లు వెచ్చించి పటిష్ట స్థాయిలో ఉంచడానికి ప్రయత్నం చేసినా రూపాయి బలపడలేకపోయింది. 642 బిలియన్ డాలర్ల మేర ఉన్న విదేశీ మారక



ద్రవ్య నిల్వలు క్రమంగా తరిగిపోతున్నాయి. ఈ మారకం నిల్వలు కేవలం 9 నెలల దిగుమతులకే సరిపోతాయి. కనీసం రెండేళ్ల దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్యం ఉంటే... అది ఆరోగ్యకరమైన స్థాయిగా పరిగణిస్తారు. వాస్తవం ఈ విధంగా ఉంటే ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి క్షీణించలేదు... డాలర్ బలపడిందంటూ చేసిన ప్రకటన క్రూర పరిహాసమే.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్లు నిజంగానే ఇతర కరెన్సీల కంటే రూపాయి మెరుగ్గానే ఉందా? అని ప్రశ్నించుకొంటే సమాధానం దొరకదు. ఉదాహరణకు విదేశాలలో విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులు ఫీజులు, ప్రయాణ ఖర్చులు, వసతి మొదలైన వాటికయ్యే ఖర్చును డాలర్లలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బ్రిటన్‌లోనే పౌండ్లలో చెల్లిస్తారు. అంటే, ఇతర కరెన్సీలతో పోలిస్తే రూపాయి మెరుగ్గా ఉందని చెప్పుకొన్నప్పటికీ... చెల్లింపులన్నీ డాలర్లలో చేసేటప్పుడు అదనపు భారాన్ని ఎవరు మోస్తున్నట్లు? తమ కరెన్సీ విలువ ఎంతో నిర్ధారించుకోవడానికి అన్ని దేశాలు ఫ్లోటింగ్ మారక రేటునే పాటించాలి. కనుక రూపాయి పటిష్ఠంగా ఉంటే డాలర్‌కు 82 నుంచి 84 రూపాయలు ఎందుకు చెల్లిస్తున్నట్లు? రూపాయి విలువ క్షీణించడం వల్ల విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) పెట్టుబడులను ఉపసంహరించు కుంటున్నారు.

ద్రవ్యోల్బణం అదుపులో ఉండి, రుణ భారాన్ని తగ్గించుకొంటూ ఆర్థిక సుస్థిరత దిశగా అడుగులు వేసినప్పుడే పరిస్థితులు మెరుగవుతాయి. విదేశీ వాణిజ్య లోటును తగ్గించుకోవాలంటే దిగుమతుల్ని తగ్గించాలి. ప్రస్తుతం వాణిజ్య లోటు రూ. 2,600 కోట్ల డాలర్ల మేర ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ నివేదిక వెల్లడించింది. ముడి చమురు, ఎరువుల దిగుమతులకు అధిక శాతం విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఖర్చవుతున్న నేపథ్యంలో పర్యాటకం, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించి విదేశీ కరెన్సీ రాబడి పెరిగేలా చూడాలి. అది జరగాలంటే... దేశంలో శాంతిభద్రతలు మెరుగవ్వాలి. మౌలిక సదుపాయాలు విస్తరించాలి. దిగుమతులలో అత్యధికంగా ఉన్న నూనెగింజలు, పప్పు ధాన్యాలను దేశీయంగానే సాగు చేస్తామని అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీ ఆచరణలోకి రాలేదు. ఈ అంశంలో నీతి ఆయోగ్ వెలువరించిన విధాన పత్రం ఏమయిందో తెలియదు. కాగా, ఇటీవల బియ్యం ఎగుమతులపై భారీ సుంకం విధించడంతో వాటి ఎగుమతులు మందగించి విదేశీ మారకద్రవ్యం ఆర్జించే అవకాశాలు తగ్గాయి. రష్యాతో చమురు దిగుమతుల ఒప్పందం కుదుర్చుకొన్నాక ఆ చెల్లింపులను డాలర్లలో కాక రూపాయిల్లోనే జరపడం కొంత ఊరట నిచ్చే అంశం. మేకిన్ ఇండియా ద్వారా అనేక ఉత్పత్తులను దేశీయంగా తయారు చేసుకొంటాం అని కేంద్రం నమ్మకంగా చెప్పిన విషయం ఆచరణలో తేలిపోయింది. చైనా ఆర్థికరంగంతో పదేపదే పోల్చుకొంటున్నప్పుడు, చైనా మాదిరిగా అన్ని రంగాలకు అవసరమైన యంత్రాలు, ఇతర సాధన సంపత్తిని ఎందుకు సమకూర్చుకోలేక పోతున్నామో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యక్తిగత రుణాలను ఇచ్చేందుకు బ్యాంకులు విముఖత చూపడంతో వేలాదిమంది రుణ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకొని ఆ ఊబిలో కూరుకుపోతున్నారు. రుణయాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. అదేవిధంగా పబ్లిక్ రంగ బ్యాంకుల బ్రాంచీల సంఖ్యను కుదించడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో రైతాంగానికి పరపతి సౌకర్యం మునుపటిలా సజావుగా అందడం లేదన్న ఆరోపణలు ఎక్కువయ్యాయి. దీన్నిబట్టి బ్యాంకింగ్ వ్యవస్థ కేవలం సంపన్న వర్గాల సేవలకే పరిమితం అవుతున్నట్లు భావించాల్సి వస్తోంది.

నిజానికి, కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం సమకూరుతుంది. జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయి. సెస్సుల ద్వారా రాష్ట్రాలకు వాటా ఇవ్వని ఆదాయం కేంద్రానికి సమకూరుతోంది. ఇదికాక, ఎల్ఐసీ వంటి పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా లభిస్తున్న నిధులు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, 'పీఎం కేర్స్'కు అందుతున్న విరాళాలు... ఇవి చాలవన్నట్లు విదేశీ అప్పులు! ఈ విధంగా పెద్దఎత్తున కేంద్రానికి నిధులు అందుబాటులో ఉన్నాయి. అయితే, ప్రాధాన్యతలను ఎంచుకోవడంలో సరైన విధానం లేకపోవడంతోపాటు, రాజకీయ వ్యూహాలపై అధిక సమయం వెచ్చిస్తూ దేశాభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం స్పష్టంగా కనిపిస్తోంది. కరోనా కల్లోలం తర్వాత పరిస్థితులు క్రమంగా కుదుటపడినప్పటికీ అన్ని రకాల సేవలు, వస్తువుల ధరలు అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో తమ ఆదాయాల్లో ఏమాత్రం పెరుగుదల లేని సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, కన్నీళ్లకు తక్షణం కేంద్ర ప్రభుత్వం ముగింపు పలకాలి.

వ్యాసకర్త శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!


చేయకూడని ప్రకటనలు



మరో బౌద్ధ మతమార్పిడి ఉత్సవం చోటు చేసుకుంది. అందులో 'నేను ఏ హిందూ దేవుళ్లను నమ్మను, పూజ చేయను' లాంటి ప్రకటనలు ఉన్నాయి. ఒక మతపు ఆచారాలు, విశ్వాసాల పట్ల ద్వేషాన్ని పుట్టించే ఇలాంటి ప్రసంగాలు విద్వేష ప్రసంగాలే. వీటిని నిషేధించాలి.

– కవిత, హిందూ యాక్టివిస్ట్

మైసూర్ టైగర్‌కు నివాళి



బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన సాహస యోధుడు టిపు సల్తాన్ జయంతి సందర్భంగా (నవంబర్ 10) ఆయనకు నా గౌరవపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. టిపూను మనం ఈరోజు ఆయన దేశభక్తికీ, ఆదర్శనీయ పాలనకూ గుర్తుచేసుకుంటున్నాం.

– హెచ్.డి. దేవేగౌడ, మాజీ ప్రధాని

తర్వాత ఎక్కడ?



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీవ్‌లో ఓడిపోయారు. ఖార్కీవ్‌లో ఓడిపోయారు. ఖెర్సన్‌లో ఓడిపోయారు. తర్వాత ఎప్పుడు ఎక్కడ ఓడిపోతారు?

– మైకేల్ మెక్‌ఫాల్, ప్రొఫెసర్

ఎంజాయ్ చేద్దాం



ఓడటం, గెలవడంతో నిమిత్తం లేకుండా, ఏ దేశం అన్నదానితో సంబంధం లేకుండా ఊరికే మంచి క్రికెట్‌ను ఆస్వాదిస్తే ఎలా ఉంటుంది?

– కాంతీ బాజ్‌పాయి, విధాన విశ్లేషకులు

ఒకచోట ఆగాలి



అన్ని రకాల రిజర్వేషన్లూ ముగిసిపోవాలి. వీటికి ఏదో ఒక కాల పరిమితి ఉండాలి. అంతం అనేది లేకుండా కొనసాగకూడదు.

– ప్రభుజ్యోత్ సింగ్, ఐఏఎస్ అధికారి

'మై హూ నా' హామీ తీరేదెన్నడు?

సందర్భం



జాన్‌సన్ చోరగుడి

సెగ ఎటు నుంచి తగిలితేనేమి, ఎనిమిదేళ్లుగా పిడచ కట్టుకుని ఉన్న ఘనీభవ స్థితి అయితే నెమ్మదిగా కరగడం మొదలయ్యినట్లుగా ఉంది. ఉన్నట్టుండి 'ఢిల్లీ' ఫోకస్ ఈ ఏడాది చివరి నాటికి ఆంధ్రప్రదేశ్‌పైన పడడంతో ఇక్కడి ప్రజలు, ఇటువంటి మార్పు పట్ల ఆనందంగా ఉన్నారు. కేంద్రం 2015 డిసెంబర్ 23న 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' ప్రకటన చేశాక, ఆ దిశలో తొలి అడుగులు ఆశాజనకంగా అనిపిస్తున్నాయి. అంతే కాదు ప్రధాని విశాఖ పర్యటనకు ముందు ఒక 'పైలెట్ టీమ్ టూర్' కూడా జరిగింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ 'సదరన్ క్యాంపస్' ప్రారంభించడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్; వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పోర్టు సిటీ కాకినాడ వచ్చి... విదేశీ వాణిజ్యం మా ప్రభుత్వ ప్రాధాన్యం అని చెప్పివెళ్లారు.

మరి ఇది మీ ఆంతర్యం కనుక అయితే, మీరు మాకు చేస్తున్న మంచిని 'ఓపెన్'గా మాతో పంచుకోవడానికి ఇబ్బంది ఎందుకన్నదే మాకు అర్థం కానిది. విశాఖ రైల్వే జోన్ విషయమే తీసుకుందాం. ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ, విశాఖ పట్టణంలోని వైర్ లెస్ కాలనీలోని 35 ఎకరాల రైల్వే భూమిలో రూ. 110 కోట్లతో జోనల్ కేంద్ర కార్యాలయాల భవన నిర్మాణానికి ఆర్కిటెక్టులు ఇచ్చిన డిజైన్లు రైల్వేబోర్డు వద్ద పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ రైల్వే అధికారి ఒకరు చెప్పినట్టు ఓ ఆంగ్ల పత్రిక రాసింది. ఇంతలో ఈ నెల 23న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో– 'సెంటర్–స్టేట్ కోఆర్డినేషన్ మీటింగ్' అంటూ, అందులో రైల్వే జోన్ ఎజెండా మొదటి అంశమని చంద్రగ్రహణం రోజు తెలిపింది. జోన్ ప్రతిపాదన మీ వద్ద సజీవంగా ఉందనే సంగతి ఇంత డొంక తిరుగుడుగా అదీ ఒక ఆంగ్ల పత్రిక చేసిన వెతుకులాట వల్ల మాకు తెలియడం, అంత అవసరమా?

ప్రజలు, ప్రాంతము రెండూ ఇక్కడివే అయినప్పుడు; మాకు జరిగే ఏ మేలైనా, అది మీరు అధినేతగా ఉన్న ఈ దేశంలోనిదే కదా? ఈ రాష్ట్రం కొత్తగా ఏర్పడ్డప్పటి నుంచి మీరు ఢిల్లీ పీఠంపై ఉంటూ, ఇంకా మా రాష్ట్రాన్ని 'ఓన్' చేసుకోలేక పోవడం ఏమిటి? మోదీజీ విశాఖ రాక వైపు చూస్తున్నప్పుడు, ఇవన్నీ రాష్ట్ర ప్రజలకు కలుగుతున్న సహజ సందేహాలు.

ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం ఐల్యాండ్ నుంచి నవంబర్ 10–11 మధ్య క్షిపణి ప్రయోగం జరగనుంది. క్షిపణి సముద్రం మీద శ్రీలంక, ఇండోనేషియాల మధ్యగా ప్రయాణించే దిశలో 2,200 కి.మీ. మేర 'నో ఫ్లయ్ జోన్' అని మనదేశం ఇప్పటికే ప్రకటించింది. అయితే, మన క్షిపణి అనుపానులు అంచనా వేయడానికి, ఇప్పటికే చైనా స్పై షిప్ 'యువాన్ వాంగ్–6' హిందూ మహాసముద్రం జలాల్లోకి ప్రవేశించి, బాలి దీవుల్లో బస చేసింది. మన తూర్పు సరిహద్దున చైనా చేస్తున్న రెండవ కవ్వింపు చర్య ఇది. ఆగస్టులో కమ్యూనికేషన్ – నిఘా చర్యల రీసెర్చ్ నౌక – 'యువాన్ వాంగ్–5' శ్రీలంక హంబన్ తోట పోర్టులో వారం రోజులు తిష్ట వేసింది. అది ఇక్కడకు వచ్చి వెళ్ళాక, మన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ... చైనా నౌకలు శాటిలైట్ మోనిటరింగ్‌తో రాకెట్లు, ఇంటర్ కాంటినెంటల్ మిస్సైల్స్ ఉపయోగించే అవకాశం ఉందనీ, మన న్యూక్లియర్ స్టేషన్లు, పోర్టుల భద్రతకు నిఘా, రక్షణ చర్యలు చేపట్టాలనీ తమిళనాడు రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీని ఆదేశించింది.

ఈ నేపథ్యంలో ప్రధాని ఈస్టర్న్ నేవల్ కమాండ్ కేంద్రమైన విశాఖ వస్తున్నారు. భారత ప్రభుత్వ ప్రాదేశిక అవసరాల బాధ్యతతో, 'ఫెడరల్' స్ఫూర్తితో దేశం తూర్పు సరిహద్దుల్లో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనలో కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నది. వాటిని గ్రేడింగ్ చేసి ర్యాంకులు వెల్లడించేది మీరే కనుక, మా పురోగతి ముందు మీకు తెలిశాకే, అవి మాకు తెలిసేది. కేరళలో– ఈ ఏడాది ఎం.ఏ. 'డీసెంట్రలైజేషన్ అండ్ లోకల్ గవర్నెన్స్' పీజీ కోర్సు మొదలుపెడితే, ఇక్కడది ఇప్పటికే అమలులో ఉంది. ఇక్కడ స్థిరమైన ప్రభుత్వం ఉండటం, ఇప్పుడు దేశం అవసరం. దీని పట్ల మీ 'ఓపెన్ మైండ్' మా అవసరం.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

ఇండియాగేట్‌కు గుమ్మడికాయ కడదాం!

సారాంశం

సరికొండ చలపతి

ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణ..

'ఎలాన్ మస్క్ 44 బిలియన్ డాలర్లు పెట్టి ట్విట్టర్ కొన్నాడురా'

'వార్నీ! అంత డబ్బు ఎందుకు వేస్ట్ చేశాడు? మనలాగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోయేది కదా!''

– ఫ్రెండ్ చమత్కారం

.....

దాదాపు ఇంతే చమత్కార సూచన ఓ ముఖ్యమంత్రి నుంచి సీరియస్‌గా వచ్చింది. చూడండి:

''ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదు. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బాగా తగ్గుతోంది. సామాన్య ప్రజలు కష్టాల్లో కూరుకుపోతున్నారు. దేవతల ఆశీస్సులు కావాలి. ఆ చిత్రాలను కరెన్సీ నోట్లపై ముద్రిస్తే వారి ఆశీర్వాదాలు మనకు లభిస్తాయి. మన నోట్లపై గణేశ్, లక్ష్మీదేవిల చిత్రాలు వేద్దాం. అప్పుడే ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెంది భారతదేశం సంపన్న దేశంగా మారుతుంది.'' – ఈ అరవింద్ కేజ్రీవాల్ సూచనను జనం కాసింత క్రేజీ ఐడియాగానే చూశారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్, వల్లభభాయ్ పటేల్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, అబ్దుల్ కలాం ఇలాంటి వారి బొమ్మలు కూడా ఉండాలన్న దేశభక్తితో పాటు... లక్ష్మీదేవి, గణేశ్ లాంటి దేవుళ్ల ఫొటోలు ఉండాలన్న మతపర విశ్వాసాలు ఆక్షేపణీయమేమీకాదు.

– కానీ.. పడిపోతున్న రూపాయి విలువ పెంచడానికి, ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టడానికి మూలికా వైద్యం స్థాయి చిట్కాలు... అదీ ఓ ముఖ్యమంత్రి నోట, అందునా ఓ ఐఐటీ మేధావి నోటి వెంట రావడం చర్చకు దారితీసింది.

రిషి సునాక్! వింటున్నారా...

కాసింత ముందుగా ఈ చిట్కా చెప్పివుంటే బాగుండేది. ఆర్థిక వ్యవస్థను దారిలో పెట్టలేక 45 రోజులకే బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ రాజీనామా చేయాల్సిన అవసరం లేకపోయేది. బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరి, ధరాభారం మోయలేక సామాన్యులు నానా యాతనలు పడుతున్నారు. మినీ బడ్జెట్‌తో దాన్ని బాగు చేయలేక మార్కెట్లన్నీ కుదేలయి పోతుంటే విధిలేక ప్రధానిగా ట్రస్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇంత అద్భుతమైన ఐడియా ఆమె చెవిలో వేసుంటే బాగుండేది కదా, అక్కడి కరెన్సీపై వాళ్ల దేవుళ్ల బొమ్మ ముద్రించి బయటపడేది కదా. –అని నెటిజన్లు చురకలేస్తున్నారు.

''రిషి సునాక్ .. వింటున్నారా? కేజ్రీవాల్ చెప్పిన మేడ్ ఈజీ ఫార్ములా, చిన్న చిట్కాతో మీ దేశం బాగుపడిపోతుంది.. అంటూ సరదా కామెంట్లు పెడుతున్నారు.

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతోపాటు అనేక కారణాలతో ప్రధాన దేశాలు ఆర్థిక మాంద్యం దిశలో నడుస్తున్నాయి. 2023 కల్లా దాదాపు సగానికి తగ్గొచ్చన్న సంకేతాలు వినపడుతున్నాయి. కేజ్రీవాల్ జీ! కరెన్సీ నోట్లపై దేవుళ్ల బొమ్మలు ముద్రించాలని ప్రధాని మోదీకి రాసే లేఖలో... **ఈ చిట్కాను ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో కూడా ప్రస్తావించాలని కోరండి. ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యంలోంచి బయటపడే అవకాశం ఉంది.**

మాంకాళమ్మ, పోలేరమ్మ...

ఇదేమీ సీరియస్ కాదు. మోదీ మత రాజకీయాలపై కేజ్రీవాల్ వ్యంగాస్త్రమిది. ముల్లును ముల్లుతోనే తీయాలనే వ్యూహం. ఇప్పుడు చూడండి బీజేపీ గింగిరాలు తిరుగుతోంది. –అని ఓ అభిమాని ఆనందం.

అవునవును.. రూపాయికీ, గుజరాత్ ఎన్నికల్లోనూ దైవసాయం అవసరమే. అయితే, దీన్ని ఇంకా పవర్‌ఫుల్‌గా వాడుకోవచ్చుననే సలహా కూడా వినిపిస్తోంది.. గణేశ్, లక్ష్మీదేవిలతో పాటు మాంకాళమ్మ, పోలేరమ్మ, ఉప్పలమ్మ, కట్టమైసమ్మలాంటి గ్రామ దేవతల ఫొటోలు కూడా కరెన్సీ నోట్లపై ముద్రిస్తే... రూరల్ ఓటింగ్ అంతా మనకే. – సూపర్ ఐడియా!

గుమ్మడికాయ మంత్రం...

కేజ్రీవాల్ దారిలోనే ఇంకాస్త అడుగు ముందుకు వేసిన తుంటరి కుర్రాళ్లు ఇలా సూచిస్తున్నారు. ''నిరుద్యోగం పెరిగిపోతోంది, పేదరికం పెరిగిపోతోంది, మన దేశ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే, జనం చేతిలో డబ్బులు ఆడడం లేదు. విద్య, వైద్యం పరిస్థితి ఏం బాగాలేదు. గ్రామాల పరిస్థితి అంతంతే. పట్టణాల్లో కాలుష్యం బాగా పెరిగి పోతోంది. టపాసులతో దీపావళి చేసుకునే పరిస్థితి లేదు. చాలా విషయాల్లో ఇతర దేశాలకన్నా వెనుకబడిపోతున్నాం. పైగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనాలనుంచి నరదిష్టి ఎక్కువయింది. వీటన్నింటికి విరుగుడుగా ఇండియా గేట్‌కు 'గుమ్మడి కాయ' కడితే ఫలితం ఉంటుందేమో. మేమయితే మా ఇంటికి గుమ్మడి కాయే కడుతున్నాం.'' – మంచి చిట్కా

యాక్ట్ ఆఫ్ గాడ్.. అంతా దైవికం!

ఇలా దేవుడిని లాగడం గతంలో కూడా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. కరోనా వల్లే ఆర్థిక వృద్ధిరేటు తగ్గిందనీ, జీడీపీ తగ్గుముఖం పట్టడానికి, జీఎస్టీ వసూళ్లు తగ్గడానికి అదే కారణం అని అంతా 'యాక్ట్ ఆఫ్ గాడ్' (దైవిక చర్య) అనడం పెను దుమారమే లేపింది. మీ తప్పిదాలను దేవుడిపై నెడతారా అని విపక్షాలవారు, నెటిజన్లు విరుచుకు పడ్డారు. ఇది యాక్ట్ ఆఫ్ గాడ్ కాదనీ, యాక్ట్ ఆఫ్ గవర్నమెంట్ అనీ విమర్శలు గుప్పించారు. అంతకుముందు సంవత్సరం పరిస్థితేమిటని ప్రశ్నించారు. యాక్ట్ ఆఫ్ గాడ్ పేరు మీద ప్రజలు పన్ను చెల్లించడం మానేస్తే ఓకేనా అని ప్రశ్నించారు. కాస్త కొంటె నెటిజన్లు ఇండియాలో ముక్కోటి దేవతలు ఉన్నారు. ఇంతకీ ఏ దేవుడి పుణ్యం ఇది అని వెక్కిరించారు. ముస్లిం దేవుళ్లు, క్రిస్టియన్ దేవుళ్లు, ఇతర మైనారిటీ మతాల దేవుళ్ల పాత్ర ఏమైనా ఉందా అని ట్రోల్ చేశారు. వారందరినీ కోర్టుకు లాగుతున్నారా లేదా అని వ్యంగాస్త్రాలు సంధించారు.



కరెన్సీకి ఎక్స్‌పైరీ డేట్...

కరెన్సీ ప్రస్తావన రాగానే గుర్తుకు వచ్చేది నవంబర్ 8, 2016 నాటి డీమానిటైజేషన్. పెద్ద నోట్ల రద్దు జరిగి ఇప్పటికి ఆరేళ్లు. నల్లధనం ఏమీ బయటికి రాకపోగా దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిందని విమర్శలు వస్తూనే ఉన్నాయి.

ఈ సందర్భంగా కరెన్సీపై 10వ తరగతి కుర్రాడి ఐడియా ఒకటి సోషల్ మీడియాలో నడుస్తోంది. అన్ని వస్తువులకు ఎక్స్‌పైరీ డేట్ ఉంటోంది కదా, కరెన్సీ నోట్లపై కూడా ఎక్స్‌పైరీ డేట్ ఎందుకు ఉండదు? ఎన్నేళ్ల దాకా చెల్లుబాటు అవ్వాలో మేధావులు ఆలోచించి వాటిపై కూడా ఐదేళ్లో ఆరేళ్లో ఎక్స్‌పైరీ డేట్ ముద్రించాలి. ఆ టైమ్ దాటాక ప్రజలు పాత నోట్లు తీసుకువెళ్లి కొత్తవి తీసుకుంటారు. అంటే కరెన్సీ అంతా బ్యాంకుకు వస్తుంది. ఇక నల్లధనం అనే మాట ఉండదు కదా.

– మన ఐఐటీయన్ సీఎం ఐడియా కన్నా టెన్త్ క్లాస్ స్టూడెంట్ ఐడియా బాగున్నట్లుంది కదా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.తదియ సా.6.21 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మృగశిర పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ఉ.10.33 నుండి 12.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.07 నుండి 12.52 వరకు, **అమృతఘడియలు:** రా.8.54 నుండి 10.38 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం** 6.06; **సూర్యాస్తమయం** 5.22.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఏపీ ఎంఈవోస్ అసోసియేషన్ మద్దతు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ తరఫున శాసన మండలి స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఏపీ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని అసోసియేషన్ నేతలు కలిశారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న శాసన మండలి ఎన్నికల్లో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలకు తమ మద్దతు ఉంటుందని అసోసియేషన్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎంఈవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరత్నం, కోశాధికారి ఎస్. నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు విశాఖకు పవన్ కళ్యాణ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం విశాఖకు రానున్నారు. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. రాత్రి 8.30 గంటలకు ప్రధాన మంత్రి మోదీతో నేవీ అతిథి గృహమైన చోళలో భేటీ అవుతారు. తిరిగి 13వ తేదీన సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- టీడీపీలో ఒకే సామాజికవర్గం మధ్య వర్గపోరు
- రసాభాసగా పార్టీ సంస్థాగత కమిటీ నియామక సమావేశం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో తెలుగుదేశం కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. గురువారం పార్టీ సంస్థాగత కమిటీ సమావేశం సందర్భంగా మరోసారి నియోజకవర్గంలో నాయకుల వర్గవిభేదాలు బహిర్గతమయ్యాయి. మాటలు పెరిగి కుర్చీలతో దాడులు చేసుకున్నారు. గతంలో ఇక్కడ పోటీచేసి ఓటమిపాలైన మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్యానంతరం పార్టీ అధిష్టానం ఎవరికీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి అప్పగించలేదు. దీంతో నియోజకవర్గంలో ఒకే సామాజికవర్గానికి చెందిన కోడెల శివరాం, మాజీ శాసనసభ్యుడు వై.వి.ఆంజనేయులు, తెలుగుయువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరి మల్లి) ఎవరికివారు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం పార్టీ సంస్థాగత కమిటీ విషయంలో సత్తెనపల్లిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కొండెపి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయస్వామి, పార్టీ నరసరావుపేట పార్లమెంట్ అధ్యక్షుడు జి.వి. ఆంజనేయులు, మాజీమంత్రి నక్కా ఆనందబాబు, మాజీ శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హాజరయ్యారు. అప్పటికే మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు, మన్నెం శివనాగమల్లేశ్వరరావు తదితరులు కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలో ఉన్నారు. కోడెల శివరాం తన వర్గంతో ర్యాలీగా ఎన్టీఆర్ భవన్ వద్దకు వచ్చి ఇన్‌చార్జిని నియమించకుండా సంస్థాగత కమిటీ నియామకాలు ఏమిటని ప్రశ్నించారు. స్థానికులుకాని వారి సలహాలు అవసరం లేదంటూ నినదించారు. ఈ క్రమంలో కార్యకర్తల మధ్య వాగ్వాదం తలెత్తింది. పరస్పరం కుర్చీలతో కొట్టుకున్నారు. సమావేశానికి వచ్చిన పరిశీలకులు ఇన్‌చార్జి నియామక విషయం అధిష్టానం చూసుకుంటుందని, ప్రస్తుతం సంస్థాగత కమిటీ సమావేశం జరుగుతుందని చెప్పారు. అయినా గొడవ ఆగకపోవడంతో మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు, ముఖ్య నాయకులు బయటకు వచ్చారు. తెలుగుతమ్ముళ్ల గొడవను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై శివరాం వర్గీయులు దురుసుగా ప్రవర్తించడమేగాక సెల్‌ఫోన్లు లాక్కున్నారు. దీంతో సమావేశాన్ని కవర్ చేయకుండా మీడియా ప్రతినిధులు బాయ్‌కాట్ చేశారు.

నిర్దేశించిన ధరలకు రొయ్యలు కొనాల్సిందే

ప్రాసెసింగ్ యూనిట్లకు ఆక్వా సాధికార కమిటీ హెచ్చరిక



సమావేశంలో మంత్రి అప్పలరాజు, వడ్డి రఘురాం, పూనం మాలకొండయ్య తదితరులు

సాక్షి, అమరావతి: 'ఆక్వా రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. 100 కౌంట్ రొయ్యలకు కనీసం రూ.210 తగ్గకుండా చెల్లించాల్సిందే. ఇదే రీతిలో మిగిలిన కౌంట్ ధరలు కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేయాల్సిందే. ఇష్టమొచ్చినట్టు రొయ్యల ధరలు తగ్గిస్తే చర్యలు తప్పవు' అని ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులను ఆక్వా సాధికార కమిటీ హెచ్చరించింది. ఆక్వా రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, సీడ్, ఫీడ్ కంపెనీల ప్రతినిధులతో ఏపీఐఐసీ భవనంలో గురువారం ఆక్వా సాధికార కమిటీ భేటీ జరిగింది. రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచే విషయంలో ప్రాసెసింగ్ కంపెనీలు పెద్ద మనసు చాటుకోవాలని కోరారు. కనీసం10 రోజులపాటు ఇవే ధరలు కొనసాగాలని, ప్రభుత్వం రోజూ కొనుగోళ్లు, ధరలను సమీక్షిస్తుందని చెప్పారు. ధరల విషయంలో ప్రతి 10 రోజులకు ఒకసారి సమావేశమై తగిన నిర్ణయాలు తీసుకుందామని సూచించారు. మార్కెట్ బాగోలేదనే సాకుతో ధరలను తగ్గిస్తామంటే సహించేది లేదన్నారు. ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ మాట్లాడుతూ రైతులను గందరగోళపరిచేలా కంపెనీలు వ్యవహరించొద్దని హితవు పలికారు. ధరలు, మార్కెట్ పరిస్థితులపై ప్రతి రోజు మానిటరింగ్ చేస్తున్నామని చెప్పారు. రైతుల వద్ద ఉన్న సరుకును పూర్తి స్థాయిలో నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోళ్ల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడదన్నారు. జాతీయ రొయ్య రైతుల సంఘం అధ్యక్షుడు ఐపీఆర్ మోహన్‌రాజు మాట్లాడుతూ ప్రాసెసింగ్ కంపెనీలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, వాళ్లెంత కొనుగోలు చేయగలరో ముందే చెబితే ఆ మేరకే ఇక నుంచి ఉత్పత్తి చేస్తామని చెప్పారు. మార్కెట్ లేనప్పుడు ఎందుకు 80 బిలియన్ల సీడ్, 16 లక్షల టన్నుల ఫీడ్ ఉత్పత్తి చేస్తున్నారని ప్రశ్నించారు. యూఎస్ మార్కెట్ ఆగిపోయిందని, చైనా మార్కెట్ ఓపెన్ కాలేదని, అందువల్లే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయలేకపోతున్నామని పలువురు ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు సాధికార కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అయినా రైతుల వద్ద ఉన్న సరుకును ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, కమిషనర్ కన్నబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు వద్దు

ప్రభుత్వంతో చర్చల అనంతరం నాలుగు నెలలుగా రాష్ట్రంలో రొయ్యల మేతల్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తున్నామని రొయ్యల మేత తయారీదారుల సంఘం పేర్కొంది. ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ రొయ్యల రైతుల అభ్యర్థన, ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కానీ, రొయ్యల మేత తయారీదారుల నుంచి రూ.5 వేల కోట్లు వసూలు చేయడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో రొయ్యల మేత తయారీ పరిశ్రమ ఏడాది టర్నోవరే రూ.5 వేల కోట్లు ఉంటుందని తెలిపింది. అలాంటిది ప్రభుత్వానికి రూ.5 వేల కోట్లు లంచంగా ఇవ్వనున్నారని కొందరు రాజకీయ నేతలు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొంది.

పోషకాహారం అందజేతలో ఏపీ అగ్రగామి

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి


ఉయ్యూరు సివిల్ సప్లయ్స్ గోదాములో సరుకులను పరిశీలిస్తున్న విజయ ప్రతాప్‌రెడ్డి

ఉయ్యూరు: ప్రజలకు పోషకాహారం అందించడంలో దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. ఫుడ్ కమిషన్ రాష్ట్ర బృందం గురువారం కృష్ణా జిల్లా ఉయ్యూరులో పర్యటించింది. కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని పదార్థాల నాణ్యతను తెలుసుకున్నారు. నాడు-నేడు కింద పాఠశాలలో చేపట్టిన ప్రగతిని పరిశీలించి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలోని పౌరసరఫరాల గోదామును సందర్శించి సరుకుల నాణ్యత పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కడవకొల్లు-కాటూరు మధ్య అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసే కోళ్లఫారంను సందర్శించారు. విజయ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు పథకాలను అందించాలన్నారు.

అటవీ సంరక్షణలో ప్రజా భాగస్వామ్యం

- మంత్రులు పెద్దిరెడ్డి, బూడి
- తిరుపతి, విజయవాడలో రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం

తిరుపతి అలిపిరి/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అటవీ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీ, మైనింగ్, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. అడవుల సంరక్షణలో అటవీ శాఖ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో అటవీ అమరవీరుల దినం సందర్భంగా జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర జూపార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 23మంది అటవీ సిబ్బందికి ఆయన నివాళులర్పించారు. అటవీ సంరక్షణలో అటవీ సిబ్బంది ప్రాణత్యాగం చేయడం సంస్మరణీయమన్నారు. 1991లో నవంబరు 10న రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ పేరుగాంచిన గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో కర్ణాటక రాష్ట్రంలో అశువులు బాసిన నాటి నుంచి ఈ సంస్మరణ దినం జరుపుకుంటున్నట్లు తెలిపారు. అడవులను మరింత పెంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. విజయవాడలోని అటవీ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని తిరుపతిలో బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పీసీసీఎఫ్ మధుసూధన్ రెడ్డి, ఏపీసీసీఎఫ్ గోపినాథ్, ఎంపీ గురుమూర్తి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఇతర ఐఎఫ్ఎస్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- 5వ ఇండియా అగ్రి బిజినెస్ సమ్మిట్‌లో ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) ఎండీ గెడ్డం శేఖర్‌బాబు చెప్పారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 5వ ఇండియా అగ్రి బిజినెస్ సమ్మిట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, పాడి ఉత్పత్తుల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఏపీ.. అరటి, మామిడి, మిరప, పసుపు, కూరగాయలు, జీడిపప్పు వంటి ఉద్యానపంటలు, చేపలు, రొయ్యల ఉత్పత్తుల్లో రికార్డులను తిరగరాస్తోందని చెప్పారు. గడిచిన ఏడాది ఏపీ నుంచి 5.70 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పత్తులు, రూ.13,782 కోట్ల విలువైన 52.88 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని తెలిపారు. పండ్లు, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ వైపు ప్రపంచ దేశాలు సైతం చూస్తున్నాయన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ మొబైల్ క్యాంపులు

- ఈ నెల మూడో వారంలో పాఠశాలలు, సచివాలయాలు కేంద్రంగా నిర్వహణ
- నూరుశాతం ఆధార్‌కు బయోమెట్రిక్ చేయడమే లక్ష్యం

సాక్షి, అమరావతి: ఆధార్‌కు బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ నూరు శాతం పూర్తి చేసేందుకు ఈ నెల మూడో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ మొబైల్ క్యాంపులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఈ క్యాంపులను నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కోటి మంది ఆధార్‌కు బయోమెట్రిక్ నమోదు కాలేదని, డిసెంబర్ నెలాఖరులోపు వారందరి బయోమెట్రిక్‌ను సేకరించాలని కేంద్రం స్పష్టం చేసింది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,950 ఆధార్ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా డిసెంబర్ నెలాఖరుకు నూరు శాతం ఆధార్‌కు బయోమెట్రిక్ సేకరించడం సాధ్యం కాదని, పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా మొబైల్ క్యాంపులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ మొబైల్ క్యాంపుల సమాచారాన్ని ముందుగా వలంటీర్ల ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలని సూచించింది. విద్యా శాఖ భాగస్వామ్యంతో పాఠశాలల పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ను సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రత్యేక క్యాంపుల్లో భాగంగా ఒక్కో కేంద్రం ద్వారా కనీసం 200 బయోమెట్రిక్‌ను సేకరించాలని స్పష్టం చేసింది. ప్రత్యేక క్యాంపుల నిర్వహణ, పర్యవేక్షణకు మండల, డివిజన్ వారీగా అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించాలని తెలిపింది. పాఠశాలలు, సచివాలయాల్లో రోజు వారీగా ఆధార్ బయోమెట్రిక్ మ్యాపింగ్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్లకు సూచించింది.

కేంద్ర పర్యావరణ మంత్రిని కలిసిన ఎంపీ బాలశౌరి


కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను పార్లమెంట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి న్యూఢిల్లీలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి అన్ని పర్యావరణ అనుమతులను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఎంపీ బాలశౌరి కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి అనుమతుల మంజూరు విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పర్యావరణ అనుమతుల విషయంలో కేంద్ర మంత్రి స్పందనకు ఎంపీ బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

14న విశాఖ బీచ్ రోడ్డులో కార్తీక దీపోత్సవం

ఏర్పాట్లను సమీక్షించిన టీటీడీ జేఈవో సదా భార్గవి


స్వరూపానందేంద్రకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న సదా భార్గవి

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు)/సింహాచలం: టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 14న విశాఖ ఆర్కే బీచ్ తీరంలో కార్తీక మహా దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లపై ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ జేఈవో సదా భార్గవి గురువారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ బీచ్ రోడ్డులో వేదిక నిర్మాణం, దీపోత్సవంలో భక్తులు భారీ ఎత్తున పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఏర్పాట్లలో భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట వేయాలని ఆదేశించారు. 14న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల మధ్య ఈ కార్యక్రమం జరుగుతున్నందున తగినన్ని ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. తిరుమల నుంచి స్వామితో పాటు అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలు ముందుగానే విశాఖ చేరుకుంటాయన్నారు. 14న సాయంత్రం ఉత్సవ మూర్తుల విగ్రహాలతో ఊరేగింపుగా భక్తులు ఆర్కే బీచ్‌కు చేరుకుంటారన్నారు. అనంతరం వైభవంగా దీపోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

శారదా పీఠాధిపతికి ఆహ్వానం

కార్తీక మహా దీపోత్సవంలో పాల్గొనాలని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని సదా భార్గవి ఆహ్వానించారు. చినముషిడివాడ లోని విశాఖ శ్రీ శారదాపీఠాన్ని గురువారం సందర్శించి స్వరూపానందేంద్రకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్నారు. రుషికొండలో టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు.

ఏపీలో బోధనకు ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల కితాబు

గుడ్లవల్లేరు : ఏపీలో బోధన విధానాన్ని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మెచ్చుకున్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సోనాల్‌సిల్వ గుండె(మహారాష్ట్ర), నళినీకుమార్ మిశ్రా(బిహార్)లు గురువారం కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)ను సందర్శించారు. డైట్‌లో జరుగుతున్న బోధన, బోధనేతర కార్యక్రమాల్లో ప్రతి అంశాన్నీ డైట్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణను సోనాల్ సిల్వ గుండె, నళినీకుమార్ మిశ్రాలు అడిగి తెలుసుకున్నారు. వుయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా జరిగిన పుస్తక సమీక్షలను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్, గణిత ప్రయోగశాల, సైన్స్ ల్యాబ్, భాషా ప్రయోగశాలలను చూసి ప్రశంసించారు. డైట్ రేడియో స్టేషన్‌ను తిలకించారు.

అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం వెళ్లే భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు డివిజన్ల మీదుగా కొల్లాం, కొట్టాయానికి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. ఈ రైళ్లు తిరిగి కొల్లాం, కొట్టాయం నుంచి సికింద్రాబాద్‌కు నడుస్తాయని తెలిపారు. సికింద్రాబాద్-కొల్లాం (07117) ఈ నెల 20, డిసెంబర్ 4, 18, జనవరి 8 తేదీల్లో, కొల్లాం-సికింద్రాబాద్(07118) ఈ నెల 22, డిసెంబర్ 6, 20, జనవరి 10 తేదీల్లో నడుస్తాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్-కొల్లాం (07121) ఈ నెల 27, డిసెంబర్ 11, 25, జనవరి 1, 15 తేదీల్లో, కొల్లాం-సికింద్రాబాద్ (07122) ఈ నెల 29, డిసెంబర్ 13, 27, జనవరి 3, 17 తేదీల్లో, సికింద్రాబాద్-కొల్లాం (07123) ఈ నెల 21, 28 తేదీల్లో, కొల్లాం-సికింద్రాబాద్ (07124) ఈ నెల 23, 30 తేదీల్లో, సికింద్రాబాద్-కొట్టాయం (07125) ఈ నెల 20, 27 తేదీల్లో, కొట్టాయం-సికింద్రాబాద్ (07126) ఈ నెల 21, 28 తేదీల్లో నడుస్తాయని అధికారులు వివరించారు.


పోలవరం పవర్ బోర్డు పనులు సంతృప్తికరం

- సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం వెల్లడి


పోలవరం పనులను పరిశీలిస్తున్న సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద చేపట్టిన పవర్‌బోర్డు పనులు సంతృప్తికరంగా ఉన్నాయని నిపుణుల బృందం పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం పుణెలోని కేంద్ర జల సంఘం పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం పరిశీలించింది. స్పిల్‌వే వద్ద గ్యాలరీలో చేపట్టిన పవర్ బోర్డు పనులను డాక్టర్ ఎం.సెల్వ బాలన్, జేకే సింగ్, ఖలీల్ భగవాన్ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలవరం వ్యూ పాయింట్ నుంచి పనులను పరిశీలించి పవర్‌తో పనిచేస్తున్న మిషనరీ, అవి పనిచేస్తున్న విధానం గురించి ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. గేట్లు ఎత్తడానికి హైడ్రాలిక్ సిలిండర్లు వినియోగించేందుకు ఏర్పాటుచేసిన పనులను, పరికరాల నాణ్యత ప్రమాణాలను వారు పరిశీలించారు. పనులన్నీ బాగానే ఉన్నాయని చెప్పారు. దేశంలోని ప్రాజెక్టులన్నింటిలోను ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న పోలవరం ప్రాజెక్టులో అత్యున్నత సాంకేతికతను వినియోగిస్తున్నారని, తక్కువ సమయంలో వేగంగా నిర్మాణం చేస్తున్నారని, అయినప్పటికీ ఎక్కడా నాణ్యత లోపించకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు బాగున్నాయని ప్రశంసించారు. ప్రాజెక్టులో వినియోగిస్తున్న సాంకేతికత వల్ల ప్రాజెక్టు పరిస్థితిని ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ చేసేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యంగా వరదలు వంటి సమయంలో ప్రాజెక్టుకు వచ్చే వరద నీరు, దిగువకు వెళ్లే వరద, ప్రాజెక్టు ఉష్ణోగ్రత తదితర సాంకేతిక విషయాలన్నీ తెలుసుకోవచ్చని చెప్పారు. సీడబ్ల్యూసీ, పీపీఏ, వ్యాప్‌కోస్, సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం సభ్యులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. వారివెంట డీఈలు వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, మాధవరావు ఉన్నారు.

విశాఖ భూ కుంభకోణాలపై ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేస్తాం : బీజేపీ


మాట్లాడుతున్న సీఎం రమేష్, పురందేశ్వరి తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): విశాఖ భూ కుంభకోణాలపై ఈడీ, సీబీఐ సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు భారతీయ జనతా పార్టీ నాయకులు చెప్పారు. విశాఖపట్నంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి మాట్లాడుతూ భూ కుంభకోణాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని విమర్శించారు. విశాఖలో దసపల్లా భూములతో పాటు విశాఖలోని అనేక ప్రాంతాల్లో జరిగిన భూ కబ్జాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. భూ కుంభకోణాల్లో దర్యాప్తును కోరుతూ ఈడీ, సీబీఐలకు ఫిర్యాదులు చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టయిన శరత్‌చంద్ర ఎవరి మనిషో, అరబిందో కంపెనీ ఎవరిదో రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించాలన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో దొంగలు హడావుడి చేస్తున్నారన్నారు. విశాఖ పర్యటనలో ప్రధాని మోదీ ప్రారంభిస్తున్న తొమ్మిది ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సృష్టిస్తున్న విధ్వంసాలతో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకురావడం లేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

మైన్‌పురి బరిలో ములాయం కోడలు



లక్నో: యూపీలోని మైన్‌పురి లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 5న జరగనున్న ఉప ఎన్నికకు ములాయం సింగ్ కోడలు డింపుల్ యాదవ్ బరిలో దిగనున్నారు. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) వ్యవస్థాపకుడు, మైన్‌పురి ఎంపీ ములాయం ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఖాళీ అయిన ఈ సీటుకు తమ అభ్యర్థిగా డింపుల్‌ను గురువారం ఆ పార్టీ ప్రకటించింది. ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ 2012–14 సంవత్సరాల్లో కన్నౌజ్ ఎంపీగా కొనసాగారు. 1996 నుంచి మైన్‌పురి సమాజ్‌వాదీ పార్టీ కంచుకోటగా ఉంటోంది.

జిమ్‌లు, పార్కుల్లో మహిళలకు నో ఎంట్రీ

అఫ్గానిస్తాన్ తాలిబన్ ప్రభుత్వ ఆదేశాలు

కాబూల్: మహిళా హక్కులను, స్వేచ్ఛను హరిస్తూ అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని జిమ్‌లు, పార్కుల్లోకి మహిళల ప్రవేశాన్ని నిషేధించింది. ఈ వారం నుంచే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చాయని స్పష్టం చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు హిజాబ్ ధరించకపోవడం, పార్కులు, జిమ్‌లలో మహిళలు, పురుషులు విభజనను పాటించకపోవడం వల్లే తాజాగా ఈ ఆంక్షలను తీసుకువచ్చినట్లు ప్రభుత్వ ప్రతినిధి గురువారం చెప్పారు. 2021 ఆగస్టులో అధికారం చేజిక్కించుకున్న తాలిబన్లు.. మాధ్యమిక, ఉన్నత విద్యా పాఠశాలల్లో బాలికల ప్రవేశాన్ని నిషేధించారు. అనేక రంగాల్లో మహిళా ఉద్యోగులను తొలగించారు. బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖా ధారణ తప్పనిసరి చేశారు.

'పాత పింఛను' హామీ ఎన్నికల స్టంట్ కాదు: ప్రియాంక

సిర్మౌర్: పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ హామీ ఆర్థికంగా ఆచరణ సాధ్యం కాదంటూ బీజేపీ చేస్తున్న విమర్శలపై ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. తమ హామీ ఎన్నికల స్టంట్ కాదన్నారు. బడా పారిశ్రామిక వేత్తలు తీసుకున్న వేల కోట్ల రుణాలను రద్దు చేయడంపై ముందుగా సమాధానం చెప్పాలని కాషాయ పార్టీని ఆమె ప్రశ్నించారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో చివరిరోజైన గురువారం ప్రియాంక హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిర ప్రభుత్వాన్ని ఇవ్వలేదంటూ ప్రధాని మోదీ, ఇతర బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ప్రియాంక కొట్టిపారేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సుస్థిర ప్రభుత్వాన్ని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, ప్రభుత్వాలను అస్థిర పరుస్తున్నదెవరు?అని ఆమె బీజేపీని నిలదీశారు. రాష్ట్రంలో 15 లక్షల మంది నిరుద్యోగ యువత ఉండగా ఖాళీగా ఉన్న 63 వేల ప్రభుత్వ ఉద్యోగాలను బీజేపీ ప్రభుత్వం భర్తీ చేయడం లేదని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు లక్ష ఉద్యోగాలను కల్పించడంతోపాటు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తుందని ప్రియాంకా గాంధీ ప్రకటించారు. బీజేపీ హామీలను నమ్మవద్దని చెప్పారు. ధరల తగ్గింపు గురించి, ఉద్యోగ ఖాళీల గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదని వివరించారు.

బెంగాల్‌ను విడదీసేందుకు కుట్రలు: మమతా బెనర్జీ

రానాఘాట్: పశ్చిమబెంగాల్ నుంచి ఉత్తర ప్రాంతాన్ని విడదీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. అశాంతిని సృష్టించి ఉత్తర బెంగాల్ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో బిహార్, అంతర్జాతీయ సరిహద్దుల మీదుగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని దొంగచాటుగా తరలిస్తున్నారని చెప్పారు. ఇందు కోసం వీఐపీ వాహనాలను వాడుకుంటున్నారని చెప్పారు. డిసెంబర్ నుంచి రాష్ట్రంలో మత కలహాలను రేపేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారన్నారు. వీటిని అడ్డుకోవాలంటూ ఆయా ప్రాంతాల్లోని జిల్లాల ఉన్నతాధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు.

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు..ఐదుగురు మృతి

చెన్నై: తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాలోని ఓ బాణాసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి ఐదుగురు చనిపోగా పలువురు గాయాలపాలయ్యారు. తిరుమంగళం సమీపంలోని అజగుసిరాయ్ గ్రామంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పారు. సీఎం ఎంకే స్టాలిన్ ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు వైద్య సాయం అందిస్తామని తెలిపారు.


ఆజంఖాన్‌కు ఎదురుదెబ్బ

బరేలీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ సదర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ఆజంఖాన్‌కు రామ్‌పూర్ సెషన్స్ కోర్టులో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. విద్వేష ప్రసంగానికి సంబంధించిన కేసులో దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ వేసిన పిటిషన్‌ను సెషన్స్ కోర్టు కొట్టేసింది. దీంతో రామ్‌పూర్‌లో ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. విద్వేష ప్రసంగం కేసులో ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు అక్టోబర్ 27వ తేదీన ఆజంను దోషిగా తేల్చి మూడేళ్ల జైలు శిక్షవేసింది. దీంతో ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఆజంఖాన్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న విషయం తెల్సిందే. రామ్‌పూర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించాలనీ ఈసీ నిర్ణయించింది.

ఆ కులాల ఓటే శాసనం

హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులదే ఆధిపత్యం • ఓబీసీ, ఎస్టీ ఓట్లపై దృష్టి సారించిన బీజేపీ


రెండు పార్టీలు, రెండు కుటుంబాలు, రెండు కులాలు.. హిమాచల్ ప్రదేశ్ రాజకీయాలు వీటి చుట్టూనే తిరుగుతుంటాయి. రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులు ఈ రెండు కులాలే హిమాచల్ ప్రదేశ్ రాజకీయాలను శాసిస్తున్నాయి. రాజ్‌పుట్‌లు కింగ్‌లుగా అవతరిస్తే, బ్రాహ్మణులు కింగ్‌మేకర్లుగా తమ సత్తా చాటుతున్నారు.




హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో ప్రాంతం, కులం అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులు రాష్ట్రాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన 55 ఏళ్లలో ఐదుగురు ముఖ్యమంత్రులు రాజ్‌పుట్‌లైతే, ఒకే ఒక్క బ్రాహ్మిణ్ సీఎంగా శాంతకుమార్ రికార్డు సృష్టించారు. 1993–2017కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వీరభద్రసింగ్ , బీజేపీకి చెందిన ప్రేమ్ కుమార్ ధుమాల్ కుటుంబాలే రాజకీయాల్లో చక్రం తిప్పాయి. వీరు రాజ్‌పుట్ కుటుంబానికి చెందిన నాయకులే. బీజేపీకి చెందిన బ్రాహ్మణుడైన శాంత కుమార్ రెండు సార్లు రాష్ట్ర సీఎంగా సేవలందించడంతో ప్రధానంగా ఈ రెండు కులాలే రాజకీయాలపై ఆధిక్యత ప్రదర్శించాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రాజ్‌పుట్‌గా ఉంటే, పార్టీలో సంస్థాగత వ్యవహారాలు చూసే వ్యక్తి బ్రాహ్మిణ్‌గా ఉండడం ఇక్కడ రివాజుగా మారింది.

50% జనాభా ఆ రెండు కులాలే

రాష్ట్ర జనాభాలో రాజ్‌పుట్‌లు 32% ఉంటే, ఆ తర్వాత ఎస్సీలు 25% అధికంగా ఉన్నారు. ఇక బ్రాహ్మణులు 18%తో మూడో స్థానంలో ఉన్నారు. రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులు కలిపి జనాభాలో 50% వరకూ ఉండడంతో రాజకీయాలను వారే శాసిస్తున్నారు. రాజ్‌పుట్‌లో ఒక్కోసారి ఒక్కో పార్టీకి అండగా ఉంటూ ఉంటే బ్రాహ్మణులు ఎప్పుడూ బీజేపీ వైపే నిలిచారు. ఇక ఎస్సీలలో ప్రజాకర్షణ కలిగిన నాయకుడు లేకపోవడంతో వారు బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఊగిసలాడుతూ ఉంటారని రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రుల్లో అయిదుగురు వైఎస్ పర్మార్, ఠాకూర్ రామ్ లాల్, వీరభద్ర సింగ్, ప్రేమ్‌కుమార్ ధుమాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ రాజ్‌పుట్‌లు కాగా రెండు సార్లు సీఎంగా చేసిన శాంత కుమార్ ఒక్కరే బ్రాహ్మిణ్‌గా ఉన్నారు. తొలిసారిగా హిమాచల్ బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ దిగువ హిమాచల్ ప్రాంతంలో ఉండే పంజాబీ ఓట్లను కొల్లగొట్టడానికి చూస్తోంది. వీరంతా వ్యాపారంలోనే ఉన్నారు.





బీసీ, ఎస్టీలపై బీజేపీ వల

రాష్ట్రంలో అయిదేళ్లకొకసారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయానికి ఎదురొడ్డి వరసగా రెండోసారి నెగ్గాలని వ్యూహాలు పన్నుతున్న బీజేపీ ఎస్సీలు, ఓబీసీల ఓట్లు కొల్లగొట్టడానికి వ్యూహాలు పన్నుతోంది. రాష్ట్రంలోని హాతీ సామాజిక వర్గానికి ఎస్టీ హోదాను కల్పించే బిల్లును కూడా ఆమోదించింది. గత 50 ఏళ్లుగా హాతీలు ఎస్టీ హోదాల కోసం డిమాండ్ చేస్తున్నారు. సిర్మౌర్ గిరి ప్రాంతంలోని హాతీలకు ఎస్టీ హోదాను కల్పిస్తూ సెప్టెంబర్ 14న కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల 1.6 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం రద్దు సమయంలో ఈ ప్రాంతంలోనే దళితులు అత్యధికులు నిరసనలు చేపట్టారు. వారిలో అసంతృప్తిని చల్లార్చడానికి హాతీలకు ఎస్టీ హోదా కల్పిస్తూ బీజేపీ నిర్ణయం తీసుకుంది. ఈ సారి బీజేపీ రాజ్‌పుట్‌లకు ఇచ్చే టికెట్లను కాస్త తగ్గించి ఇతర కులాల వైపు మొగ్గు చూపించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు ఓబీసీలకు టికెట్లు ఇస్తే, బీజేపీ ఆరుగురుని నిలబెట్టింది. అందులోనూ ఓబీసీల్లో ప్రాబల్యమున్న ఘిర్త్ వర్గానికి టికెట్లు ఇచ్చింది. ఇక ఎస్టీల నాన్ రిజర్వ్ నియోజకవర్గాల్లో కూడా ముగ్గురు ఎస్టీలకు టికెట్లు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణుల్ని నిలబెట్టిన నాలుగు నియోజకవర్గాల్లో ఓబీసీ నాయకులకు టికెట్లు ఇచ్చింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

38 మంది సిట్టింగ్‌లకు బీజేపీ మొండిచెయ్యి

- గుజరాత్‌లో 160 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల
- హార్దిక్ పటేల్, రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాకు అవకాశం

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీ 160 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను గురువారం విడుదల చేసింది. ఏకంగా 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి మొండిచెయ్యి చూపడం గమనార్హం. వీరిలో ఐదుగురు మంత్రులు సైతం ఉన్నారు. తీగల వంతెన దుర్ఘటన జరిగిన మోర్బీ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి బ్రిజేశ్ మెర్జాకు టికెట్ నిరాకరించారు. మరో నలుగురు మంత్రులు.. రాజేంద్ర త్రివేది, ప్రదీప్ పర్మార్, అరవింద్ రైయానీ, ఆర్.సి.మక్వానాకు తొలి జాబితాలో స్థానం దక్కలేదు. శాసనసభ స్పీకర్ నీమాబెన్ ఆచార్యకు కూడా నిరాశే ఎదురయ్యింది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తన సొంత నియోజకవర్గం ఘాట్లోడియా నుంచి మరోసారి బరిలోకి దిగబోతున్నారు. పాటిదార్ ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్, క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా బీజేపీ తొలి జాబితాలో స్థానం దక్కించుకున్నారు. విరామ్‌గామ్ స్థానం నుంచి హార్దిక్ పటేల్, జామ్‌నగర్ నార్త్ స్థానం నుంచి రివాబా జడేజా అధికార పార్టీ టికెట్లపై వారు పోటీ చేయబోతున్నారు. 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వడం లేదని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ వెల్లడించారు. వారి అనుమతితోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

తొలి జాబితాలో 69 మంది సిట్టింగ్‌లు

గుజరాత్‌లో తొలి దశలో డిసెంబర్ 1న 89 స్థానాలకు, రెండో దశలో 5న 93 స్థానాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగున్నాయి. తొలి దశ ఎన్నికలకుగాను 84 స్థానాల్లో, రెండో దశ ఎన్నికలకు గాను 76 స్థానాల్లో తమ అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. అభ్యర్థుల పేర్లను బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ బుధవారం ఖరారు చేసింది. 160 మందిలో ఓబీసీలు 49 మంది, పటేళ్లు 40 మంది, క్షత్రియులు 19, బ్రాహ్మణులు 13 మంది ఉన్నారు. జైన వర్గానికి చెందిన మరో ఇద్దరు చోటు సంపాదించారు. తొలి జాబితాలోని మొత్తం అభ్యర్థుల్లో 35 మంది 50 ఏళ్లలోపు వారే కావడం విశేషం. తొలి జాబితాలో 69 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి పోటీచేసే అవకాశం కల్పిస్తున్నామని, వీరిలో 14 మంది మహిళలు, 13 మంది ఎస్సీలు, 24 మంది ఎస్టీలు ఉన్నారని భూపేంద్ర యాదవ్ తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ, మాజీ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్‌తోపాటు మరికొందరు సీనియర్ నాయకులు ఈ ఎన్నికల్లో పోటీపడొద్దని నిర్ణయించుకున్నారని, ఈ విషయాన్ని పార్టీకి లిఖిత పూర్వకంగా తెలియజేశారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మరోసారి విజయం సాధించబోతున్నామని, గత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయమని గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు సి.ఆర్.పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ 1995 నుంచి మధ్యలో రెండేళ్లు మినహా అవిచ్ఛిన్నంగా అధికారంలో కొనసాగుతోంది.




రివాబా జడేజా



హార్దిక్ పటేల్

లాలూకు కూతురు కిడ్నీ

న్యూఢిల్లీ: తీవ్ర మూత్రపిండ సమస్యతో బాధపడుతున్న తండ్రికి కిడ్నీ ఇచ్చి కొత్త ఆరోగ్యకర జీవనం ప్రసాదించేందుకు కూతురు సంసిద్ధమైంది. 74 ఏళ్ల ఆర్‌జేడీ చీఫ్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కొన్నాళ్లుగా మూత్రపిండ సమస్యతో బాధపడుతున్నారు. ఒక కిడ్నీ దాదాపు 75 శాతం పాడైంది. దీంతో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌కు వైద్యులు సలహా ఇచ్చారు. విషయం ముందే తెలిసిన సింగపూర్‌లో స్థిరపడిన లాలూ రెండో కూతురు రోహిణి ఆచార్య కిడ్నీ దానానికి ముందుకొచ్చింది. కూతురు కిడ్నీ తీసుకునేందుకు లాలూ ససేమిరా అంగీకరించలేదని, రోహిణిసహా కుటుంబీకులంతా ఆయనను బలవంతంగా ఒప్పించారని మీడియాలో వార్తలొచ్చాయి. దాతకు రోహిణి కిడ్నీ సరిగ్గా సరిపోతుందో లేదో నిర్ధారించుకునేందుకు ఇప్పటికే పలుమార్లు వైద్యపరీక్షలు చేశారు. చికిత్స, వైద్యపరీక్షల కోసం లాలూ గత నెలలో సింగపూర్‌కు వెళ్లొచ్చారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో శస్త్రచికిత్సకు ప్రయత్నించగా కఠిన భారతీయ చట్టాల కారణంగా అది సాధ్యపడటం లేదని తెలుస్తోంది. దీంతో విదేశాల్లోనే నవంబర్ 24న శస్త్రచికిత్స ఉండొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దాణా కుంభకోణంలో దోషిగా తేలిన లాలూకు ఇప్పటికే జైలు శిక్ష పడింది. అయితే, తీవ్ర అనారోగ్య కారణంగా వైద్య చికిత్సల నిమిత్తం విడుదలై ఢిల్లీ, రాంచీ ఆస్పత్రుల్లో చాలా నెలలపాటు చికిత్సకోసం గడిపారు. ప్రస్తుతం లాలూ ఢిల్లీలో ఉన్నారు. పిల్లలు, భర్తలో కలిసి రోహిణి ఆచార్య సింగపూర్‌లోనే ఉంటున్నారు.



కుమార్తె రోహిణితో లాలూ (ఫైల్)



ఒంట్లో ఎముకలే లేవన్నట్లుగా వెనక్కి, ముందుకు ఏ ఆకృతిలోనైనా వంగిపోగల బ్రిటిష్ టీనేజర్ ఈమె. పేరు లిబర్టీ బారోస్. వెనక్కి వంగి మోకాళ్లు పట్టుకుని అత్యంత తక్కువ సమయంలో 20 మీటర్ల దూరం నడిచి గిన్నిస్ కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. గురువారం లండన్‌లో తీసిందీ ఫొటో.

పదేళ్లకోసారి 'ఆధార్' అప్‌డేట్ చేయాల్సిందే

- సపోర్టింగ్ డాక్యుమెంట్లు ఇవ్వాలి
- నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ: ఆధార్ నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఆధార్ నంబర్ కలిగి ఉన్న వారు ఎన్‌రోల్‌మెంట్ తేదీ నుంచి పదేళ్ల పూర్తయ్యాక గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ వంటి పత్రాలను (సపోర్టింగ్ డాక్యుమెంట్స్) కనీసం ఒక్కసారైనా అప్‌డేట్ చేసుకోవాలని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనివల్ల సీఐడీఆర్ డేటాబేస్‌లో ఆధార్‌కు సంబంధించిన సమాచారంలో కచ్చితత్వాన్ని కొనసాగించవచ్చని తెలియజేసింది. ఎన్‌రోల్‌మెంట్ జరిగాక ప్రతి పదేళ్లకోసారి సపోర్టింగ్ డాక్యుమెంట్లు అప్‌డేట్ చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. పదేళ్ల కంటే ఎక్కువ రోజుల క్రితం ఆధార్ కార్డు పొంది, ఇప్పటిదాకా ఒక్కసారి కూడా గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలను అప్‌డేట్ చేసుకోని వారు వెంటనే ఆ పూర్తి చేయాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) గత నెలలో విజ్ఞప్తి చేసింది. మై ఆధార్ పోర్టల్, మై ఆధార్ యాప్ ద్వారా లేదా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాల్లో డాక్యుమెంట్లు సమర్పించి, వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించింది. దేశంలో ఇప్పటిదాకా 134 కోట్ల మందికి ఆధార్ సంఖ్యలను జారీ చేశారు. గుర్తింపు కార్డులు, చిరునామా మారినవారు కూడా సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి, ఆధార్ కార్డుల్లో వివరాలు మార్చుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే ఆధార్ నంబర్ కలిగి ఉండడం తప్పనిసరిగా మారింది.

మాల్దీవుల్లో ఘోరం

మాలె: మాల్దీవుల రాజధాని మాలెలో గురువారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనలో 9 మంది భారతీయులు సహా మొత్తం 10 మంది వలస కార్మికులు సజీవ దహనమయ్యారు. నిరుఫెహి ప్రాంతంలోని విదేశీ పనివారు నివసించే ఇరుకైన భవనంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో 9 మంది భారతీయులు కాగా, మరొకరిని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోని గ్యారేజీలో మంటలు మొదలై కార్మికులున్న మొదటి అంతస్తుకు వ్యాపించాయి. ప్రతి కార్మికుడి బెడ్ పక్కన ఒక గ్యాస్ సిలిండర్ ఉంది. ఫ్లోర్ అంతటికీ కలిపి కేవలం ఒకటే కిటికీ ఉంది. దీంతో మంటలను అదుపు చేయడం కష్టమైందని అధికారులు తెలిపారు.

జీ20 సదస్సుకు మోదీ

- నవంబర్ 14–16 తేదీల్లో హాజరు
- విడిగా వేర్వేరు దేశాల అధినేతలతోనూ ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ: జీ20 సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇండోనేసియాలోని బాలికి వెళ్లనున్నారు. నవంబర్ 14–16 తేదీల్లో సదస్సుకు హాజరవుతారు. అదే తేదీల్లో సదస్సుకు విచ్చేస్తున్న పలు దేశాల అధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బగ్చీ గురువారం ఢిల్లీలో మీడియాతో చెప్పారు. '' సమిష్టిగా కోలుకుందాం. మరింతగా బలీయమవుదాం.. అనే ఇతివృత్తంతో కొనసాగే ఈసారి జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్, ప్రధాని మోదీ సహా భాగస్వామ్యదేశాల అగ్రనేతలు పాల్గొంటారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లతోపాటు ఆహారం, ఇంధన భద్రత, ఆరోగ్యం అంశాలపైనా చర్చిస్తారు. ఈ ఏడాది జీ20 సదస్సుకు నాయకత్వం వహిస్తున్న ఇండోనేసియా అధ్యక్షుడు జోకో సదస్సు చివరి రోజున తదుపరి నాయకత్వ పగ్గాలను మోదీకి లాంఛనంగా ఇవ్వనున్నారు' అని బగ్చీ చెప్పారు.

నవ్‌లఖా గృహ నిర్బంధానికి సుప్రీం అనుమతి



సాక్షి, న్యూఢిల్లీ: రెండేళ్లుగా జైలులో గడుపుతున్న ఎల్గార్ పరిషత్–మావో సంబంధాల కేసులో నిందితుడు, సామాజిక కార్యకర్త గౌతమ్ నవ్‌లఖా గృహ నిర్బంధానికి సుప్రీంకోర్టు అనుమతించింది. రూ.2.4 లక్షల పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. గృహ నిర్బంధంపై 14 షరతులు విధించింది. 70 ఏళ్ల నవ్‌లఖా అనారోగ్య పరిస్థితి దృష్ట్యా గృహ నిర్బంధానికి అనుమతిస్తున్నామని తెలిపింది. ఈ ఆదేశాలు తాత్కాలికమని నెల రోజుల తర్వాత సమీక్షిస్తామంటూ కేసు తదుపరి విచారణను డిసెంబర్ రెండో వారానికి వాయిదా వేసింది. గృహనిర్బంధానికి అనుమతి ఇవ్వాలన్న నవ్‌లఖా పిటిషన్‌ను గురువారం జస్టిస్ జోసెఫ్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌ల సుప్రీం ధర్మాసనం విచారించింది. 'నిందితుడు 2020 నుంచి కస్టడీలో ఉన్నారు. గతంలో గృహనిర్బంధం దుర్వినియోగం చేసిన ఫిర్యాదులేవీ లేవు. ఈ కేసు మినహా మరో నేరపూరిత ఆరోపణలు లేవు. అందుకే హౌస్‌అరెస్టుకు అనుమతినిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. సీసీటీవీల ఏర్పాటు, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నిఘా తదితరాల ఖర్చు మొత్తం నవ్‌లఖా భరించాలని ఆదేశించింది. కోర్టు విధించిన షరతులు..

- పోలీసుల సమక్షంలో వారిచ్చిన ఫోన్ నుంచి రోజుకు 10 నిమిషాలు మాట్లాడొచ్చు.
- సహచరుడి ఇంటర్నెట్‌లేని ఫోన్ వాడొచ్చు. ఎస్ఎంఎస్‌లు, కాల్స్‌కు అనుమతి. వాటిని డిలీట్ చేయకూడదు. ముంబై వదిలి వెళ్లొద్దు.
- గరిష్ఠంగా ఇద్దరు కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి 3 గంటల పాటు సందర్శించొచ్చు.
- కేబుల్ టీవీ చూడొచ్చు. కేసులో సాక్షులతో ఎలాంటి సంబంధాలు కొనసాగించవద్దు.

ఇకపై నెలకు లక్ష వీసాలు జారీ

న్యూఢిల్లీ : అమెరికా వీసాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూపులు ఇక బాగా తగ్గే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది వేసవి తర్వాత వీసాల మంజూరుకయ్యే రోజులు బాగా తగ్గిపోతాయని, నెలకి లక్ష వీసాలు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం అధికారి ఒకరు వెల్లడించారు. 2023 ఏడాది వేసవి నాటికి వీసా దరఖాస్తులు 12 లక్షలకు చేరుకుంటాయన్న అంచనాలున్నాయని తెలిపారు. కోవిడ్–19 కారణంగా ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడం, వీసాల జారీ తాత్కాలికంగా నిలిపివేత వంటి కారణాలతో భారతీయులు వీసాల కోసం ఏడాదికి పైగా ఎదుచు చూడాల్సిన పరిస్థితి ఉంది. 'వీసాల మంజూరులో భారత్‌కు మేము అత్యధిక ప్రాధాన్యం ఇస్తాం. వచ్చే ఏడాది నాటికి కరోనా కంటే ముందున్న పరిస్థితులు వస్తాయి. నెలకి లక్ష వీసాలు మంజూరు చేయడమే మా లక్ష్యం'' అని ఆయన చెప్పారు. వీసాల త్వరితగతి మంజూరు కోసం సిబ్బందిని పెంచడం, డ్రాప్ బాక్స్ సదుపాయం కల్పన వంటి చర్యల్ని తీసుకుంటామని ఆ అధికారి వెల్లడించారు గతంలో కొన్ని కేటగిరీల వీసా కోసం 450 రోజులు ఎదురుచూడాల్సి వచ్చేదని, ఇప్పుడది తొమ్మిది నెలలకి తగ్గిందని వివరించారు.

లిక్కర్ స్కామ్‌లో మరో ఇద్దరి అరెస్టు

- పి.శరత్‌చంద్రారెడ్డి, వినయ్ బాబును అదుపులోకి తీసుకున్న ఈడీ
- ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి నిందితుల అప్పగింత

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర అలజడి సృష్టించిన లిక్కర్ కుంభకోణంలో అరెస్టుల పరంపర కొనసాగుతోంది. మరో ఇద్దరు నిందితులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. పెర్నాడ్ రికర్డ్ లిక్కర్ కంపెనీ జనరల్ మేనేజర్ వినయ్ బాబు, హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా కంపెనీ డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో ప్రభుత్వ అధికారులతో పాటు వీరిద్దరూ పాలుపంచుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదే కేసులో ఇండోస్పిరిట్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ మహేంద్రును ఈడీ సెప్టెంబర్‌లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో దేశవ్యాప్తంగా పలుచోట్ల దర్యాప్తు సంస్థలు ఇప్పటికే సోదాలు నిర్వహించాయి. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. లిక్కర్ స్కామ్‌తో ఢిల్లీలోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్య నేతలతోపాటు తెలంగాణలోని ప్రభుత్వ పెద్దలకు సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిందే. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22 అమల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సీబీఐ దర్యాప్తునకు సిఫార్సు చేశారు. అక్రమాలకు బాధ్యులుగా గుర్తిస్తూ 11 మంది ఎక్సైజ్ అధికారులను విధుల నుంచి తొలగించారు. ఎల్‌జీ సిఫార్సు మేరకు సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సిసోడియా, పలువురి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. సిసోడియా, ఢిల్లీ ప్రభుత్వ అధికారుల నివాసాల్లో సోదాలు చేపట్టింది. ఈ కేసులో విజయ్ నాయర్, బోయినపల్లి అభిషేక్‌రావులను అరెస్టు చేసింది.

శరత్‌చంద్రారెడ్డి, వినయ్‌ను ఈడీ అధికారులు గురువారం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి జస్టిస్ నాగ్‌పాల్ ఎదుట ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఢిల్లీ మద్యం పాలసీలో శరత్‌చంద్రారెడ్డి కీలకపాత్ర పోషించారని చెప్పారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు కోసం ఆయనను 14 రోజుల పాటు ఈడీ కస్టడీ అప్పగించాలని కోరారు. శరత్‌చంద్రారెడ్డి తరఫు న్యాయవాది మనూ శర్మ స్పందిస్తూ.. లిక్కర్ వ్యవహారంలో అక్రమ లావాదేవీలు జరగలేదన్నారు. వినయ్ బాబు తరఫు న్యాయవాది స్పందిస్తూ.. సీబీఐ సాక్షిగా పరిగణించిన తన క్లయింట్‌ను ఈడీ అరెస్టు చేసిందని ఆక్షేపించారు. అనంతరం జస్టిస్ ఎంకే నాగపాల్ ఆదేశాలు వెలువరించారు. ఇద్దరు నిందితులను ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతిస్తున్నామని చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

మీరేసే ప్రతి ఓటు నా బలాన్ని పెంచుతుంది

- కమలం గుర్తుకు ఓటుపై మోదీ
- సంబంధిత లేఖలు హిమాచల్‌లో పంపిణీ

సిమ్లా: బీజేపీని మరోసారి గెలిపించి, చరిత్ర తిరగరాయాలని ప్రధాని మోదీ హిమాచల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కమలం గుర్తుకు వేసే ప్రతి ఓటు తన ధైర్యాన్ని ఇనుమడింపజేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రేపు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ మేరకు ప్రధాని ఫొటో, సంతకంతో కూడిన లేఖను బీజేపీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి అందిస్తున్నాయి. 'గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా మీరు బీజేపీనే ఆశీర్వదిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది. కమలం గుర్తుపై మీరు వేసే ప్రతి ఓటుతో నా బలం పెరుగుతుంది' అని హిందీలో రాసిన ఆ లేఖలో ఉంది. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సరిహద్దు ప్రాంతాలు సహా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేశాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి గమనం ముందుకు సాగించాలని ఓటర్లను ప్రధాని కోరారు. ఈ సందేశాన్ని వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రంలోని 15 లక్షల కుటుంబాలకు అందేలా చేస్తామని బీజేపీ నేత సంజయ్ టాండన్ చెప్పారు.

కాంగ్రెస్ పాలన స్కాములమయం



సులాహ్: హిమాచల్‌ప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. విశ్వసనీయత లేని వారి హామీలను ప్రజలను నమ్మరంటూ కాంగ్రెస్ ప్రకటించిన 10 హామీలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన గురువారం కంగ్రా జిల్లా సులాహ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో చోటుచేసుకున్న కుంభకోణాలు లెక్కకు మిక్కిలి ఉండగా, బీజేపీ హయాంలో 2014 నుంచి ఒక్క స్కాము కూడా కనిపించదని చెప్పారు. 2004–14 సంవత్సరాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రూ.12 లక్షల కోట్ల మేర కుంభకోణాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ వంటి పార్టీలిచ్చే ఎన్నికల హామీలను హిమాచల్ ప్రజలు నమ్మరని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం జైరాం ఠాకూర్‌లు కలిసి హిమాచల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

సాక్షి
విజయనగరం
శుక్రవారం। 11 । నవంబర్ । 2022



రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు

విజయనగరం కెపిఎల్.పురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఆటోను వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో పది మంది కూలీలు గాయపడ్డారు. - 8లో

గడువు పెంపు

విజయనగరం పూల్‌బాగ్: హెడ్మాస్టర్ అకౌంట్ టెస్ట్‌కు దరఖాస్తు గడువు పెంచినట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధరుసుం లేకుండా రెండు పేపర్లకు రూ.150, ఒక పేపర్‌కు రూ.100తో ఈనెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.60 అపరాధరుసుముతో ఈనెల 28లోగా చెల్లించుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ప్రతులను కోటలోని స్ట్రాంగ్ రూమ్‌లో అందజేయాలన్నారు.



న్యూస్‌రీల్

రైల్వే జీఎమ్‌ను కలిసిన ఎంపీ 'బెల్లాన'



రైల్వే జీఎమ్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీ బెల్లాన

చీపురుపల్లి: సౌత్ ఈస్టర్న్ రైల్వే జీఎమ్ ఆర్.ఎస్.సుంకరను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సౌత్ ఈస్టర్న్ రైల్వే జీఎమ్‌గా బాధ్యతలు స్వీకరించి విశాఖపట్టణం వచ్చిన ఆయనను డీఆర్‌ఎమ్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. చీపురుపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎమ్ అనూప్‌కుమార్‌సేత్పతి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై విస్తృత అవగాహన

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి



కళాజాత బృందాల ప్రదర్శనలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై కళాజాత బృందాలతో ప్రచారంచేసే కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సోకిన తర్వాత చికిత్స ఎక్కడ లభిస్తుందని అనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ రోగులు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి, డీపీఎం బాలాజీ, డీఐసీ సాక్షి గోపాలరావు పాల్గొన్నారు.

స్పెషల్ పీపీగా మావూరి



మావూరి శంకరరావు

విజయనగరం లీగల్: స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మావూరి శంకరరావు నియమితులయ్యారు. ఆయన పోక్సో చట్టం కింద స్పెషల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో ప్రాసిక్యూషన్ నిర్వహిస్తారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన స్వస్థలం గుర్ల మండలం కోటగండ్రేడు. విశాఖలోని ఎన్‌బీవీ లా కళాశాలలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1988లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. సీనియర్ న్యాయవాది పంపాన సూర్యనారాయణరాజు వద్ద జూనియర్‌గా చేరారు. తొమ్మిదేళ్ల పాటు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జిల్లా కేంద్రంలో పని చేశారు. జిల్లా న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా ఏడాది పాటు విధులు నిర్వహించారు. ఆయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్‌శాఖ నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగింది. సంఘ అధ్యక్షులుగా టి.శ్రీనివాసమ్మ, ఉపాధ్యక్షులుగా ఎస్.అమరావతి, కార్యదర్శిగా ఎస్.నారాయణరావు, సంయుక్త కార్యదర్శిగా కె.మోహినీదేవి, కోశాధికారిగా డీవీ రామరాజులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కె.ప్రమీల, ఎ.శ్రీనును ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి ప్రసాద్, జోనల్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ప్రక్రియలో ఎన్నికల అధికారిగా కె. తులసిరామ్, సహాయక ఎన్నికల అధికారిగా టి.ఇ.ఆనంద్ కుమార్, ఎన్నికల అబ్జర్వర్‌గా బి అవినాష్, ముఖ్య పరిశీలకులుగా కె.నర్సింగరావు వ్యవహరించారు.

అలరించి.. మురిపించి..

- ఉత్సవంగా సాగిన యువజనోత్సవం
- పోటాపోటీగా ప్రదర్శనలు
- యువజనోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్
- యువత సోషల్ మీడియా ఉచ్చులో పడొద్దంటూ హెచ్చరిక
- జీవితాన్ని ఆనందిస్తూ... ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపు





విద్యార్థినుల జానపద నృత్య ప్రదర్శన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి



విద్యార్థినుల కేరింత..

విజయనగరం:

శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలు.. మృదంగ, వీణా, గిటారు వాయిద్యాలు.. గీతాలాపనలతో విద్యార్థినీవిద్యార్థులు మురిపించారు. చూపరులను అలరించి.. కేరింతలు కొట్టించారు. విజయనగరం మహారాజ నృత్య,సంగీత కళాశాలలో సెట్విజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఉత్సవంలా సాగాయి. పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 33 అంశాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 450 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. తమ ప్రతిభను ప్రదర్శించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే యువజనోత్సవాలకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ముఖ్యఅతిథిగా హాజరై యువతనుద్దేశించి మాట్లాడారు. సోషల్ మీడియా ఉచ్చులో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. అనవసర ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. లక్ష్యంతో కూడిన విద్యా ప్రణాళికలు రూపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. మనిషి జీవితంలో యవ్వన దశ చాలా అద్భుతమైనదని, దానిని పూర్తిస్థాయిలో ఆస్వాదించాలన్నారు. ఈ దశలో వచ్చే అన్నిరకాల అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కోరారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు, గురువులకు దగ్గరగా ఉండాలన్నారు. అనుభవజ్ఞుల నుంచి జీవిత విశేషాలను తెలుసుకోవాలని, సరైన మార్గంలో పయనించాలని సూచించారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, యువజన సంఘాల్లో యువత భాగస్వాములు కావాలన్నారు. మత్తుపదార్థాలు, ఇతర చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువజనోత్సవాల్లో పాల్గొన్న యువతీ, యువకులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ అన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు. అనంతరం యువత ప్రదర్శనలను కాసేపు తిలకించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రామానందం, మహారాజ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న కుమారి, గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ చంద్రావతి, స్పార్క్ సొసైటీ నిర్వాహకురాలు భవానీ, మహారాజ కళాశాల ప్రిన్సిపాల్ డా.సాంబశివరావు, లెండి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వయొలిన్ పోటీలో విద్యార్థిని



హార్మనీ వాయిద్యం



విద్యార్థిని నృత్యభంగిమ



మృదంగ వాయిద్యం

చెరకు టన్ను ధర రూ.2,980



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐఈడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు

- గతేడాది కంటే టన్నుకు రూ.80లు పెంపు
- మద్దతు ధరను ప్రకటించిన ప్యారీ కర్మాగారం
- ఈనెల 17న క్రషింగ్ ప్రారంభం

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం చెరకు రైతులకు తీపికబురు అందించింది. ఈ ఏడాది చెరకు టన్నుకు రూ.2,980 మద్దతు ధర చెల్లిస్తామని ప్రకటించింది. గత ఏడాది కంటే టన్నుపై రూ.80లు పెంచినట్టు పేర్కొంది. అలాగే, ఈ నెల 17 నుంచి చెరకు క్రషింగ్‌కు శ్రీకారం చుడతామని ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది 5.85 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు గానుగ ఆడేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గతేడాది 5.04 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్టు వివరించారు. ఈ ఏడాది 81,000 టన్నుల చెరకు క్రషింగ్ పెరుగుతుందని తెలిపారు. 13,850 ఎకరాల్లో చెరకు సాగైనట్టు గుర్తించామన్నారు. ఇందులో 5,500 ఎకరాల్లో మమ్ము, 8,350 ఎకరాల్లో మొక్కసాగు జరిగినట్టు పేర్కొన్నారు. కొత్తగా చెరకు నాటిన రైతులకు రాయితీలను అందజేస్తామని తెలిపారు. 2022-23 ఏడాదికి సంబంధించి అక్టోబర్ నుంచి ఏప్రిల్ 2023 మధ్య చెరకును మొక్కపద్ధతిలో నాటితే రూ.8వేల రాయితీపై సీడ్ అందిస్తామని తెలిపారు. మమ్ము పద్ధతిలో సాగుచేసే రైతులకు ఎకరాకు రూ. 2 వేల రాయితీ ఇస్తామని వెల్లడించారు. చెరకు ఎకరాకు 25 టన్నులు దాటి దిగుబడి వస్తే ఈ రాయితీ వర్తిస్తుందని, 25 టన్నులలోపు దిగుబడి వస్తే దామాసా పద్ధతిలో రాయితీ ఇవ్వనున్నామని, 20 టన్నుల కంటే తక్కువగా దిగుబడి వస్తే పూర్తిగా రాయితీ వర్తించదని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఫ్యాక్టరీ సూచించిన విత్తనాలు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. సమావేశంలో కేన్ జీఎం ఎమ్.రమేష్‌రెడ్డి, కేన్ ఏజీఎం కె.అప్పారావు, ఫైనాన్స్ మేనేజర్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: ఈ నెల 12న జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయసేవా సదన్ భవనంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే అదాలత్‌లో మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, రికవరీ సూట్స్, వివాహ సంబంధిత వివాదాలు, భూసేకరణకు సంబంధించిన వివాదాలు, విద్యుత్, నీటి పన్నులకు సంబంధిచిన కేసులు, రెవెన్యూ కేసులు, సెక్షన్ 138 ఎన్‌ఐ చట్టానికి సంబంధించిన కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక సంబంధిత వివాదాలు, రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో లేబొరేటరీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్‌అటెండెంట్, ఫార్మసిస్టు గ్రేడ్-2 పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా తెలియజేయాలన్నారు.

రాజాం మార్కెట్ యార్డ్‌లో పత్తికొనుగోలు



సమీక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్

- పత్తి క్వింటా మద్దతు ధర రూ.6,380
- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో పత్తి కొనుగోలు చేసేందుకు రాజాం మార్కెట్ కమిటీని నోటిఫై చేసినట్టు జేసీ మయూర్‌అశోక్ తెలిపారు. ప్రస్తుతం పత్తి ధర మార్కెట్ విలువ రూ.7వేలుకు పైబడి ఉందని, ఒకవేళ ఆ ధర తగ్గినా మార్కెట్‌యార్డ్ ద్వారా కనీస మద్దు ధర రూ.6,380కు కొనుగోలు చేస్తామని చెప్పారు. తన చాంబర్‌లో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ ఏడాది జిల్లాలో 2027 హెక్టార్లలో పత్తి పంట సాగైందని, 3,122 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రావచ్చని అంచనావేశారు. పత్తికొనుగోలుకు పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. ఫైర్ నియంత్రణ పరికరాలు, తూకం యంత్రాలను, టార్పాలిన్స్, తేమ యంత్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి శ్యామ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, జిల్లా రవాణా, ఫైర్ అధికారులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

14,586 మందికి ఉపాధి



రాజాం నైరేడ్‌లో హోమ్ నర్సింగ్ శిక్షణార్థులతో మాట్లాడుతున్న పీడీ

- నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్న నైరేడ్ శిక్షణ సంస్థ
- డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

రాజాం: రాజాంలోని జీఎంఆర్ నైరేడ్ ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిరుద్యోగుల ఉపాధికి బాసటగా నిలుస్తోందని, రాష్ట్రంలోని ఎన్నో శిక్షణ సంస్థలకు ఆదర్శనీయమని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జిల్లా లీడ్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాజాంలోని జీఎంఆర్‌వరలక్ష్మీ, యూనియన్ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహిస్తున్న నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థను వారు పరిశీలించారు. ప్రస్తుతం ఈ శిక్షణా సంస్థలో కంప్యూటర్ డీటీపీ, హోమ్ నర్సింగ్, ఉమెన్ టైలరింగ్, ఏసీ రిపేరింగ్ వంటి కోర్సులకు సంబంధించి శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. క్రమ శిక్షణతో ఉపాధి కోర్సులను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పీఓ నాగరాజు వద్ద వివరాలు సేకరించారు. మీడియాతో పీడీ మాట్లాడుతూ 2002లో ప్రారంభించిన ఈ సంస్థ ఏటా సగటున 900 మంది నిరుద్యోగ యువతీయువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తోందని వెల్లడించారు. ఇప్పటివరకూ సంస్థ ద్వారా 18,143 మంది నిరుద్యోగ అభ్యర్థులు శిక్షణ పొందగా, 14,586 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందడంతో పాటు స్వయం ఉపాధి పొందుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, పీఓ నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చురుగ్గా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న, ఐసీడీఎస్ జిల్లా పీడీ శాంతకుమారి

- 91 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనులు
- ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి

తెర్లాం: జిల్లాలోని 91 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పథకం కింద భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శాంతకుమారి తెలిపారు. తెర్లాం మండలం ఆమిటి రెండో అంగన్‌వాడీ కేంద్రానికి ఉన్న రహదారి సమస్యను పరిశీలించేందుకు గురువారం విచ్చేశారు. అనంతరం తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 20 నుంచి 30మంది కిశోర్ బాలికలతో సఖీ గ్రూపులు ఏర్పాటు చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లు, ఇతర సరుకులు స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ నిర్వహణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు బాగుందన్నారు. ఆమె వెంట బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి ఉన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

- రెండు ఎద్దులు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం టౌన్/సీతానగరం: లారీ ఢీకొనడంతో ముగ్గురు గాయపడగా, రెండు ఎద్దులు మృతి చెందగా, ఒక ఎద్దుకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం వేకువజామున చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం మండలం కారాడవలస గ్రామానికి చెందిన పిన్నింటి సాంబయ్య అదే గ్రామానికి చెందిన దొగ్గ తిరుపతి, దొగ్గ రమేష్‌లతో కలసి నాటు బండ్లను తోలుకొని సీతానగరం నదిలో ఇసుకను తీసుకువచ్చేందుకు వెళ్తుండగా సీతానగరం మండలం మరిపివలస గ్రామానికి సమీపంలో ఉన్న కోనేరు ముందు బొబ్బిలి వైపు నుంచి పార్వతీపురం వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో సాంబయ్య, తిరుపతి, రమేష్‌లు రొడ్డుపై తుళ్లిపడడంతో ముగ్గురిని 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. అవుట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గోదాముల నిర్మాణంతో మామిడి రైతులకు మేలు

తెర్లాం: జిల్లాలోని పలు మండలాల్లో మామిడి కాయల కలెక్షన్ సెంటర్ గోదాములు నిర్మించడంతో మామిడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని జగన్నాథవలసలో రూ.15లక్షలతో నిర్మిస్తున్న మామిడి కాయల కలెక్షన్ సెంటర్ గోదామును గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది గోదాము అందుబాటులోకి వస్తుందన్నారు. మామిడి రైతుల ఉత్పత్తిదార్ల సంఘం మండల అధ్యక్షుడు గొందాల వెంకటరావు, వెలుగు ఏపీఎం టి.రాము, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు అంబులెన్స్
- జిల్లా కేంద్రాస్పత్రికి తరలింపు
- ముగ్గురి పరిస్థితి విషమం



కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాద స్థలం వద్ద నుజ్జునుజ్జయిన ఆటో

విజయనగరం క్రైమ్: స్థానిక కెఎల్.పురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గురువారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఆటోను వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో పది మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... బొండపల్లి మండలానికి చెందిన మజ్జి సూర్యనారాయణ, దొంతల జమ్మన్న, గెద్ద రమణ, చిల్ల శ్రీను, అలమండ రమణ, సాసుబిల్లి అప్పారావు, కోరాడ అచ్చిరాజు, మీసాల నారాయణరావు, బొబ్బిలికి చెందిన చైతన్యతో పాటూ అంబటివలసకి చెందన పీతల రాంబాబులు గూడ్స్‌షెడ్ వద్ద జరుగుతున్న కలాసీ పనులకు గురువారం ఆటోలో వెళ్తున్నారు. స్థానిక ద్వారపూడి రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి జైపూర్ నుంచి విశాఖ వైపు రోగులను తీసుకువెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. దీంతో ఆటో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అదే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వారిలో సాసుబిల్లి అప్పారావు, కోరాడ అచ్చిరాజు, మీసాల నారాయణరావుల పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ విజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయరాంపురంలో అగ్ని ప్రమాదం

- ఇల్లు, పశువులశాలల దగ్ధం
- రూ.3లక్షల ఆస్తి నష్టం



అగ్ని పమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని విపి.రేగ పంచాయతీ పరిధి విజయరాంపురం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక పూరిల్లు, పది పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన సమాచారం మేరకు గ్రామంలో ఎవరూ లేని సమయంలో గురువారం మధ్యాహ్నం 1గంట సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చిన్న పిల్లలు వేసిన మంటలు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గ్రామానికి చెందిన పాసి పైడమ్మ ఇల్లు దగ్ధమవ్వగా ఇంటిలో ఎవరూ లేకపోవటంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వంట పాత్రలు దగ్ధమయ్యాయని, రూ.50వేలు పైబడి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. యాకల తవుడు, దుక్క సన్యాసి, దుక్క గంగులు, దుక్క సత్యం, పాసి తమ్మన్న, పాసి తవుడు, నక్క రామస్వామి, నక్క బంగారి, బమ్మిడి జోగినాయుడు, బమ్మిడి అప్పన్నలకు చెందిన పశువుల శాలలు దగ్ధమయ్యాయి. పశువుల శాలలో ఉండే సైకిల్, ఎడ్లబండ్లు కూడా కాలిపోయాయని బాధితులు తెలిపారు. వీటి నష్టం రూ.3లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం జరగటంతో రెవెన్యూ అధికారులు, పంచాయతీ సెక్రటరీ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్

పార్వతీపురం టౌన్: విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామానికి చెందిన గంధం గణేష్ తాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. తన గ్రామంలో ఎస్సీ వీధిలో రమణ ఇంటి శ్లాబ్‌పై కర్రి దుర్గారావు అనే మరో మేస్త్రీతో కలసి పిట్టగోడ కడుతుండగా ప్రమాదవశాత్తు గణేష్ చెయ్యి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. అవుట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడుకు మాతృ వియోగం



మరిశర్ల రవణమ్మ(ఫైల్)



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే దివంగత మరిశర్ల శివన్నాయుడు సతీమణి మరిశర్ల రమణమ్మ(82) అనారోగ్యంతో విశాఖ పట్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బలరాం నాయుడు మాజీ సర్పంచ్ కాగా రెండో కుమారుడు సింహాచలంనాయుడు(సింబన్న) డీసీసీబీ చైర్మన్‌గా పని చేసి మృతి చెందారు. మూడో కుమారుడు బాపూజీనాయుడు ప్రస్తుతం జెడ్పీ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు. ఈమె మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మోహనరావు, ఎంపీపీ ఉరిటి రామారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీకాకుళం గురజాడ విద్యా సంస్థల అధినేత జీవీ స్వామి నాయుడు రమణమ్మ మృతి తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. రమణమ్మ అంత్యక్రియలు గురువారం సాయంత్రం స్వగ్రామంలో జరిగాయి.

స్త్రీనిధి రుణాల లక్ష్యాలు చేరుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ కల్యాణచక్రవర్తి

రాజాం: జిల్లా వ్యాప్తంగా అన్ని వీఓల పరిధిలో స్త్రీనిధి రుణాలు లక్ష్యం చేరుకునేలా కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి తెలిపారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని వైకేపీ అధికారులతో గురువారం సమీక్షించారు. స్త్రీ నిధి రుణాలు లక్ష్యాలు చేరాలని తెలియజేయడంతో పాటు పాత స్త్రీ నిధి రుణాల రికవరీ వంద శాతం పూర్తి చేయాలన్నారు. మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించేలా చూడాలని, స్వయం ఉపాధి పరిశ్రమలు మహిళలు ఏర్పాటు చేసేలా ఉండాలన్నారు. గత రెండేళ్లుగా మహిళా సంఘాల ప్రాధాన్యత సమాజంలో బాగా పెరిగిందని వెల్లడించారు. ప్రతీ ప్రభుత్వ సంక్షేమ పథకంలో స్వయంశక్తి సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, ఇంటి నిర్మాణాలకు ప్రత్యేకంగా బ్యాంకు రుణాలు గ్రూపుల్లో ఉన్న మహిళలకే ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ మండలానికి ఒక మదర్ పౌల్ట్రీ మంజూరీ చేసి కోడి పిల్లలు పెంపకం పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం పీఓపీ ఉన్నతి కొత్త రుణాలు ఇవ్వడంతో పాటు పాతవి రికవరీ ఈ నెల 15లోగా పూర్తిచేయాలని, ఎస్‌వీఈపీ రుణాలు, పీఎమ్‌ఈజీపీ, పీఎమ్‌ఎఫ్‌ఎమ్‌ఈ రుణాలపై పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, డీపీఎం బి.రవికుమార్, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, ఏసీ ఎ.చిరంజీవి, ఎఫ్‌పీఓ ఏపీఎం విజయ్‌కుమార్, రాజాం ఏపీఎమ్‌లు దధికుమార్, ఎల్‌సీ ఏపీఎమ్ ఎన్.అప్పలనాయుడు, ఎమ్ఎమ్ఎల్ అధ్యక్షుడు అరుణ, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులతో సమీక్ష

అనంతరం రాజాం పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద రాజాం, రేగిడి మండలాలకు చెందిన పలువురు బ్యాంకుల బ్రాంచి మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. రుణాలు మంజూరీ, మహిళా సంఘాల బలోపేతం వంటి అంశాలపై మాట్లాడారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాము

పార్వతీపురం టౌన్: కుటుంబ కలహాల కొట్లాటలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన రెడ్డి సుగుణకు వంగర మండలం వీవీపేట గ్రామానికి చెందిన పాలక వినోద్‌తో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు. వినోద్ ఎప్పుడు తాగి అర్ధరాత్రి వచ్చి భార్యను వేధిస్తూ ఉండేవాడు. విషయం తెలుసుకున్న సుగుణ సోదరుడు రాము బుధవారం అక్క సుగుణ ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం బావ వినోద్‌తో ఎందుకు ఇలా తాగుతూ అక్కడను ఇబ్బంది పెడతావని ప్రశ్నించాడు. దీంతో వినోద్ నువ్వెవడవు నన్ను అడిగేందుకు అని దుర్భషలాడుతూ చేయి చేసుకున్నాడు. దీంతో రాము నీ తీరు మారకుంటే పోలీసు కేసు పెడతానని వినోద్‌ను హెచ్చరించాడు. ఆగ్రహానికి గురైన వినోద్ రాముపై దాడి చేశాడు. దీంతో రాముకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,200-00
బంగారం(22సి. 10గ్రా.)	46,000-00
వెండి (కిలో)	60,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

రాష్ట్ర ఖోఖో పోటీలకు జిల్లా జట్ల పయనం

- ఈ నెల 11 నుంచి 13 వరకు ప్రకాశం జిల్లాలో పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న జిల్లా ఖోఖో జట్లు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ మహిళ, పురుషుల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు గురువారం పయనమయ్యాయి. ఈ నెల 11 నుంచి 13 వరకు ప్రకాశం జిల్లాలో జరగనున్న పోటీలకు వెళ్తున్న జిల్లా జట్లకు అసోసియేషన్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి, చైర్మన్ పి.చిన్నంనాయుడు పలు సూచనలు చేశారు. కబడ్డీ, ఖోఖో క్రీడల్లో జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, జిల్లా నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి పేరు ప్రఖ్యాతలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు విశ్రాంత పీఈటీ పిన్నింటి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారులు క్రీడాదుస్తులు బహూకరించారు. క్రీడాకారులు వెంట కోచ్ అండ్ మేనేజర్‌లుగా సిహెచ్.సత్యనారాయణ, కె.గోపాల్, బి.శ్రీను, టి.సత్యనారాయణ, పి.హరీష్‌యాదవ్‌లు వ్యవహరిస్తున్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్

విజయనగరం క్రైమ్: భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటన నిమిత్తం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి విశాఖపట్టణం బహిరంగ సభకు వెళ్లే బస్సులకు సంబంధించి ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. శ్రీకాకుళం జిల్లా (237), విజయనగరం జిల్లా (ఎస్.కోట మినహా) 424 బస్సులు ఆనందపురం దాటి, మారికవలస వద్ద ఎడమవైపు తిరిగి, జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం వద్ద బీచ్‌రోడ్డుకు చేరి, కుడివైపు తిరిగి రుషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్ల పాలెం మీదుగా కురుపాం జంక్షన్‌కు చేరుకోవాలని, అక్కడ నుంచి కుడివైపు తిరిగి పెద్దవాల్తేరు, విశాఖ ఐ హాస్పిటల్ జంక్షన్ మీదుగా పోలమాంబ గుడి వద్ద కుడివైపు సమత హాస్టల్ గేట్ ద్వారా ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో ప్రవేశించి నిర్దేశించిన ప్రదేశంలో పబ్లిక్‌ను దింపి పోలీసు అధికారుల సూచనల ప్రకారం పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. సభ ముగిసిన అనంతరం, సంబంధిత బస్సుల్లో ప్రయాణించే వారు తమ బస్సు ఎక్కే వరకూ పార్కింగ్ వద్దనే ఉండి పబ్లిక్‌ను ఎక్కించుకుని వచ్చిన రూట్‌లోనే గ్రౌండ్ నుంచి బయలుదేరి గమ్య స్థానాలకు చేరాలని జిల్లా పోలీసు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యావరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజినల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమువారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ-520010. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటీ డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్ 9) స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం.33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమువారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్సు వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. 12) గ్రామ పంచాయతీ కార్యాలయం, గరుడుబిల్లి (గ్రామం మరియు పంచాయతీ), బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 16.12.2022** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

స్థలం : విజయనగరం.
తేది : 11-11-2022

క్లుప్తంగా

సేవలపై ఆరా ..



కనిమెల్లలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జీఎస్ నిర్మలాదేవి, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని సచివాలయం ద్వారా అందుతున్న సేవలపై జిల్లా పంచాయతీ అధికారి జీఎస్ నిర్మలాదేవి ఆరా తీశారు. సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా, సిబ్బంది హాజరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పూసపాటిపాలెం, కనిమెల్లలో తడి, పొడి చెత్త కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలలో తయారుచేసే కంపోస్టు ఎరువును రైతులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటరావు, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ



చిన్నారికి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యురాలు హిమబిందు

భోగాపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్షాభియాన్ (విజయనగరం) ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు హిమబిందు దివ్యాంగ చిన్నారలకు ఫిజియోథెరపీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దివ్యాంగ చిన్నారులను కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణమూర్తి, ఐఈఆర్‌టీడీ రమణ, సీఆర్‌పీ సూర్యనారాయణ, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం..



ర్యాలీలో పాల్గొన్న డీఎఫ్ఓ వెంకటేష్, సిబ్బంది

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీ అమరవీరుల స్ఫూర్తితో వృత్తి నిర్వహణలో ముందుకు సాగుదామని జిల్లా అటవీ అధికారి శంబంగి వెంకటేష్ అన్నారు. రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఫూల్‌బాగ్‌లో జిల్లా అటవీశాఖ కార్యాలయం నుంచి కొత్తపేట వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బొత్స అప్పలరాజు, ఎఫ్ఎస్ఓ కేవీఎస్ రాజు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంచడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర ప్రభుత్వం 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ పెంచడం సరికాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు అన్నారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనగణన చేయకుండా రిజర్వేషన్ ఎలా పెంచుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో చౌదరి, ఆదినారాయణ, పందిరి లక్ష్మణరెడ్డి, గువ్వల రవికుమార్, దువ్వ వేణు, తమ్మిన సత్యనారాయణ, బంగారురాజు, పట్నాల వెంకటేష్, బేపల బుచ్చిబాబు, కోరాడ కృష్ణ, దువ్వ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్‌లో నితీష్‌రాజ్ ప్రతిభ



నితీష్‌రాజ్‌ను అభినందిస్తున్న సంస్థ నిర్వాహకులు

విజయనగరం టౌన్: పదన్యాస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో థాయ్‌లాండ్ పట్టాయా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ సెంటర్ వేదికపై ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్‌లో పట్టణానికి చెందిన ఎమ్.రాయప్ప నితీష్‌రాజ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. డ్యాన్స్‌తో పాటు మోడలింగ్‌లో రాణిస్తున్న నితీష్‌రాజ్‌ను మున్నా మైఖేల్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు మున్నా, తదితరులు అభినందించారు. గతేడాది ఇదే వేదికపై నితీష్ కాంస్య పతకం సాధించగా.. ఈ ఏడాది వెండి పతకం కైవసం చేసుకున్నాడని మున్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు వింటూ.. శంకుస్థాపనలు చేస్తూ..

- నగరంలో 11 డివిజన్‌లలో రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: నగరంలో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోంది. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆయా ప్రాంతాల్లో మిగులు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నగరంలో వివిధ డివిజన్‌లలో రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 34, 35, 36, 37, 39, 46, 45, 47, 42, 43, 49 డివిజన్‌లలో కాలువలు, రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతూ, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సావధానంగా విని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చూపుతున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్లుగా వీధులలో, కాలనీలలో పరిష్కారం కాని అనేక సమస్యలను తీరుస్తూ.. మౌలిక సదుపాయాల కల్పన పనులను ముమ్మరం చేయడం ప్రజల అదృష్టమన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధిని గమనించి ముఖ్యమంత్రి జగనన్నకు, ఎమ్మెల్యే కోలగట్లకు ఆశీర్వదించాలని కోరారు. జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, సమస్యలు లేని డివిజన్‌లుగా తీర్చిదిద్దడానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: కొత్తగా పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన వనరులు సమకూర్చి ప్రోత్సాహిస్తామని ఏపీఎస్ఎఫ్‌సి విజయనగరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారంలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపారాభివృద్ధిపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా పరిశ్రమలు స్థాపించేవారికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చే విధానంపై వివరించారు. రుణం పొందే విధానం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తయారీ రంగంలో వ్యాపారాలు చేసేవారిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తక్కువ వడ్డీతో రుణాలు తీసుకోవడం మంచిదని చెప్పారు. అనంతరం పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఎ.డి వంశీమోహన్, ఏపీఐఐసీ అధికారి సీహెచ్ సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



కొండకరకాంలో అవగాహన కార్యక్రమం

విజయనగరం రూరల్: మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండకరకాం, సుంకరిపేట, మలిచర్ల గ్రామాల్లో కళాజాతలు నిర్వహించి హెచ్‌ఐవీ, క్షయవ్యాధి నియంత్రణ, సంక్రమణ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో సుంకరిపేట, మలిచర్ల, కొండకరకాం గ్రామ సర్పంచ్‌లు టి.రామకుమారి, ఎస్.రాజేశ్వరి, కిలారి రమ్య, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అధికారులపై సర్పంచ్ ఆగ్రహం



గ్రామసభ నుంచి బయటకు వస్తున్న గ్రామస్తులు, సర్పంచ్

పూసపాటిరేగ: గతేడాది పంచాయతీ తీర్మానంతో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకపోవడంపై కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో గురువారం ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శైలాడ రమణ నిర్లక్ష్యం కారణంగా బిల్లులు మంజూరు కాలేదని ఆరోపించారు. అధికారుల తీరుతో గ్రామాభివృద్ధి నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి బయటకు వచ్చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



వేపాడ: శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు

వేపాడ: మండలంలోని వల్లంపూడి శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని సాయి మహిళా మండలి నిర్వాహకులు అమ్మాజీ, అలివేలమ్మ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు లట్టాల పవన్‌శర్మ వేపాడ, వల్లంపూడి గ్రామాలకు చెందిన పలువురు దంపతులతో ముందుగా ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా పుష్పాదివాసం

చీపురుపల్లి: కార్తీకమాసం నేపథ్యంలో పట్టణంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ నేతృత్వంలో గురువారం పుష్పాదివాసం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని అలంకరించడమే కాకుండా శివలింగానికి పుష్పాఅభిషేకం చేశారు. దేవస్థా నం కమిటీ సభ్యుడు ఎస్.వి.జి.శ్రీనివాసరావు, రెడ్డిపేటకు చెందిన లక్ష్మణ దాదాపు రూ.10 వేల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం సభ్యుడు ఎల్.ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిరావాలి

నెల్లిమర్ల: ఈనెల 12న విశాఖపట్నంలో జరగనున్న ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన అనంతరం ప్రధాని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రధానిని కలిసి రాష్ట్ర అభివృద్ధి, పలు సమస్యల పరిష్కారం గురించి చర్చించిన నేపథ్యంలో సదరు సభకు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

బాధితుల వివరాలు వెల్లడించకూడదు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో ఇటీవల కాలంలో బాలలపై లైంగిక వేధింపులు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని, అయితే బాధిత పిల్లల వివరాలు బహిర్గతపరచడం, ప్రచురించడం సరికాదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టంతో విభేదించిబడిన బాలల గురించి, వారికి సాక్షిగా ఉన్న బాలల వివరాలను తెలియజేయకూడదని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలి గ్రామంలో ఉన్న ఏబీసీడీ వృద్ధాశ్రమానికి విజయనగరానికి చెందిన డి.చక్రవర్తి గురువారం తన జన్మదినం సందర్భంగా నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో చక్రవర్తి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.4.30 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో కాంట్రాక్టర్లు, నాయకులు, అధికారులు

గజపతినగరం: మండలంలోని పట్రువాడ గ్రామంలో చంపావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్ కాశీవిశ్వేశ్వరరావు, సబ్‌కాంట్రాక్టర్ అర్జున్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ పి.అప్పలనాయుడు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.4.30 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పట్రువాడ గ్రామస్తులు చంపావతి నది దాటి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు.వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ప్రభూజీ రాజు, పంచాయతీరాజ్ శాఖ జేఈ ఆదిమూర్తి, స్థానిక సర్పంచ్ బోని సంగమయ్య, వైస్ సర్పంచ్ పారిపి రెడ్డి అచ్చన్న మాస్టారు, ఎంపీటీసీ కె.చిన్నపైడన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో తనిఖీలు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని ఎస్టీ బాలుర కళాశాల వసతి గృహంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం సాయం త్రం తనిఖీలు చేశారు. సుమారు రెండు గంటల పాటు ఆయన విద్యార్థులతో మాటా మంతీ సాగించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆ సమయంలో వార్డెన్ లేకపోవడం, ఆమె స్థానికంగా నివాసం లేకపోవడంతో రికార్డు రూమ్‌కు తాళం వేసి ఉండడంతో రికార్డులు పరిశీలించ లేదు. 288 మంది ఉండాల్సిన హాస్టల్‌లో 112 మంది విద్యార్థులు మాత్రమే ఉండడాన్ని ఎమ్మెల్సీ గుర్తించారు. విద్యార్థుల కోసం చేసిన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వార్డెన్ లేకపోవడంతో విద్యార్థులు వారికి నచ్చిన సమయంలో హాస్టల్‌కి వచ్చి వెళుతున్నారని, ఉన్న వారికి వసతి చాలడం లేదని, ప్రహరీ లేదని, మరుగుదొడ్ల సమస్య ఉందని చెప్పారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం

- నెల్లిమర్ల నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,08,931
- 2019 ఎన్నికల కంటే పెరిగిన ఓటర్లు 8,100





నెల్లిమర్ల: నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. నియోజవర్గంలో మొత్తం 2,08,931 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,03,872 కాగా మహిళలు 1,05,055 ఉన్నట్లు భారత ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1183 మంది అధికంగా ఉన్నారు. మరో నలుగురు ఇతరులు (ట్రాన్స్‌జెండర్స్) ఓటర్లుగా ఉన్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే నెల్లిమర్ల మండలం, నగరపంచాయతీలో కలిపి అత్యధికంగా 61,444 మంది, పూసపాటిరేగ మండలంలో 58,695 మంది, డెంకాడ మండలంలో 43,820 మంది, భోగాపురం మండలంలో 44,972 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో 2,00,831 మంది ఓటర్లు ఉండేవారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గం మొత్తంమ్మీద 8,100 మంది ఓటర్లు పెరిగారు.

> **ఓటరుగా నమోదు చేసుకోవాలి**
>
> వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. అలాగే మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయే వారి ఓట్లను తొలగించడానికి సంబంధిత బీఎల్‌ఓలకు సమాచారం అందజేయాలి. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియ చేపడుతున్నాం.
>
> – కెవి రమణరాజు, తహసీల్దార్, నెల్లిమర్ల

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



రాజయోగిని అన్నపూర్ణను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

విజయనగరం టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతని, ప్రతిఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ రాజయోగిని బీకే అన్నపూర్ణ పిలుపునిచ్చారు. కల్పతరువు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంఆర్ పీజీ కళాశాలలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ హయ్యర్ ఎడ్యుకేషన్, బ్రహ్మకుమారీస్ సంస్థ సంయుక్తంగా కల్పతరువు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు రాజయోగిని బీకే అన్నపూర్ణను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఎన్ లక్ష్మీనారాయణ, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి..



మార్కెట్ ప్రాంతంలో తడి చెత్తను సేకరిస్తున్న ప్రజారోగ్య విభాగాధికారులు, సిబ్బంది

విజయనగరం: తడి చెత్త నుంచి సంపద సృష్టించే వినూత్న కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. నగరంలో సేకరించిన తడి చెత్తతో ఎరువుల తయారీకి కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం శ్రీకారం చుట్టింది. గతంలో కూడా ఈ ప్రక్రియ వల్ల సేంద్రియ ఎరువు తయారు చేసి ప్రజా వినియోగంలోకి తీసుకు వచ్చారు. ఇదే స్ఫూర్తితో ఈసారి కూడా అధిక మొత్తంలో తడి చెత్తను సేకరించి ఎరువుగా మర్చేందుకు సిద్ధమవుతున్నారు. కమిషనర్ ఆర్. శ్రీ రాములనాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ నేతత్వంలోని బృందం మార్కెట్ ప్రాంతాలలో పడేసిన తడి వ్యర్థాలైన పండ్లు, కూరగాయల తొక్కలు వంటివి సేకరించి ఎరువు తయారు చేస్తున్నారు. వీటితో తయారు చేసిన ఎరువుకు మంచి డిమాండ్ ఉంటుందని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. గతంలో చేసిన ప్రక్రియ సత్ఫలితాలను ఇవ్వడంతో మరింత శ్రమించి ఎక్కువ మొత్తంలో ఎరువు తయారీకి కృషి చేస్తున్నామన్నారు.

పథకాలు అందలేదనే మాట వినపడకూడదు



సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: అర్హత ఉన్నప్పటికీ తమకు సంక్షేమ పథకాలు అందలేదనే మాట గ్రామాల్లో ఏ ఒక్కరి నుంచీ వినిపించకూడదని ఎంపీపీ చల్ల చలంనాయుడు అన్నారు. సంక్షేమ పథకాల అమలు పై మండలంలోని ఒంపల్లి గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానమని, ఇదే విషయాన్ని ప్రతీ ఉద్యోగికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చెప్పారని గుర్తుచేశారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా పని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పథకాలు సక్రమం గా అందుతున్నాయా లేదా అని 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్నారని, ప్రతీ వలంటీర్ తమ పరిధి కుటుంబాల్లోని అ ర్హులకు పథకాలను పారదర్శకంగా అందించాలని పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద మెనూను పక్కాగా అమలు చేయాలని ఒంపల్లి హైస్కూల్ మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెచ్‌ఎంకు, అలాగే ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ ఏ.వేదవతి, ఏపీఓ బి.కృష్ణవేణి, ఒంపల్లి, వేంద్రాం సర్పంచ్‌లు లండా నారాయణమ్మ, కర్రోతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ సత్యనారాయణ

గజపతినగరం: మరుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశా ల పీడీ సీహెచ్.సత్యనారాయణ తెలిపారు. బాలికల విభాగంలో జాగారపు శ్రావణి, బాలుర విభాగంలో దుక్క శ్రీరాములు, జాడ సత్యనారాయణ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు వీరు ప్రకాశం జిల్లాకు గురువారం పయనమయ్యారు. వీరిని పీడీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రిమాండ్ సమయంలోనే ఎలా తేలుస్తారు?

- ఫలానా సెక్షన్ వర్తించదని ఎలా చెప్తారు?
- రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ కుదరదు
- టీడీపీ నేత అయ్యన్న, తదితరుల కేసుల్లో స్పష్టం చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: నిందితులకు ఫలానా సెక్షన్ వర్తించదని రిమాండ్ సమయంలో మేజిస్ట్రేట్‌లు ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ నిర్వహించడానికి వీల్లేదని తెలిపింది. ఈ విషయంలో మేజిస్ట్రేట్‌లకున్న అధికారాన్ని తేలుస్తామని స్పష్టంచేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్‌లు జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన రివిజన్ పిటిషన్లలో కౌంటర్లు దాఖలు చేయాలని ఆయా కేసుల్లో నిందితులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నిరభ్యంతరపత్రం (ఎన్‌వోసీ) ఫోర్జరీ కేసులో టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారులు విజయ్, రాజేష్‌ల రిమాండ్‌ను తిరస్కరిస్తూ విశాఖ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను, రాజధానిలో అసైన్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో పలువురు నిందితుల రిమాండ్‌ను తిరస్కరిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ అధికారులు వేర్వేరుగా రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి గురువారం విచారణ జరిపారు. అయ్యన్న తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ నమోదు చేసిన సెక్షన్లలో ఐపీసీ సెక్షన్ 467 వర్తించదంటూ వారి రిమాండ్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించారని, హైకోర్టు సైతం ఈ సెక్షన్ వర్తించదని బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిందని చెప్పారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. రిమాండ్ సమయంలోనే ఫలానా సెక్షన్లు వర్తించవని మేజిస్ట్రేట్లు ఎలా తేలుస్తారని, మినీ ట్రయల్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. దీనికి సతీష్ స్పందిస్తూ.. మినీ ట్రయల్ నిర్వహించడంలేదని, వారికున్న అధికారాన్ని ఉపయోగించి నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. సెక్షన్ 467 వర్తించదంటూ ఇచ్చినవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనన్నారు. రిమాండ్ సమయంలో ఫలానా సెక్షన్లు వర్తించవంటూ మేజిస్ట్రేట్లు తేల్చే అధికారం విషయంలో తీర్పునివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏఏజీ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో లబ్ధిదారుకు సంక్షేమలబ్ధి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



బాపట్ల జిల్లా చావలిలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మన ప్రభుత్వం



విజయనగరం జిల్లా గజపతినగరంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఇంటింటా విద్యుత్ ఆదాపై దృష్టి

- స్టార్ రేటెడ్ ఫ్యాన్లు, ఏసీలు, ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల సరఫరాకు ఏపీ ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్
- వీటి వాడకం వల్ల 25 నుంచి 30 శాతం విద్యుత్ ఆదా
- తొలి దశలో విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో పైలట్ ప్రాజెక్ట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం విద్యుత్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవటం ద్వారా ప్రయోజనం పొందే దిశగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్సీ) కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారులకు విద్యుత్‌ను ఆదా చేయగల స్టార్ రేటెడ్ ఎలక్ట్రిక్ గృహోపకరణాలను మార్కెట్ కన్నా తక్కువ ధరకు అందించడం ద్వారా విద్యుత్ వినియోగంతోపాటు బిల్లులు కూడా తగ్గేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఆన్ బిల్ ఫైనాన్సింగ్ మోడల్, ఆఫ్ ఫ్రంట్ మోడల్ ద్వారా వినియోగదారులకు స్టార్ రేటెడ్ ఎయిర్ కండిషనర్లు, బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్ (బీఎల్‌డీసీ) సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ ట్యూబ్ లైట్లను అందించే పైలట్ ప్రాజెక్ట్ అమలు చేసేలా విద్యుత్ సంస్థలకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు, ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్కో) చేసిన ప్రతిపాదనను ఆమోదిస్తూ ఏపీ ఈఆర్సీ గురువారం మార్గదర్శకాలను విడుదల చేసింది.

మార్చి నెలాఖరుకల్లా పూర్తవ్వాలి



విద్యుత్ ఆదా చేయగల గృహోపకరణాల సరఫరా పైలట్ ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి 31లోగా పూర్తిచేయాల్సిందిగా ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆదేశించారు. డిస్కంలు, ఏపీ సీడ్కో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. దశలవారీగా దీనిని విస్తరించాలని ఆదేశించారు.

మూడు నగరాల్లో పైలట్ ప్రాజెక్ట్

రాష్ట్రం మొత్తం విద్యుత్ డిమాండ్‌లో 25 శాతం గృహాల్లోనే వినియోగమవుతోంది. గృహ విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయడానికి ఏపీ ఈఆర్సీ సూచన మేరకు స్టార్ రేటెడ్ గృహోపకరణాల సరఫరా ప్రాజెక్టును ఏపీ సీడ్కో రూపొందించింది. ఎలాంటి వడ్డీ లేకుండా నెలవారీ వాయిదా చెల్లింపు పద్ధతిలో విద్యుత్ బిల్లులతో కలిపి పరికరాల ధరను చెల్లించేలా ఈ ప్రాజెక్ట్‌లో ప్రతిపాదించింది. సంప్రదాయ లైట్లు, ఫ్యాన్లు వంటి వాటితో పోలిస్తే స్టార్ రేటెడ్ పరికరాల వల్ల 25 నుంచి 30 శాతం విద్యుత్ ఆదా అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వినియోగదారుల అనుమతితో ఏపీ సీడ్కో, డిస్కంలు వీటిని సరఫరా చేయనున్నాయి. తొలి దశలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాల్లో పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నారు. ఇందుకోసం వివిధ వస్తు తయారీ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవాలని ఏపీ ఈఆర్సీ సూచించింది. అలాగే ప్రాజెక్ట్ పూర్తయిన 45 రోజుల్లోగా ప్రాజెక్ట్ అమలు తీరుతెన్నులు, దాని ప్రభావంపై నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది.

సమావేశంలో ఏపీ ఈఆర్సీ సభ్యులు పి.రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్ రామసింగ్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్దనరెడ్డి, ఏపీ ఈఆర్సీ సెక్రటరీ రాజబాపయ్య, ఏపీ ఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు స్థానం లేదంటే అది ప్రజా రాజధానే కాదు

- క్యాపిటల్ అన్నది క్యాపిటలిస్టుల కోసం కాదు.. అన్ని వర్గాల కోసం
- ఆ ధనవంతులు రాజధాని నుంచి పేదలను దూరం చేయాలని చూస్తున్నారు
- అందుకే పేదలకు ఇళ్ల స్థలాలివ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారు
- హైకోర్టుకు నివేదించిన ఏఏజీ సుధాకర్‌రెడ్డి
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: రాజధానిలో పేదలకు స్థానం లేదంటే అది ప్రజల రాజధానే కాదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. క్యాపిటల్ (రాజధాని) అనేది క్యాపిటలిస్టుల (పెట్టుబడిదారులు) కోసం కాదని, అన్నివర్గాల ప్రజల కోసమని వివరించారు. రాజధాని తమదంటున్న ధనవంతులు రాజధాని నుంచి పేదలను దూరం చేయాలని భావిస్తున్నారని, అందుకే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికికూడా ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించడాన్ని సవాలు చేస్తూ రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, మరి కొందరు దాఖలుచేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'బడా సంస్థలకు, హ్యాపీ నెస్ట్ అంటూ పెద్దలకు భూమి ఇచ్చినప్పుడు అభ్యంతరం చెప్పని అమరావతి రైతులు.. పేదలకు నెస్ట్ (గూడు) లేకుండా చేస్తున్నారు. ఇది పేదలపట్ల వారివైఖరిని తెలియజేస్తోంది. రాజధానిలో పేదలకు భూములిస్తే మురికివాడ అవుతుందంటూ రైతులు పదేపదే చెబుతున్నారు. ముంబైలో ధారావి అన్నది అతిపెద్ద మురికివాడ. అది ఉన్నంతమాత్రాన ముంబై పేరు ప్రతిష్టలకు వచ్చిన నష్టం ఏమీ లేదు. చట్టప్రకారం రాజధాని ప్రాంతంలో పేదలకు 5 శాతం వరకు భూమి కేటాయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. దీనిప్రకారమే నడుచుకుంటున్నాం. ఓసారి ప్రభుత్వానికి భూమిని అప్పగించిన తరువాత ఆ భూమిపై రైతులకు హక్కు ఉండదు. వారికి ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్ల విషయంలోనే వారికి హక్కు ఉంటుంది. ప్రభుత్వం పేదల కోసం పాటు పడుతుంటే, వారు మాత్రం సింగపూర్ పాట పాడుతున్నారు (వి ఆర్ సింగింగ్ ఫర్ ది పూర్, బట్ దే వాంట్ సింగపూర్)' అని సుధాకర్‌రెడ్డి కోర్టుకు వివరించారు. చట్టాన్ని సవరించినప్పుడు కోర్టులు ఎలావ్యవహరించాలో సుప్రీంకోర్టు నిర్దేశించిందని తెలిపారు. పేదలకు చట్ట ప్రకారం ఇళ్లస్థలాలు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందని పునరుద్ఘాటించారు. ఓ దశలో ధర్మాసనం ఇళ్లస్థలాల కేటాయింపు విషయంలో ముందుకెళ్లకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రతిపాదించింది. కౌంటర్ దాఖలు చేసేంతవరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామంది. దీనిని ఏఏజీ సుధాకర్‌రెడ్డి వ్యతిరేకించారు. చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యాల్లో పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వులు పొందడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించారు. సీఆర్‌డీఏ వాదనల నిమిత్తం విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

లడ్డూ పరిమాణం, బరువుపై అపోహలొద్దు: టీటీడీ

- లడ్డూ ఒక్కొక్కటి 160 నుంచి 180 గ్రాములు బరువు
- నాణ్యత విషయంలో ఏనాడు రాజీ పడలేదు

తిరుమల: శ్రీవారి లడ్డూ పరిమాణం, బరువుపై ఎలాంటి అపోహలు వద్దని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.'శ్రీవారి లడ్డూ ఒక్కొక్కటి 160 నుంచి 180 గ్రాములు బరువు ఉంటుంది. రోజూ పోటు కార్మికులు తయారు చేసిన లడ్డూ ప్రసాదాలను ఒక ప్రత్యేక ట్రే లో ఉంచి, ప్రతి ట్రే బరువును పోటు అధికారులు తనిఖీ చేస్తారు. అనంతరం వాటిని కౌంటర్లకు తరలించి భక్తులకు అందిస్తారు. ఇందులో పూర్తి పారదర్శకత ఉంటుంది. వేయింగ్ మిషన్‌లో సాంకేతిక సమస్య కారణంగా మైనస్ 70 అని ఉండటం, కాంట్రాక్ట్ సిబ్బంది అవగాహన లోపం కారణంగా లడ్డూ బరువుపై భక్తులు అపోహలకు గురయ్యారు. లడ్డూ బరువు, నాణ్యత విషయంలో టీటీడీ ఏనాడు రాజీ పడలేదు. లడ్డూ కౌంటర్ల వద్ద ఇబ్బంది తలెత్తితే వెంటనే అక్కడ అందుబాటులో ఉన్న లడ్డూ కౌంటర్ అధికారికి తెలియజేస్తే, అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే వ్యవస్థ టీటీడీలో ఉంది. కానీ సదరు భక్తుడు ఇవి ఏమీ చేయకుండా సోషల్ మీడియాలో టీటీడీపై ఆరోపణలు చేయడం శోచనీయం'అని పేర్కొంది.

ఘనంగా గోపూజ

కార్తీక మాసంలో టీటీడీ తలపెట్టిన విష్ణు పూజల్లో భాగంగా గురువారం తిరుమల వసంత మండపంలో గోపూజ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారిని వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ సలహాదారులు నల్లూరు వెంకట మోహన రంగాచార్యులు కార్తీక విష్ణుపూజా సంకల్పం చేసి ప్రార్థన, శ్రీసూక్తం, విష్ణుపూజా మంత్ర పఠనం చేశారు. స్వామి, అమ్మవార్లకు తిరువారాధన చేశారు. ఆవు, దూడకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం, హారతి సమర్పించారు.

లైంగిక దాడి కేసులో వృద్ధుడికి 20ఏళ్ల జైలు

ధవళేశ్వరం: ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఐవోసీఎల్ వాంబే హౌసెస్ వద్ద 2018లో రోనాల్డ్ (రెయిన్లు) అనే వృద్ధుడు ఐదేళ్ల బాలికను చాక్లెట్లు ఇస్తానని తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కృపానందం కేసు దర్యాప్తు చేశారు. విచారణలో నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు.


మొయిద నర్సరీ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహిస్తున్న నర్సరీను డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి గురువారం సందర్శించారు. నిర్వాహకులతో మాట్లాడి మొక్కల వివరాలు, పెంపకంపై ఆరా తీశారు. పూల మొక్కల పెంపకం రైతులకు లాభదాయకమని, ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారు. ఆమె వెంట ఏపీఓ అరుణకుమారి ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి సహస్ర కమలార్చన



కమలాలతో కల్యాణ వేంకటేశ్వరుడు

బొబ్బిలి రూరల్: కార్తీక బహుళ విదియ సందర్భంగా మండలంలోని గొర్లె సీతారాంపురం కల్యాణ వేంకటేశ్వరాలయంలో స్వామివారికి గురువారం సహస్ర కమలార్చన (1108 కమల పువ్వులు) జరిపారు. ఈ సందర్భంగా అర్చకుడు భద్రం శ్రీకాంత్‌స్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో ఆలయ ధర్మకర్త గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

నవంబర్‌లో 15 లక్షల.. ఉపాధి పనిదినాల కల్పన

- ఇప్పటి వరకు 3 లక్షల ఉపాధి పనిదినాలు
- వంద పనిదినాలు పూర్తి కాని వారిపై దృష్టి
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు



గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో తుప్పలు తొలగిస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సాధారణంగా జనవరి నెల నుంచి జూలై వరకు జరుగుతుంటాయి. ఈసారి నవంబర్ నెలలో కూడా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. అయితే కేవలం వేతనదారులతో చేసే పనులు మాత్రమే చేయాలని నిబంధన పెట్టారు. మెటీరియల్ వర్క్స్ చేయడానికి వీలులేదు. జనవరి నుంచి జూలై వరకు చెరువుల్లో నీరు చాలా తక్కువగా ఉంటుంది. దీంతో పనులు చేయడానికి అవకాశం ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఆ విధంగానే జరుగుతుంది. మార్చి నెల నుంచి జూన్ నెల వరకు ఎక్కువగా పనులు చేస్తారు. ఈ నాలుగు నెలల్లోనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేవారు. అయితే ఈ ఏడాది మాత్రం నవంబర్ నెలలో వేతనదారులకు పని కల్పించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

15 లక్షల పనిదినాలు లక్ష్యం

జిల్లాలో నవంబర్ నెలకు 15 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు 3 లక్షల పని దినాలను కల్పించారు. నెలఖారులోగా మిగతా 12 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉంది. సగటున రోజుకి ప్రస్తుతం 16 వేల మంది వరకు వేతనదారులు పనులకు వస్తున్నారు. 100 రోజుల పనిదినాలు పూర్తి కాని వారిపై దృష్టి జిల్లాలో యాక్టివ్ జాబ్ కార్డులు 3.45 లక్షలు ఉన్నాయి. 100 రోజులు పనిదినాలు పూర్తి కాని వేతనదారులను ప్రస్తుతం పనికి రప్పించేందుకు వీలుగా డ్వామా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 1109 కుటుంబాలు ఇప్పటి వరకు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నారు. 51 రోజులు నుంచి 60 రోజులు పనిదినాలు చేసిన కుటుంబాలు 43,480 ఉన్నాయి. అలాగే, 61నుంచి 70 రోజులు పనిచేసిన కుటుంబాలు 28,321 ఉన్నాయి. 19,618 కుటుంబాలు 71 నుంచి 80 రోజులు పనిదినాలు చేశారు. 81 నుంచి 99 రోజులు పని చేసిన కుటుంబాలు 28,027 ఉన్నాయి. 2022 మార్చి నుంచి ఆగస్టు నెల వరకు 1.30 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉండగా 1. 32 కోట్ల పనిదినాలు కల్పించారు. వేతనదారులకు రూ.266.44 కోట్లు చెల్లించారు.

పని కల్పించాం..

> ఈ ఏడాది నవంబర్ నెలలో ఉపాధి పనులు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మేరకు ఒకటో తేదీ నుంచి పనులు చేపడుతున్నాం. ఇప్పటి వరకు 3లక్షల పనిదినాలు కల్పించాం.
> – జి. ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

క్రీడా దుస్తుల పంపిణీ



వెటరన్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున తలపడే 50 మంది క్రీడాకారులకు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రఘురాజు గురువారం తన స్వగృహంలో క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు అత్యధిక పతకాలు సాధించి పేరు తేవాలని కోరారు. ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌ను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి, త్రినాథరావు, ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీరాములు, కుమార్, మూర్తి, పైడిరాజు ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు సంఘాలతో రెట్టింపు ఆదాయం



రైతు ఉత్పత్తిదారులు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు డీజీఎమ్ శ్రీనివాస్

బొండపల్లి: రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటే ఆదాయం రెట్టింపు అవుతుందని నాబార్డు డీజీఎం శ్రీనివాస్ తెలిపారు. బొండపల్లి మండలంలోని బిల్లలవలస గ్రామంలో నాబార్డు సహకారంతో ఏర్పాటుచేసిన వేదవాహిని రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డు విజయనగరం డీడీఎమ్ నాగార్జున, బ్రిడ్స్ సంస్థ సీఈఓ రామకృష్ణ, బొండపల్లి వ్యవసాయాధికారి పీవీ మల్లికార్జునరావు, ఉద్యానశాఖ అధికారి రాజశేఖర్, చైర్మన్ లెంక రుపాదేవి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి

- విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు
- 19న దిశ చట్టం– మహిళా సాధికారత సదస్సు
- జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ 55వ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి జిల్లాలోన్ని అన్ని గ్రంథాలయాల్లోనూ నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి తెలిపారు. స్థానిక గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారం రోజుల కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆమె విడుదల చేశారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఒక్కో కళాంశంపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలిరోజున బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలల కార్యక్రమంతోపాటు జనజ్ఞాన వేదిక నిర్వహణలో పాఠకులకు 'కెరీర్ గైడెన్స్' సదస్సు ఉంటుందన్నారు. 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు, 16న వక్తృత్వ, క్విజ్ పోటీలు, 17న చిత్రలేఖనం, క్విజ్, 18న లలిత సంగీతం పోటీలు, 19న దిశ చట్టం– మహిళా సాధికారత అవగాహన సదస్సును సంబంధిత శాఖల అధికారులతో నిర్వహిస్తామని చెప్పారు. తొలి రోజున డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తారని తెలిపారు. 20న జరిగే ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. సమాశంలో గ్రంథాల సంస్థ కార్యదర్శి ఎస్.లలిత, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వేల పక్కాగృహాల నిర్మాణమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీలోని పేదలకు రెండు వేల పక్కాగృహాల నిర్మాణమే లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో 3,133 ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తూ రెండేళ్ల కిందట పట్టాలు అందజేశామన్నారు. అందులో నర్సిపురం గ్రామం దగ్గర్లో వేసిన లేఅవుట్ పట్టణానికి దూరంగా కొండ దగ్గర ఉన్నందున రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఆ లే అవుట్‌ను రద్దు చేయించామని తెలిపారు. వీరందరికీ వేరేచోట ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని చెప్పారు. ప్రతీ పేదవారికి ఇంటి భాగ్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. పార్వతీపురం పురపాలక సంఘంలోని పేదలకు 1895 గృహాలు మంజూరు చేయగా, 794 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగిలిన వారు కూడా నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఐ. గుణేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, హౌసింగ్ ఏఈ, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.







ట్రెడిషన్ టు వెస్ట్రన్

ఒకప్పటితో పోల్చితే పిల్లల డ్రెస్సింగ్‌లోనూ
ఎన్నో మార్పులు వచ్చేశాయి.
వేదికల మీదా క్యాట్‌వాక్‌లతో
చిన్నారుల డ్రెస్సులు కొత్తగా మెరిసిపోతున్నాయి.
పుట్టిన రోజుకు సిండ్రెల్లా స్టైల్
సంప్రదాయ వేడుకకు శారీ స్టైల్
పార్టీకి వెళ్లాలంటే వెస్టర్న్ స్టైల్
గోల్డెన్ టైమ్‌ని గుర్తుకు తేవాలంటే
వింటేజ్ స్టైల్ క్యాజువల్ లుక్‌లో ఒక విధంగా..
కంఫర్ట్ వేర్ అంటూ మరో విధంగా
ఈ చిల్డ్రన్స్ డే కి చిన్నారుల లుక్స్‌ని
మరింత ఆకట్టుకునేలా మార్చేసే
డ్రెస్సింగ్ స్టైల్స్‌లో కొన్ని...

పెద్దవారితో పోటీగా, కాంబినేషన్ డ్రెస్సింగ్‌గానూ చిన్నారుల ఫ్యాషన్ ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. చిల్లల్నకే ప్రత్యేమైన స్టైల్స్‌ని క్రియేట్ చేసే డిజైనర్లు కూడా తమ సృజనకు పదును పెడుతూనే ఉన్నారు. డ్రెస్సింగ్‌కు తగినట్టు వారి ఇతర అలంకరణ వస్తువుల రూపకల్పనకూ డిజైనర్లు పోటీపడుతూ ఉన్నారు.

వంటిల్లు

ఈ కాలంలో చిన్నా పెద్దా తేడా లేకుండా ఇంచుమించు ప్రతి ఒక్కరినీ తరచు జలుబు పీడిస్తుంటుంది. పిల్లలకు ఇష్టమైనవి వండినా సరే... నాలుకకు రుచి తెలియక మారాం చేస్తారు. రుచిగా... ఆరోగ్యంగా ఇలా వండి చూడండి.. పిల్లలలే కాదు, పెద్దలు కూడా లొట్టలేసుకుంటూ తింటారు.

వింటర్ లంచ్ బాక్స్

కరివేబు చిత్రాన్న



పొడి కోసం: నూనె – 2 టీ స్పూన్‌లు ; మినప్పప్పు – టేబుల్ స్పూన్ ; పచ్చి శనగ పప్పు – టేబుల్ స్పూన్ ; ధనియాలు – అర టీ స్పూన్ ; జీలకర్ర – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి – 3 ; ఎండు కొబ్బరి ముక్కలు – 2 చిన్నవి ; చింతపండు– చిన్న గోళీ అంత ; కరివేపాకు– అర కప్పు (ఆకు కడిగి ఆరబెట్టాలి) ; ఉప్పు – అర టీ స్పూన్. **అన్నం కోసం:** బియ్యం – 2 కప్పులు (పలుకుగా వండాలి) ; నూనె– 3 టీ స్పూన్‌లు ; ఆవాలు – టీ స్పూన్ ; ఎండుమిర్చి – ఒకటి ; ఇంగువ – చిటికెడు ; కరివేపాకు– 2 రెమ్మలు ; వేరు శనగపప్పు – 2 టీ స్పూన్‌లు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత.

తయారీ: ● ముందుగా పొడి తయారు చేసుకోవాలి. మందపాటి బాణలిలో నూనె వేడి వేసి శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, ధనియాల పొడి, జీలకర్ర దోరగా వేగిన తరవాత అందులో చింతపండు, కొబ్బరి పలుకులు, కరివేపాకు వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. కరివేపాకులోని తేమ పోయి ఆకు పెళపెళలాడే వరకు వేయించాలి. చల్లారిన తర్వాత ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. కరివేపాకు పొడి రెడీ అవుతుంది ● ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, వేరుశనగపప్పు, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకు వేసి వేగిన తర్వాత అందులో అన్నం, ఉప్పు వేసి, కరివేపాకు పొడి చల్లి సమంగా కలిసిన తర్వాత మూత పెట్టి సన్నమంట మీద కొద్ది సెకన్లపాటు ఉంచి స్టవ్ ఆపేయాలి.

నువ్వుల అన్నం



కావలసినవి: బియ్యం – 2 కప్పులు (అన్నం పలుకుగా వండాలి) ; నువ్వులు – 2 టేబుల్ స్పూన్‌లు ; ఎండు మిర్చి– 4 ; మినప్పప్పు – టీ స్పూన్ ; పచ్చి శనగ పప్పు – టేబుల్ స్పూన్ ; ఆవాలు– అర టీ స్పూన్ ; పసుపు – అర టీ స్పూన్ ; వేరుశనగపప్పు – 2 టీ స్పూన్‌లు ; వెల్లుల్లి – 4 రేకలు ; ఇంగువ– చిటికెడు ; కరివేపాకు – రెండు రెమ్మలు ; నువ్వుల నూనె లేదా సాధారణ వంట నూనె– రెండు టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – రుచికి తగినంత.

తయారీ: ● మందపాటి పెనంలో పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, నువ్వులు వేసి (నూనె లేకుండా) దోరగా వేయించాలి. చల్లారిన తరవాత మెత్తగా పొడి చేసి ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచాలి ● మరొక వెడల్పాటి పెనంలో నూనె వేడి చేసి ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత వేరుశనగ పప్పు, వెల్లుల్లి, కరివేపాకు, పసుపు వేసి కలిపి దించేయాలి. ఇందులో అన్నం, ఉప్పు, నువ్వుల మిశ్రమాన్ని వేసి కలపాలి.

పెప్పర్ రైస్



కావలసినవి: బియ్యం – 2 కప్పులు (పలుకుగా వండాలి) ; మిరియాలు – టేబుల్ స్పూన్ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు– టీ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్ ; మినప్పప్పు – టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; ఇంగువ – పావు టీ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు ; జీడిపప్పు – పది; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత.

తయారీ: ● ముందుగా మిరియాలను బరకగా పొడి చేసి పక్కన ఉంచుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి జీడిపప్పు వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఆ నూనెలో ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ వేసి కలపాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు వేసి మగ్గిన తర్వాత ఉప్పు, అన్నం, మిరియాల పొడి, జీడిపప్పు వేసి కలపాలి.

న్యూస్‌మేకర్స్

మనసు కుదిరింది పెళ్లి జరిగింది

'పెళ్లి కుదిరితే పిచ్చి కుదురుతుంది
పిచ్చి కుదిరితే పెళ్లి జరుగుతుంది' అని సామెత.
అంటే పిచ్చి కుదరదు... పెళ్లి జరగదు అని అర్థం.
కాని ఆ సామెతను తప్పు చేశారు ఇద్దరు ప్రేమికులు.
మానసిక అస్వస్థతతో చెన్నై పిచ్చాసుపత్రిలో
విడివిడిగా చేరిన ఈ ఇరువురుకి అక్కడ
పరిచయమైంది. వ్యాధి నయం కావడంతో పెళ్లి
నిర్ణయానికి వచ్చారు. 200 ఏళ్ల చరిత్రగల
ఆ ఆస్పత్రిలో ఈ ఘటన మొదటిసారి.
మానసిక అస్వస్థత కూడా జ్వరం,
కామెర్లులా నయం కాదగ్గదే.
గమనించి వైద్యం చేయిస్తే పూర్వ జీవితం గడపొచ్చు.
చెన్నైలో జరిగిన ఈ పెళ్లి ఆశలు వదులుకునే
మానసిక అస్వస్థులకు
గొప్ప శుభవార్త. శుభమస్తు వార్త.

మానసిక అస్వస్థత వస్తే ఈ సమాజంలో ఎన్నో అపోహలు, భయాలు, ఆందోళనలు, హేళనలు ఆపై బహిష్కరణలు. 'పిచ్చివారు' అని ముద్ర వేసి వారికి వైద్యం చేయించాలనే ఆలోచన కూడా చేయరు. అదే జ్వరం వస్తే జ్వరం అని చూపిస్తారు. కాని మనసు చలిస్తే ఏదో దెయ్యం పట్టిందని వదిలేస్తారు. మానసిక ఆరోగ్యం గురించి ప్రభుత్వాలు, సేవా సంస్థలు ఎంతో ప్రచారం చేస్తున్నా వైద్యం అందాల్సిన వారు, వైద్యం చేయించాల్సిన వారు కూడా అవగాహన లోపంతో వున్నారు. డాక్టర్ దగ్గరకు వెళ్దామంటే 'నాకేమైనా పిచ్చా' అని ఎదురు తిరుగుతారు పేషెంట్లు. 'పిచ్చి' ముద్ర వేస్తారని. 'పిచ్చికి మందు లేదు' అని వదిలేస్తారు బంధువులు. ఇద్దరూ ఓర్పు వహిస్తే గొప్ప ఫలితాలు వస్తాయి అనడానికి ఇదిగో ఇదే ఉదాహరణ.

చెన్నైలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్' (ఐ.ఎం.హెచ్.) బ్రిటిష్ కాలం నాటిది. దేశంలోనే రెండవ అతి పెద్ద మానసిక చికిత్సాలయం. అందులో కొంత కాలం కిందట వైద్యం కోసం చేరారు మహేంద్ర (42), దీప (38). కుటుంబాలు వారిని చేర్పించి చేతులు దులుపుకున్నాయి. కాని వారు బాగయ్యారు. కొత్త జీవితం గడపాలనుకున్నారు. కాని బయటకు వెళితే 'నయమై వచ్చినా' అమ్మో పిచ్చోళ్లు అనే వివక్షతో చూస్తారు జనం. ఆ భయంతో మళ్లీ హాస్పిటల్‌కు వచ్చేశారు. దాంతో హాస్పిటల్ వారే వారికి లోపల ఉద్యోగాలు కల్పించారు. మహేంద్ర డేకేర్ సెంటర్‌లో పని చేస్తుంటే దీప కేంటిన్‌లో పని చేస్తోంది. మెల్లగా ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఈ సంగతి అడ్మినిస్ట్రేషన్‌కు తెలియగానే హడలిపోయారు. ఎందుకంటే ఇలాంటిది ఇంతకు మునుపు ఎరగరు. ఇదేమైనా ఇష్యూ అవుతుందా అనుకున్నారు. కాని హాస్పిటల్ డైరెక్టర్ అయిన డాక్టర్ పూర్ణ దగ్గరకు వచ్చిన దీప 'నేను అతనితో నా జీవితం పంచుకోవాలనుకుంటున్నానమ్మా' అని చెప్పే సరికి ఆమెకు ఆ స్త్రీ హృదయం అర్థమైంది. అంతే. హాస్పిటల్‌లో పని చేసే అందరూ తలా ఒక చేయి వేసి వారి పెళ్లికి ఆర్భాటంగా ఏర్పాట్లు చేశారు. తాళిబొట్టు ఆ ఏరియా ఎం.ఎల్.ఏ. ఏర్పాటు చేశాడు. అంతేనా హెల్త్ మినిస్టర్ శేఖర్ బాబు, ఎం.పి.



మహేంద్ర, దీప

దయానిధి మారన్ ఏ బందోబస్తు లేకుండా సగటు బంధువుల్లా పెళ్లికి హాజరయ్యారు. పెళ్లి ఎంతో వేడుకగా జరిగింది.

మానసిక ఆరోగ్యం దెబ్బ తింటే జీవితం ముగిసినట్టు కాదు. స్వల్ప కాలం ఇబ్బంది పడ్డా నయమయ్యి కొత్త జీవితం గడపవచ్చు. అందుకు ఉచిత వైద్యం దొరుకుతుంది. కనుక ఆరోగ్యాన్ని గమనించి సమస్య వస్తే జయించండి. కొత్త జీవితాన్ని కళకళలాడించండి. ఎవరికి తెలుసు... ఇప్పుడు కష్టం వచ్చినా భవిష్యత్తు ఎన్ని సంతోషాలను దాచిపెట్టి ఉందో!

టెక్... టాక్

సిగ్నల్‌లో కొత్తగా...



ప్రైవసీ-ఫోకస్‌డ్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ సిగ్నల్ కొత్త స్టోరీస్ ఫీచర్‌కు శ్రీకారం చుట్టింది. యూజర్స్ ఈ ఫీచర్‌తో తమ కాంటాక్ట్స్‌కు స్టోరీలను షేర్ చేయవచ్చు. పోస్ట్ చేసిన 24 గంటల తరువాత 'స్టోరీస్' వాటికవే డిలిట్ అవుతాయి. ఒకవేళ ముందే డిలిట్ చేయాలనుకుంటే ఆ ఆప్షన్ కూడా యూజర్‌కు ఉంది. పరిమిత సంఖ్యలో కూడా స్టోరీస్‌ను షేర్ చేయవచ్చు. స్టోరీస్ ఫీచర్ నచ్చకపోతే టర్న్‌డ్ ఆఫ్ చేసే అవకాశం కూడా ఉంది.

నథింగ్ ఇయర్‌స్టిక్


నథింగ్ ఇయర్‌స్టిక్ ధరను మన దేశంలో రూ.8,499గా నిర్ణయించారు. ఈ నెల 17 నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14న ఫ్లిప్‌కార్ట్‌లో స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్ ఉంటుంది. కొన్ని వివరాలు...
కలర్: వైట్ హెడ్‌ఫోన్
టైప్: ఇన్-ఇయర్
కనెక్టివిటీ: ట్రూ వైర్‌లెస్ స్టీరియో
సింగిల్ ఛార్జ్: 7 గంటలు-వినే టైమ్ 3-గంటలు మాట్లాడే టైమ్



అయ్ బాబోయ్ ఈ యాప్‌లు...

'యాప్‌లలో చేటు చేసే యాప్‌లు వేరయా' అనుకునే పరిస్థితి వచ్చింది. ఇలాంటి యాప్‌ల గురించి సంస్థలు ఎప్పటికప్పుడూ హెచ్చరిస్తూనే ఉన్నాయి. తాజా విషయానికి వస్తే గూగుల్ ప్లేస్టోర్‌లో ప్రమాదకరమైన కొన్ని యాప్స్‌ను కనుగొన్నారు. ఇవి యూజర్ డాటా, బ్యాంకింగ్ వివరాలను సేకరిస్తాయి. డౌన్‌లోడ్ చేసుకోగానే తమ విలనిజం చూపిస్తాయి. మొదట నమ్మించి, 72 గంటల తరువాత తమ పని మొదలుపెడతాయి. అలాంటి యాప్స్ ఇవి...

మై ఫైనాన్స్ ట్రాకర్, జెట్టర్ అథంటికేటర్, రికవర్ ఆడియో, ఇమేజెస్ అండ్ వీడియో, బ్లూటూత్ ఆటోకనెక్ట్, డ్రైవర్, యాప్ సెండర్.



యువర్స్

స్ఫూర్తి




మన దేశానికి సంబంధించిన
తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' అంతరిక్షంలోకి
వెళ్లడానికి రెడీ అయింది.
మరోవైపు 'అగ్నిలెట్'ను
విజయవంతంగా పరీక్షించింది అగ్నికుల్ కాస్మో.
భారత అంతరిక్ష విపణిలో అన్నీ
మంచి శకునాలే కనిపిస్తున్నాయి.
స్పేస్-టెక్ స్టార్టప్‌లపై ఆసక్తి ప్రదర్శించే
యువతరంలో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయి....

ప్రారంభ సంరంభం

హైదరాబాద్‌కు చెందిన ఏరో స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్' చరిత్ర సృష్టించబోతుంది. తమ తొలి రాకెట్ 'విక్రమ్-1' నింగిలోకి దూసుకుపోవడానికి రెడీ అయింది. మూడు కస్టమర్ పేలోడ్స్‌ను ఇది నింగిలోకి పంపుతుంది. మన దేశంలోని తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1'

ఐఐటీ, ఖరగ్‌పూర్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) చేసిన పవన్ కుమార్ చందన్, ఐఐటీ మద్రాస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చేసిన నాగ భరత్ దాక కలలలో నుంచి పుట్టిన అంకుర సంస్థ ఇది. ఇద్దరూ 'ఇస్రో'లో సైంటిస్ట్‌లుగా పనిచేశారు. రాకెట్ సైన్స్‌లో పట్టు సాధించారు.

'ఇంతకుమించి విజయం ఏం ఉంటుంది!' అని ఇస్రోలో తమ ఉద్యోగాన్ని గురించి అదేపనిగా అనుకొని ఉంటే ఒక చారిత్రక విజయానికి వారు దగ్గరయ్యేవారు కాదు. తమ తొలి రాకెట్ ప్రయోగానికి 'ప్రారంభ్' అని పేరు పెట్టారు.

ఐఐటీ, మద్రాస్ నుంచి మొలకెత్తిన అంకురం అగ్నికుల్ కాస్మోస్. తక్కువ ఖర్చుతో 3డీ సాంకేతికతతో రాకెట్ ఇంజిన్‌లను తయారు చేసి, ప్రయోగించే సాంకేతికతను సొంతం చేసుకుంది. శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌ల కలల అంకుర పరిశ్రమ ఇది.

తాజాగా...

ప్రపంచంలోనే తొలి సింగిల్-పీస్ త్రీడి ప్రింటెడ్ ఇంజిన్ 'అగ్నిలెట్'ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (తిరువనంతపురం) నుంచి విజయవంతంగా పరీక్షించి తన సత్తా చాటింది అగ్నికుల్.

'ఇది మరచిపోలేని సందర్భం. ఎలా డిజైన్ చేయాలి? ఎలా డెవలప్ చేయాలి? అనే విషయంలో ఇదొక ముందడుగు' అంటున్నాడు అగ్నికుల్ కో-ఫౌండర్, సీయివో శ్రీనాథ్ రవిచంద్రన్.

'అగ్నికుల్ చరిత్రలో ఇదొక మైలురాయి. మన దేశంలోని ప్రైవేట్ స్పేస్ రంగానికి ఊపు ఇచ్చే విజయం ఇది' అంటున్నాడు అగ్నికుల్ కో-ఫౌండర్, సీవోవో మోయిన్.

మన దేశానికి సంబంధించి తొలి 'రాకెట్ ఫ్యాక్టరీ-1' గురించి ప్రకటించింది అగ్నికుల్. ఐఐటీ-మద్రాస్ రిసెర్చ్ పార్క్‌లో ఏర్పాటయ్యే ఈ ఫ్యాక్టరీ త్రీడి ప్రింట్ రాకెట్ ఇంజిన్‌లకు సంబంధించి అత్యున్నత సాంకేతిక పరికరాలకు కేంద్రంగా ఉండబోతుంది.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకున్న శ్రీనాథ్ రవిచంద్రన్‌కు ఇంజనీరింగ్, ఫైనాన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లలో పట్టు ఉంది. స్పేస్ ఇండస్ట్రీకి సంబంధించిన ప్రాజెక్ట్‌లలో పని చేయాలనేది రవిచంద్రన్ కల. తన కల గురించి ఎవరికైనా చెబితే వింతగా చూసేవారు.

మోయిన్ చెన్నైలోని అన్నా యూనివర్శిటీ నుంచి ఏరోనాటిక్స్‌లో పట్టా పొందాడు. ఆస్ట్రేలియాలో ఎంబీఏ చేశాడు. మాన్యుఫ్యాక్చరింగ్, ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్, సప్లై చైన్ ఆపరేషన్‌లలో పట్టు ఉంది. స్పేస్ టెక్నాలజీ అంటే ఎంతో ఆసక్తి. రవిచంద్రన్, మోయిన్‌లు 'అగ్నికుల్' ద్వారా తమ కలను నెరవేర్చుకున్నారు.

అమెరికాతో పోల్చితే మన దేశం కొన్ని సంవత్సరాలు స్పేస్ సెక్టార్‌లో వెనకబడి ఉంది. అయితే ఇప్పుడున్న వాతావరణాన్ని చూస్తుంటే మనం ఆ అగ్రదేశం స్థాయికి చేరడానికి అట్టే కాలం పట్టదు అనిపిస్తుంది.

మొదట్లో స్పేస్‌టెక్ స్టార్టప్‌లపై ఇన్వెస్టర్‌లకు అంతగా నమ్మకం ఉండేది కాదు. అయితే ఇప్పుడున్న పరిస్థితులలో బాగా మార్పు వచ్చింది.

స్పేస్‌టెక్ స్టార్టప్‌లపై ఆసక్తి, ఉత్సాహం అనేది ఒక ఎత్తయితే దాన్ని పట్టాలు ఎక్కించడం, వేగంగా పరుగెత్తించడం మరో ఎత్తు. కొందరు విఫలమై ఉండవచ్చు. అయితే స్కైరూట్, అగ్నికుల్‌లాంటి అంకురాల విజయాలు ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తాయి. వారి ప్రయాణాన్ని అధ్యయనం చేసేలా, అర్థం చేసుకునేలా, ఆ తరువాత తమ విజయానికి గట్టి బాటలు వేసుకునేలా చేస్తాయి.



స్కైరూట్: నాగ భరత్ దాక, పవన్ కుమార్



అగ్నికుల్: మోయిన్, శ్రీనాథ్ రవిచంద్రన్

> మొదట్లో స్పేస్‌టెక్ స్టార్టప్‌లపై ఇన్వెస్టర్‌లకు అంతగా నమ్మకం ఉండేది కాదు. అయితే ఇప్పుడున్న పరిస్థితులలో బాగా మార్పు వచ్చింది.



టాప్ 5 విసి ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు

1. **కర్నాటక స్టార్టప్ సెల్** — అస్ట్రోమ్, బెల్లాట్రిక్స్ ఎయిరోస్పేస్, ఆస్ట్రోగేట్ ల్యాబ్స్
2. **స్పెషల్ ఇన్వెస్ట్** — అగ్నికుల్, కవ స్పేస్, ఆస్ట్రోగేట్ ల్యాబ్స్, గెలాక్సియా
3. **గ్రో ఎక్స్ వెంచర్ మేనేజ్‌మెంట్** — పిక్సెల్, బెల్లాట్రిక్స్ ఎయిరోస్పేస్
4. **గ్రే సెల్ వెంచర్స్** — అగ్నికుల్, ఆస్ట్రోమ్
5. **ఇండియన్ ఏంజిల్ నెట్‌వర్క్ ఫండ్**, ధృవస్పేస్, ఆస్ట్రోమ్

రియల్‌మీ 10



డిస్‌ప్లే: 6.4 అంగుళాలు
బరువు: 179 గ్రా.
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 12
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్

గేమింగ్: నేడే విడుదల

ఆరోజు సరిగ్గా ఇక్కడే...

సైకలాజికల్ మిస్టరీ ఎడ్వెంచర్‌గేమ్ సెయింట్ కోటర్ నేడు విడుదల అవుతుంది. క్రోయేసియా గ్రామీణ ప్రాంతమైన స్వెటీ కోటర్‌లో జరిగే కథ ఇది. బెనెడిక్, నికోలే అనే ఇద్దరు వ్యక్తుల బంధువులు ఉన్నట్టుండి మాయమైపోతుంటారు. దీనికి కారణం ఎవరు? అనేది ఒక అన్వేషణగా మారుతుంది. ఉత్తములకు, దుష్టశక్తుల ఆరాధకులకు మధ్య జరిగే ఘర్షణ ఇది. 110కి పైగా లొకేషన్స్‌లలో ఎన్నో పజిల్స్ సాల్వ్ చేయాల్సి ఉంటుంది. భయపెట్టే ఈ హారర్ గేమ్‌లో పెయింటెడ్ ఆర్ట్‌వర్క్ కనువిందు చేస్తుంది. యూత్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ పాయింట్ అండ్ సైకలాజికల్ హారర్ డిటెక్టివ్ గేమ్‌కు రూపకల్పన చేశారు. **జానర్స్:** అడ్వెంచర్ గేమ్, ఇండీ గేమ్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్.



ఇంగ్లీష్ స్లాంగ్ డిక్షనరీ

ఫుడ్ కోమా అంటే ?




వంటలు రుచికరంగా ఉన్నాయి కదా అని అప్పుడప్పుడు తెగ లాగించేస్తుంటాం. ఆ తరువాత సమస్య మొదలవుతుంది. నిద్ర ముంచుకొస్తుంది. చేసే పని మీద దృష్టి నిలవదు. శరీరం చురుకుదనం కోల్పోతుంది. ఇలాంటి సమయంలో ఉపయోగించే మాట...ఫుడ్ కోమా. **ఉదా:** ఎవ్రీ ఇయర్ థాంక్స్ గివింగ్ డిన్నర్ మేక్స్ ఎవ్రీ వన్ ఫాల్ ఇన్ టు ఏ ఫుడ్ కోమా. ఒక నిర్ణయం, మాట, చర్య వివాదం అయినప్పుడు 'వెనక్కి తగ్గేది లేదు' అనే ధోరణి ప్రదర్శించే సందర్భంలో ఉపయోగించే మాట...ఐ సెడ్ వాట్ ఐ సెడ్. **ఉదా:** పీపుల్ కెన్ టేక్ ఇష్యూ విత్ ఇట్. బట్ ఐ ఫీల్ మై స్టేట్‌మెంట్ హ్యాజ్ మెరిట్. ఐ సెడ్ వాట్ ఐ సెడ్.



హుసాముద్దీన్‌కు కాంస్య పతకం

ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్‌కు కాంస్య పతకం లభించింది. జోర్డాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో 57 కేజీల సెమీఫైనల్లో హుసాముద్దీన్ తన ప్రత్యర్థి సెరిక్ (ఉజ్బెకిస్తాన్)కు వాకోవర్ ఇచ్చాడు. శివ థాపా (63.5 కేజీలు) ఫైనల్ చేరగా... గోవింద్ కుమార్ (48 కేజీలు), సుమిత్ (75 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) సెమీస్‌లో ఓడి కాంస్యాలు గెలిచారు.

కొందరు సీనియర్లు తప్పుకోవచ్చు: గావస్కర్



తాజా టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓటమి నేపథ్యంలో కొందరు సీనియర్ క్రికెటర్లు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలున్నాయని దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ తెలిపారు. రోహిత్ స్థానంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పగ్గాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. 'ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ సారథిగా తొలి ప్రయత్నంలో విజేతగా నిలిపిన పాండ్యా తప్పకుండా తదుపరి టీమిండియా కెప్టెన్ అవుతాడు. జట్టులోని 35 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు రిటైర్మెంట్ యోచనలో ఉన్నారు. త్వరలోనే నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయి' అని గావస్కర్ అన్నారు.

ఈసారీ ఫ్లాప్ షో

- సెమీఫైనల్లోనే ఓడిన భారత్
- మళ్లీ ప్రపంచకప్‌లో భంగపాటు
- 10 వికెట్లతో ఇంగ్లండ్ ఘన విజయం
- హేల్స్, బట్లర్ మెరుపులు
- ఫైనల్లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ 'ఢీ'

ఏడాది వ్యవధిలో మరోసారి భారత క్రికెట్ అభిమానులను మన జట్టు తీవ్ర నిరాశకు గురి చేసింది. గత టి20 ప్రపంచకప్‌లో లీగ్ దశకే పరిమితమైన జట్టు ఆ నిరాశను దూరం చేస్తూ ఈసారి అత్యధిక విజయాలతో సెమీస్ చేరడంతో కొత్తగా ఆశలు చిగురించాయి. అయితే ఇంగ్లండ్ అద్భుత బ్యాటింగ్‌తో వాటిని తుంచేసింది. ఇప్పటి వరకు మన ఆటగాళ్ల ప్రదర్శన, ప్రత్యర్థిపై ఇటీవలి రికార్డు చూస్తే సెమీస్‌లోనూ విజయం సులువనిపించింది. కానీ బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించలేక సగం ఆట ముగిసే సరికే వెనకడుగు వేసిన టీమిండియా... బౌలింగ్‌లో పూర్తిగా చేతులెత్తేసింది. ప్రత్యర్థి ఓపెనర్లు చెలరేగుతుంటే ఏం చేయాలో కెప్టెన్ సహా ఆటగాళ్లు బిక్కమొహం వేశారు!

టాస్ ఓడిపోవటం మొదలు ఏదీ భారత్‌కు అనుకూలంగా సాగలేదు. ఓపెనర్ల వైఫల్యం ఇక్కడా కొనసాగగా, మరోసారి ఆదుకోవాల్సిన భారం కోహ్లిపై పడింది. పరిస్థితిని బట్టి అతను కూడా కాస్త తగ్గి ఆడాల్సి రాగా, 360 డిగ్రీ సూర్యకుమార్‌ను సరైన వ్యూహంతో ఇంగ్లండ్ కట్టిపడేసింది. అంతా చేయిదాటిపోతున్న దశలో హార్దిక్ చెలరేగడంతో కీలక పరుగులు వచ్చాయి. ఆ తర్వాత ఛేదన ఇంత సులువా అనిపించేలా హేల్స్, బట్లర్ ఎవరినీ లెక్క చేయకుండా మన బౌలర్లందరిపై విరుచుకుపడ్డారు. ఫలితమే టి20 ప్రపంచకప్ చరిత్రలో అతి పెద్ద భాగస్వామ్యం... ఆపై టీమిండియా ఓటమి ఖాయం. టోర్నీ తొలి విజేత తర్వాతి ఏడు ప్రయత్నాల్లోనూ రిక్తహస్తాలతో ఇంటికి..!



అడిలైడ్: టి20 ప్రపంచకప్‌లో భారత్ ఆట సెమీఫైనల్లోనే ముగిసింది. సెమీస్‌లో సత్తా చాటి ఎంసీజీలో మరోసారి పాకిస్తాన్‌ను ఢీకొడుతుందని, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్న ఫైనల్ సాధ్యమవుతుందని భావించిన వారందరికీ ఇంగ్లండ్ బలమైన షాక్ ఇచ్చింది. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (33 బంతుల్లో 63; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా, విరాట్ కోహ్లి (40 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్) మరో అర్ధసెంచరీ సాధించాడు. జోర్డాన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఇంగ్లండ్ 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 170 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలెక్స్ హేల్స్ (47 బంతుల్లో 86 నాటౌట్; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), కెప్టెన్ జోస్ బట్లర్ (49 బంతుల్లో 80 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారత్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించారు. ఆదివారం మెల్‌బోర్న్‌లో జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది. 1992 వన్డే వరల్డ్‌కప్‌లో మెల్‌బోర్న్ మైదానంలోనే ఇంగ్లండ్, పాకిస్తాన్ ఫైనల్లో తలపడగా పాక్ గెలిచింది.

సూర్యకుమార్ విఫలం...

ఈ నాకౌట్ మ్యాచ్‌లో తొలి 10 ఓవర్లలో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో భారత్ స్కోరు 62/2 మాత్రమే! ఈ అతి జాగ్రత్తే చివరకు జట్టు కొంప ముంచింది. చివర్లో హార్దిక్ జోరుతో కొన్ని పరుగులు వేగంగా వచ్చినా, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై తగినంత స్కోరు చేయలేక టీమిండియా భంగపడింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (5) మరో కీలక పోరులోనూ పేలవ ప్రదర్శన కనబర్చగా, రోహిత్ శర్మ (28 బంతుల్లో 27; 4 ఫోర్లు) దూకుడుగా ఆడటంలో విఫలమయ్యాడు. రోహిత్ వెనుదిరిగిన తర్వాత వచ్చిన సూర్యకుమార్ (10 బంతుల్లో 14) వరుస బంతుల్లో 6, 4 కొట్టి తన శైలిని ప్రదర్శించాడు. అయితే ఆ తర్వాతి బంతికే రషీద్ అతని ఆటను ముగించడంతో భారత్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఫలితంగా కోహ్లి కూడా ఆత్మరక్షణలో పడి ధాటిని ప్రదర్శించలేకపోయాడు. 16 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 110 పరుగులకు చేరింది.

4 ఓవర్లలో 58 పరుగులు...

భారత జట్టు చివరకు కాస్త గౌరవప్రదమైన స్కోరు చేయగలిగిందంటే హార్దిక్ బ్యాటింగే కారణం. చివరి 4 ఓవర్లలో భారత్ 58 పరుగులు సాధిస్తే అందులో హార్దిక్ ఒక్కడే 50 కొట్టాడు! 18 బంతుల్లోనే అతను 3 ఫోర్లు, 5 సిక్సర్లతో చెలరేగాడు. జోర్డాన్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లు కొట్టిన అతను, స్యామ్ కరన్ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాదాడు. మరో ఎండ్‌లో 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే కోహ్లి వెనుదిరగ్గా, పంత్ (6) రనౌటయ్యాడు. జోర్డాన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో కూడా వరుసగా 6, 4 కొట్టాక వెనక్కి జరిగి మరో భారీ షాట్ ఆడే క్రమంలో ఆఖరి బంతికి హార్దిక్ అవుటయ్యాడు. బంతి బౌండరీని దాటినా, షాట్ ఆడే సమయంలో అతని కాలు స్టంప్స్‌ను తాకింది.

ఎదురులేని బ్యాటింగ్...

ఆరంభం నుంచి దూకుడు ప్రదర్శించే వ్యూహంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ చివరి వరకు దానిని కొనసాగించింది. భారత బౌలర్లు ఎంత శ్రమించినా ఓపెనింగ్ జోడీనే విడదీయలేకపోయారు. ఈ మ్యాచ్‌కు ముందు భువనేశ్వర్ బౌలింగ్‌లో చెత్త రికార్డు (32 బంతుల్లో 5 సార్లు అవుట్) ఉన్న బట్లర్ ఈసారి మాత్రం వెనక్కి తగ్గలేదు. భువీ వేసిన తొలి ఓవర్లోనే 3 ఫోర్లు బాది అతను తన ఉద్దేశాన్ని ప్రదర్శించాడు. షమీ ఓవర్లో హేల్స్ 6, 4 కొట్టడంతో పవర్‌ప్లేలో ఇంగ్లండ్ 63 పరుగులు (9 ఫోర్లు, 1 సిక్స్‌తో) సాధించింది. ఆ తర్వాత మరింత జోరుగా లక్ష్యం దిశగా జట్టు దూసుకుపోయింది. 28 బంతుల్లోనే హేల్స్ హాఫ్ సెంచరీ పూర్తి కాగా, 61 బంతుల్లోనే సెంచరీ భాగస్వామ్యం నమోదైంది. అశ్విన్ ఓవర్లో హేల్స్ 6, 4 కొట్టగా, హార్దిక్ ఓవర్లో 6, 4 బాది బట్లర్ 36 బంతుల్లో తన హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత షమీ ఓవర్లో బట్లర్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టడంతో ఇంగ్లండ్ విజయానికి చేరువైంది. షమీ తర్వాతి ఓవర్ ఆఖరి బంతికి లాంగాన్ మీదుగా భారీ సిక్సర్‌తో హేల్స్ ఆట ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) బట్లర్ (బి) వోక్స్ 5; రోహిత్ (సి) కరన్ (బి) జోర్డాన్ 27; కోహ్లి (సి) రషీద్ (బి) జోర్డాన్ 50; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) రషీద్ 14; హార్దిక్ (హిట్‌వికెట్) (బి) జోర్డాన్ 63; పంత్ (రనౌట్) 6; అశ్విన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168.** **వికెట్ల పతనం:** 1-9, 2-56, 3-75, 4-136, 5-158, 6-168. **బౌలింగ్:** స్టోక్స్ 2-0-18-0, వోక్స్ 3-0-24-1, స్యామ్ కరన్ 4-0-42-0, రషీద్ 4-0-20-1, లివింగ్‌స్టోన్ 3-0-21-0, జోర్డాన్ 4-0-43-3.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బట్లర్ (నాటౌట్) 80; హేల్స్ (నాటౌట్) 86; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 170.**
బౌలింగ్: భువనేశ్వర్ 2-0-25-0, అర్ష్‌దీప్ 2-0-15-0, అక్షర్ 4-0-30-0, షమీ 3-0-39-0, అశ్విన్ 2-0-27-0, హార్దిక్ 3-0-34-0.



"ఈ రోజు మా ఆటతో చాలా నిరాశ చెందాను. మేం బ్యాటింగ్ బాగానే చేశామని భావిస్తున్నా. బౌలింగ్ వైఫల్యంతోనే ఓడిపోయాం. 16 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా లక్ష్యం ఛేదించేంత సులువైన పిచ్ ఏమీ కాదిది. నాకౌట్ మ్యాచ్‌లలో ఒత్తిడిని జయించడం ముఖ్యం. ఇది ఎలా చేయాలో ఎవరూ నేర్పించరు. అది వ్యక్తిగతంగా చేయాల్సిన పని. ఐపీఎల్‌లో ఇలాంటి ఎన్నో మ్యాచ్‌లలో వారంతా ఒత్తిడిని అధిగమించినవారే. మా బౌలింగ్‌కు సరైన ఆరంభం లభించలేదు. తొలి ఓవర్లో బంతి కొంత స్వింగ్ అయినా అది సరైన దిశలో వెళ్లలేదు. మైదానం కొలతలపై మాకు అవగాహన ఉంది. వికెట్‌కు ఇరువైపులా పరుగులు ఆపేందుకు వ్యూహాలు రూపొందించినా ఇంగ్లండ్ ఓపెనర్లు భారీగా పరుగులు రాబట్టగలిగారు."

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్

170 టి20 వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక భాగస్వామ్యం.

1 టి20 వరల్డ్‌కప్ నాకౌట్ మ్యాచ్‌లో ఒక జట్టు 10 వికెట్ల తేడాతో గెలవడం ఇదే మొదటిసారి.

2 టి20 ప్రపంచకప్‌లో (2021లో పాక్ చేతిలో) రెండుసార్లు 10 వికెట్ల తేడాతో ఓడిపోయిన ఏకైక జట్టు భారత్.

4008 అంతర్జాతీయ టి20ల్లో కోహ్లి పరుగులు. 4 వేల పరుగులు దాటిన తొలి ఆటగాడిగా కోహ్లి.

ఇదీ తేడా	పవర్ ప్లే (6 ఓవర్లలో)	10 ఓవర్లు	15 ఓవర్లు
భారత్	38/1	62/2	100/3
ఇంగ్లండ్	63/0	98/0	156/0

బౌండరీ మీటర్	ఫోర్లు	సిక్స్‌లు
భారత్	15	7
ఇంగ్లండ్	13	10

మళ్లీ అదే వ్యథ...



- కీలక మ్యాచ్‌ల్లో తడబాటు
- పనిచేయని వ్యూహాలు
- కొందరి ప్రతిభతో నెట్టుకొస్తున్న వైనం

సాక్షి క్రీడా విభాగం

'ఫలితాలతో సంబంధం లేకుండా మ్యాచ్ ఆసాంతం దూకుడుగా ఆడటమే మా కొత్త విధానం. గత ఏడాది కాలంగా ఇదే తరహా ఆట ఆడుతున్నాం. మా జట్టులో వచ్చిన కీలక మార్పు ఇది' ఇటీవల పదే పదే కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్య ఇది. సంవత్సర కాలంగా ద్వైపాక్షిక సిరీస్‌లలో ఇది పని చేసింది కూడా. కానీ వరల్డ్ కప్‌కు వచ్చేసరికి మళ్లీ పాత తరహా ఆటనే. ఈ టోర్నీలో పవర్‌ప్లేలో భారత జట్టు ఓవర్‌కు 6 పరుగుల రన్‌రేట్‌తో పరుగులు చేసింది. మొత్తం జట్లలో నెదర్లాండ్స్, జింబాబ్వే మాత్రమే ఇంతకన్నా తక్కువ రన్‌రేట్‌తో ఆడాయి. మన జట్టు శైలి ఎలా ఉందో చెప్పేందుకు ఇది చాలు. సెమీస్‌లో కూడా చాలా సాంప్రదాయిక పద్ధతిలో, దూకుడు అనేదే లేకుండా టీమ్ ఆడింది. సాధారణంగా ప్రత్యర్థి జట్టులో మంచి బౌలర్లతో పాటు ఒకరిద్దరు బలహీన బౌలర్లు ఉంటారు. వారిని లక్ష్యంగా చేసుకోవాలి. లివింగ్‌స్టోన్‌ను కూడా మనోళ్లు కొట్టలేకపోయారు. ఇన్నింగ్స్ ఆరంభంలో వికెట్లు కాపాడుకుంటూ ఆడటం, చివర్లో చెలరేగిపోవడం అనే శైలిలో భారత్ ఆట సాగింది. అయితే ఆ వ్యూహం సెమీస్‌లో పని చేయలేదు.

- పాక్‌పై అద్భుత విజయంతో భారత అభిమానుల ఆశలను టీమిండియా ఆకాశానికి తీసుకెళ్లింది. ఆ మ్యాచ్‌లో చిరస్మరణీయ విజయంతో జట్టులోని పలు లోపాలు కూడా బయటకు రాకుండా పోయాయి. దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి కాస్త మేలుకునేలా చేసినా, బంగ్లాదేశ్ కూడా చివరి వరకు చెమటలు పట్టించింది! సరిగ్గా చెప్పాలంటే జింబాబ్వేపై మినహా మరే మ్యాచ్‌లోనూ భారత జట్టు సంపూర్ణ, సమష్టి ప్రదర్శన ఇవ్వలేకపోయింది.
- అంతర్జాతీయ టి20ల్లో 4 సెంచరీలు సహా విధ్వంసక ఆటగాళ్లలో ఒకడైన రోహిత్ పూర్తిగా తేలిపోవడం జట్టును దెబ్బ తీసింది. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి 116 పరుగులు అదీ 106 స్ట్రయిక్‌రేట్‌తో చేయడం నిజంగా ఆశ్చర్యకరం! నెదర్లాండ్స్‌లాంటి బలహీన జట్టుపై మాత్రమే హాఫ్ సెంచరీ వచ్చింది. ఇక రాహుల్ గురించి ఎంత తక్కువగా చెబితే అంత మంచిది. మొత్తం 128 పరుగులు చేసిన అతను ప్రధాన జట్లయిన పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లపై పూర్తిగా విఫలమయ్యాడు. కోహ్లి ఒక్కడే నాలుగు అర్ధ సెంచరీలతో (మొత్తం 296 పరుగులు) జట్టు జెండా మోశాడు. సూర్యకుమార్ అసలు పోరులో విఫలమయ్యాడు.
- బౌలింగ్‌లో ఆడుతున్న తొలి వరల్డ్‌కప్‌లోనే అర్ష్‌దీప్ ఆకట్టుకోగా, భువనేశ్వర్ కూడా లయ అందుకున్నాడు. బుమ్రా లేని లోటును షమీ సరిగానే పూరించాడు. సెమీస్ మ్యాచ్ మినహా అతని బౌలింగ్ బాగా సాగింది. కార్తీక్, పంత్‌లలో ఒకరిని తేల్చుకునే విషయంలో సందిగ్ధతను ఆసాంతం కొనసాగించాం. లీగ్‌లో ఒక్క మ్యాచ్ ఆడించి సెమీస్‌లో ఫినిషర్ పాత్ర ఇస్తే పంత్ ఏం చేయగలడు!
- ఇక అన్నింటికంటే ఎక్కువ ఆశ్చర్యపర్చిన నిర్ణయం లెగ్‌స్పిన్నర్ యజువేంద్ర చహల్‌కు ఒక్క మ్యాచ్ కూడా దక్కకపోవడం. గత టి20 ప్రపంచకప్‌లో చహల్ లేకపోవడంతో అటాకింగ్ బౌలర్ తగ్గాడంటూ విమర్శలు రావడంతో తర్వాతి సిరీస్‌లోనే అతనికి అవకాశం లభించింది. వరల్డ్ కప్ ముందు వరకు అన్ని మ్యాచ్‌లలో ఆడించి అసలు సమరంలో అతడికి డ్రింక్స్ ఇచ్చే పనికే సరిపెట్టారు. అశ్విన్‌పై అపార నమ్మకంతో కనీసం లెగ్‌స్పిన్నర్‌తో ఒక మ్యాచ్‌లో ప్రయత్నించే సాహసం కూడా టీమ్ చేయలేకపోయింది. అలా అని అశ్విన్ కూడా అద్భుతాలేమీ చేయలేదు. బ్యాటింగ్‌కు పనికొస్తారనే కారణంతో అతడిని, అక్షర్ పటేల్‌ను ఆడించడం అంటే టాప్–7 బ్యాటింగ్‌పై జట్టుకు నమ్మకం లేనట్లా!
- 2021 వరల్డ్‌కప్‌లో లీగ్ దశకే పరిమితమైన తర్వాత కోహ్లి కెప్టెన్సీపై కూడా విమర్శలు వచ్చాయి. అదే స్థానంలో రోహిత్ ఉండి ఉంటే ఎలా చేసే వాడో విశ్లేషణలు వచ్చాయి. అయితే ఐదు ఐపీఎల్ టైటిల్స్ అనుభవం అంతర్జాతీయ మ్యాచ్‌లకు పనికి రాలేదు. రోహిత్ కూడా వ్యూహాలు, ప్రణాళికల విషయంలో పూర్తిగా విఫలమయ్యాడు. అతని నాయకత్వ ప్రతిభను చూపించే ఒక్క ఘటన కూడా టోర్నీలో కనిపించలేదు. డెత్ ఓవర్ స్పెషలిస్ట్ అంటూ తీర్చిదిద్దిన హర్షల్‌ను పెవిలియన్‌కే పరిమితం చేయడం రోహిత్ ఆత్మరక్షణ ధోరణిని చూపించింది.
- చివరగా... దక్షిణాఫ్రికా గడ్డపై సిరీస్ మొదలుకొని ఇంగ్లండ్‌తో టెస్టులో ఓటమి, రెండు వరల్డ్‌కప్‌లలో వైఫల్యం... తాజా ప్రదర్శన వరకు కోచ్‌గా ద్రవిడ్‌కు ఫెయిల్ మార్కులే పడ్డాయి. మరి ఆయనను ప్రశ్నించే సమయం ఎప్పుడొస్తుందో?

సెమీస్‌లో ఎందుకు ఓడామంటే...

- సూర్యకుమార్ జోరుకు సరైన వ్యూహంతో ఇంగ్లండ్ అడ్డుకుంది. టోర్నీలో ఇప్పటి వరకు అతను ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిన వాటిలో అత్యధిక బంతులు బాగా వేగవంతమైనవే. బంతి ఎంత వేగంగా వస్తే సూర్య అంతే వేగంగా బౌండరీ దాటించాడు. అందుకే అటు రషీద్ స్పిన్‌తో పాటు ఇటు అన్నీ స్లో బంతులే వేసింది. దాంతో ఆ ఉచ్చులో సూర్య చిక్కాడు.
- రెగ్యులర్ లెగ్ స్పిన్నర్ రషీద్, పార్ట్ టైమ్ లెగ్ స్పిన్నర్ లివింగ్‌స్టోన్ కలిసి 7 ఓవర్లలో 41 పరుగులే ఇచ్చారు. నిజానికి ఎడంచేతి వాటం ఆటగాళ్లు లెగ్ స్పిన్నర్లపై విరుచుకు పడవచ్చని, అడిలైడ్‌లో స్క్వేర్‌లెగ్ బౌండరీలు చిన్నవి కాబట్టి వేగంగా పరుగులు రాబడతాడనే రిషభ్ పంత్‌ను టీమ్‌లోకి తీసుకున్నారు. అయితే ఇదంతా వృథా అయింది. పంత్ క్రీజ్‌లోకి వచ్చేసరికి ఈ 7 ఓవర్లూ ముగిసిపోయాయి.
- తొలి 15 ఓవర్లలో భారత్ 2 సిక్సర్లే కొట్టగలిగింది. ఇంగ్లండ్ సరైన వ్యూహంతో స్క్వేర్‌లెగ్ బౌండరీల వైపు పరుగులే ఇవ్వలేదు.

అహో హేల్స్...

రాత మార్చుకున్న ఇంగ్లండ్ ఓపెనర్

'నేను మళ్లీ ప్రపంచకప్ ఆడతానని అనుకోలేదు'... సెమీస్ ముగిసిన తర్వాత అలెక్స్ హేల్స్ వ్యాఖ్య ఇది. బహుశా భారత అభిమానులు కూడా అదే జరిగి ఉంటే బాగుండేదని అనుకొని ఉంటారు! మూడేళ్ల పాటు ఆటకు దూరమై పునరాగమనంలో మళ్లీ చెలరేగుతున్న హేల్స్ కథ కూడా ఎంతో ఆసక్తికరం.

➡ 2019 వన్డే వరల్డ్ కప్‌కు ముందు... హేల్స్ సరదాగా ప్రమాదకరం కాని 'రిక్రియేషనల్ డ్రగ్స్' తీసుకున్నాడు. దాంతో అతనిపై 3 వారాల నిషేధం విధించారు. అయితే ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ దృష్టిలో మాత్రం డ్రగ్స్ వ్యవహారం చిన్న తప్పుగా అనిపించలేదు. దీనిని 'నైతికత'కు సంబంధించిన అంశంగా వాదించిన మోర్గాన్ వరల్డ్ కప్ జట్టులోంచి హేల్స్‌ను తీసేయించాడు. నిజానికి 2015 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్ ఘోర వైఫల్యం తర్వాత జట్టు పునరుజ్జీవంలో హేల్స్ కూడా కీలక పాత్ర పోషించాడు. వన్డేల్లో ఇంగ్లండ్ రికార్డు స్కోర్లలో అతనిదే ప్రధాన పాత్ర. అయినా సరే మోర్గాన్ మాత్రం తగ్గలేదు. హేల్స్‌ను జట్టుకు దూరంగా ఉంచి తన మాట నెగ్గించుకున్నాడు. సరిగ్గా చెప్పాలంటే 'నేను కెప్టెన్‌గా ఉన్నంత వరకు నువ్వు మళ్లీ ఇంగ్లండ్ జట్టులోకి రాలేవు' అని సందేశం ఇచ్చాడు. చివరకు అదే జరిగింది.

➡ ఇంగ్లండ్ దేశవాళీ టోర్నీలలో ఎంత గొప్ప ప్రదర్శన ఇచ్చినా మూడేళ్ల పాటు అతనికి టీమ్‌లో చోటు దక్కలేదు. ఆ బాధను అధిగమించి అతను ప్రపంచవ్యాప్తంగా టి20 లీగ్‌లలో ఆడుతూ వచ్చాడు. చివరకు ఈ ఏడాది జూన్‌లో మోర్గాన్ రిటైర్ అయ్యాడు... సెప్టెంబర్‌లో హేల్స్‌కు టీమ్‌లో స్థానం లభించింది. పాకిస్తాన్ పర్యటనలో ఆకట్టుకున్న అతను వరల్డ్ కప్‌లో కీలక ఇన్నింగ్స్‌లతో తానేంటో నిరూపించాడు.

➡ పాక్ టూర్ తర్వాత కూడా ఇంగ్లండ్ వరల్డ్ కప్ జట్టులో హేల్స్‌కు స్థానం దక్కలేదు. అయితే బెయిర్‌స్టో అనూహ్యంగా గాయపడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో హేల్స్‌ను టీమ్‌లోకి తీసుకోవాల్సి వచ్చింది. అది ఎంత సరైన నిర్ణయమో ఇంగ్లండ్‌కు ఇప్పుడు తెలిసింది. ఈ టోర్నీలో నాలుగు ప్రధాన జట్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, భారత్‌లతో జరిగిన మ్యాచ్‌లలో అతను 84, 52, 47, 86 నాటౌట్ పరుగులు సాధించి జట్టును ఫైనల్‌కు చేర్చాడు.

➡ ఆసీస్ గడ్డపై బిగ్‌బాష్ లీగ్‌లో పెద్ద సంఖ్యలో మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఇప్పుడు హేల్స్‌కు ఈ టోర్నీలో పనికొచ్చింది. వరల్డ్‌కప్‌లో స్కై స్పోర్ట్స్ కామెంటరీ టీమ్‌లో భాగంగా ఉన్న ఇయాన్ మోర్గాన్ ఇప్పుడు చప్పట్లతో హేల్స్‌ను ప్రశంసించక తప్పడం లేదు!

–సాక్షి క్రీడావిభాగం


బట్లర్
హేల్స్

ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చందర్‌పాల్, ఎడ్వర్డ్స్, ఖాదిర్

సిడ్నీ: వెస్టిండీస్ దిగ్గజం చందర్‌పాల్, ఇంగ్లండ్ మహిళా క్రికెటర్ చార్లట్ ఎడ్వర్డ్స్, పాకిస్తాన్ దివంగత స్పిన్ లెజెండ్ అబ్దుల్ ఖాదిర్‌లను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విశిష్ట క్రికెటర్ల జాబితాలో చేర్చారు. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్ సందర్భంగా ముగ్గురు క్రికెటర్లకు ఐసీసీ పురస్కారాలు అందజేశారు. 21 ఏళ్ల సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో చందర్ పాల్ అన్ని ఫార్మాట్లలో కలిపి 20,988 పరుగులు చేశాడు. ఇందులో 41 సెంచరీలు, 125 అర్ధసెంచరీలున్నాయి. ఇంగ్లండ్ గ్రేటెస్ట్ క్రికెటర్లలో ఎడ్వర్డ్స్‌కు ప్రత్యేక స్థానముంది. ఆమె సారథ్యంలోనే ఇంగ్లండ్ వన్డే, టి20 ఫార్మాట్లలో ప్రపంచకప్‌లు సాధించింది. పాక్ దిగ్గజ లెగ్ స్పిన్నర్ ఖాదిర్ 63 వయస్సులో (2019) కన్నుమూశారు. టెస్టు క్రికెటర్లలో అలనాటి గ్రేటెస్ట్ స్పిన్నర్‌గా వెలుగొందారు. 67 మ్యాచుల్లోనే 236 వికెట్లు తీసిన



ఘనత ఆయనది. 1987లో ఇంగ్లండ్‌పై 56 పరుగులిచ్చి 9 వికెట్లు తీశాడు. ఖాదిర్ తరఫున అతని కుమారుడు ఉస్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు.


దక్షిణ కొరియా జట్టు

అందనంత దూరంలో...

- ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆసియా జట్ల ప్రదర్శన అంతంతే
- కొరియా జట్టు మినహా రెండో రౌండ్ దాటని ఇతర జట్లు



ఖరీదైన క్రీడ కాకపోవడం... ప్రావీణ్యం ఉంటే ఎక్కడైనా ఆర్థికంగా స్థిరపడే అవకాశాలు మెండుగా ఉండటం... ప్రపంచవ్యాప్తంగా ప్రొఫెషనల్ లీగ్‌లు జరుగుతుండటం... వెరసి ఫుట్‌బాల్ ఆడేవారి సంఖ్యలో పెరుగుదలే కానీ తరుగుదల కనిపించదు. అన్ని ఖండాలకు చెందిన జట్లు భాగస్వామ్యంగా నాలుగేళ్లకోసారి జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఎనిమిది దేశాలు విశ్వవిజేతగా నిలిచాయి. ఇందులో ఐదు జట్లు (జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, ఇంగ్లండ్) యూరప్‌నకు చెందినవి కాగా మిగతా మూడు జట్లు (బ్రెజిల్, అర్జెంటీనా, ఉరుగ్వే) దక్షిణ అమెరికాకు చెందినవి. అయితే ఆసియా, ఆఫ్రికా దేశాలు మాత్రం ఈ మెగా ఈవెంట్‌లో అడపాదడపా మెరిపిస్తున్నా నిలకడైన ప్రదర్శన ఇవ్వడంలో విఫలమవుతున్నాయి. 1938లో ఆసియా నుంచి ఇండోనేసియా తొలిసారి ప్రపంచకప్‌లో ఆడింది. ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1942లో, 1946లో ప్రపంచకప్ జరగలేదు. 1950లో బ్రెజిల్‌లో ప్రపంచకప్ జరిగినా ఆసియా నుంచి ఒక్క దేశం కూడా పాల్గొనలేదు. 1954లో దక్షిణ కొరియా రూపంలో మళ్లీ ఆసియా నుంచి ప్రాతినిధ్యం మొదలైంది. ఆ తర్వాత జరిగిన ఐదు ప్రపంచకప్‌లలో రెండుసార్లు మాత్రమే ఆసియా నుంచి జట్లు పాల్గొన్నాయి. 1978 నుంచి మాత్రం ప్రతి ప్రపంచకప్‌లో ఆసియా జట్లు బరిలోకి దిగుతున్నాయి. క్రమక్రమంగా ప్రపంచకప్‌లో పాల్గొనే జట్ల సంఖ్య పెరగడంతో ఆసియా జోన్ నుంచి మరిన్ని జట్లకు అవకాశం లభించింది. ఇప్పటివరకు ఆసియా నుంచి 12 జట్లు ప్రపంచకప్‌లో ఒక్కసారైనా బరిలోకి దిగాయి. దక్షిణ కొరియా అత్యధికంగా 11 సార్లు ప్రపంచకప్‌లో పోటీపడింది. జపాన్ ఏడుసార్లు బరిలోకి దిగగా... ఆస్ట్రేలియా, ఇరాన్, సౌదీ అరేబియా ఆరుసార్లు చొప్పున ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడ్డాయి. 1966లో ఉత్తర కొరియా క్వార్టర్ ఫైనల్ చేరగా... 2002లో జపాన్‌తో కలిసి ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన దక్షిణ కొరియా సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన ఏకైక ఆసియా జట్టుగా నిలిచింది. అనంతరం నాలుగు ప్రపంచకప్‌లు జరిగినా మరో ఆసియా జట్టు సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయింది. మరో పది రోజుల్లో ఖతర్‌లో ప్రారంభం కాబోతున్న ప్రపంచకప్‌లో ఆసియా నుంచి తొలిసారి అత్యధికంగా ఆరు జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఆతిథ్య ఖతర్ జట్టుకు నేరుగా ఎంట్రీ లభించగా... క్వాలిఫయింగ్ ద్వారా కొరియా, జపాన్, ఆస్ట్రేలియా, ఇరాన్, సౌదీ అరేబియా అర్హత పొందాయి. 20 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఈసారైనా మరో ఆసియా జట్టు సెమీఫైనల్ చేరుకుంటుందో లేదో చూడాలి. –సాక్షి క్రీడావిభాగం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 419	నిఫ్టీ ▽ 129
60,613	18,028

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,937	△	584
డోజోన్స్	33,327	△	814
ఎఫ్‌టీఎస్ఈ 100	7,375	△	79
డాక్స్	14,146	△	498
షాంఘై	3,036	▽	12
నికాయ్	27,446	▽	270

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	51,514
బంగారం (99.5 స్వచ్ఛత)	51,308
వెండి (కేజీ)	61,200

హైదరాబాద్‌లో జియో 5జీ సర్వీసులు



హైదరాబాద్: టెలికం సంస్థ జియో తాజాగా హైదరాబాద్, బెంగళూరులో 5జీ సర్వీసులు అందుబాటులోకి తెచ్చింది. నవంబర్ 10 నుండి జియో ట్రూ–5జీ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు సంస్థ తెలిపింది. 'జియో వెల్‌కం ఆఫర్' ఆహ్వానం పొందిన యూజర్లు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండానే 1 జీబీపైగా స్పీడ్‌తో అపరిమిత 5జీ డేటా పొందవచ్చని పేర్కొంది. జియోట్రూ 5జీ ఇప్పటికే ఆరు నగరాల్లో (ముంబై, ఢిల్లీ, కోల్‌కతా మొదలైనవి) లక్షలాది యూజర్లకు సర్వీసులు అందిస్తున్నట్లు కంపెనీ వివరించింది.

బీఓబీ రుణ రేటు పెంపు



న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) రుణ రేట్లను పెంచింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణరేటును అన్ని కాలపరిమితులపై 15 బేసిస్ పాయింట్ల వరకూ పెంచుతున్నట్లు ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. సవరిత రేట్లు 12వ తేదీ (శనివారం) నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. పెరిగిన రేట్లను చూస్తే బెంచ్‌మార్క్ ఏడాది ఎంసీఎల్‌ఆర్ 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు 1%) పెరిగి 8.05%కి చేరింది. ఇది వ్యక్తిగత, ఆటో, గృహ రుణాలకు అనుసంధానమైన రేటు. ఏడాది, మూడేళ్లు, 6 నెలల రేట్లు 10 బేసిస్ పాయింట్ల చొప్పున ఎగసి వరుసగా 7.70%, 7.75%, 7.90 శాతాలకు చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-11-2022	
విశాఖ	505-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	504-00
విజయవాడ	504-00
రిటైల్ ధర (డజను)	78.00
10-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	480-00
వరంగల్	490-00
రిటైల్ ధర	5.50

పీఎఫ్‌సీకి రికార్డ్ లాభం

క్యూ2లో రూ. 5,229 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది(2022–23) రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌గా జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4% వృద్ధితో రూ. 5,229 కోట్లను అధిగమించింది. ఇది ఒక క్వార్టర్‌కు కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. గతేడాది (2021–22) ఇదే కాలంలో రూ. 5,023 కోట్లు ఆర్జించింది. ఆదాయం రూ. 19,283 కోట్ల నుంచి రూ. 19,344 కోట్లకు బలపడింది. షేరుకి రూ. 3 చొప్పున రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 5.17% నుంచి 4.38%కి, నికర ఎన్‌పీఏలు 1.72% నుంచి 1.27%కి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు ఎన్ఎస్ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 117 వద్ద ముగిసింది.

సెయిల్‌కు రూ. 329 కోట్ల నష్టం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఉక్కు తయారీ సంస్థ సెయిల్ సెప్టెంబర్ క్వార్టర్‌కు భారీ నష్టాలను మూటగట్టుకుంది. ఏకంగా రూ.329 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఆదాయం రూ.26,642 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో సెయిల్ రూ.4,339 కోట్ల లాభాన్ని ప్రకటించడం గమనార్హం. ఆదాయం కూడా అంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.27,007 కోట్లుగా ఉంది. ప్రధానంగా వ్యయాలు రూ. 21,289 కోట్ల నుంచి రూ.27,201 కోట్లకు పెరిగాయి. 4.30 మిలియన్ టన్నుల స్టీల్‌ను కంపెనీ తయారు చేసింది. క్రితం ఏడాది క్యూ2లో 4.28 మిలియన్ టన్నుల స్టీల్ విక్రయించగా, తాజాగా ముగిసిన త్రైమాసికంలో 4.21 మిలియన్ టన్నులుగా ఉంది.

యాక్సిస్ నుంచి ప్రభుత్వం ఔట్!



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ నుంచి ప్రభుత్వం పూర్తిగా వైదొలగనుంది. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక విభాగం (ఎస్‌యూయూటీఐ) ద్వారా మిగిలిన 1.55% వాటాను ప్రభుత్వం విక్రయించనున్నట్లు యాక్సిస్ బ్యాంకు తాజాగా పేర్కొంది. మొత్తం 4,65,34,903 షేర్లను ప్రభుత్వం ఆఫర్ చేయనున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. తద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 4,000 కోట్లు లభించే వీలుంది. వెరసి యాక్సిస్ బ్యాంకు నుంచి ప్రభుత్వం పూర్తిగా వైదొలగనుంది. కాగా.. గతేడాది మే నెలలోనూ ప్రభుత్వం ఎస్‌యూయూటీఐ ద్వారా యాక్సిస్ బ్యాంకులో 1.95 శాతం వాటాను విక్రయించింది.

ఈ వార్తల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు 4% పతనమై రూ. 841 వద్ద ముగిసింది.

సూచీలకు రెండోరోజూ నష్టాలు

- యూఎస్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి అప్రమత్తత
- సెన్సెక్స్ 419 పాయింట్లు మైనస్
- నిఫ్టీకి 129 పాయింట్ల పతనం
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు



ముంబై: ఫెడ్ వడ్డీరేట్లను నిర్ణయించే అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ఈక్విటీ మార్కెట్లలో అప్రమత్తత నెలకొంది. అన్ని రంగాల షేర్లలో విస్తృత స్థాయి విక్రయాలు తలెత్తడంతో సూచీలు రెండో రోజూ డీలాపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనత సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచింది. ముఖ్యంగా ఆటో, ఫైనాన్స్, ఇంధన షేర్లలో భారీగా లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా సెన్సెక్స్ 419 పాయింట్లు నష్టపోయి 60,613 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129 పాయింట్లు పతనమై 18,028 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ సూచీ ఒకటిన్నర శాతం చతికిలపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.36 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.967 కోట్ల షేర్లను అమ్మేశారు. ట్రేడింగ్ నష్టాలను భర్తీ చేసుకున్న రూపాయి ఏడు పైసలు స్వల్పంగా బలపడి 81.40 వద్ద స్థిరపడింది. ఆసియా, యూరప్ మార్కెట్లు 1–2శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ రెండు రోజుల్లో 571 పాయింట్లు నష్టపోవడంతో ఇన్వెస్టర్లు రూ.3.1 లక్షల కోట్లు సంపద కోల్పోయారు. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.281.60 లక్షల కోట్లకు దిగివచ్చింది.

భారీ లాభాల్లో అమెరికా మార్కెట్లు

అమెరికా అక్టోబర్ వినియోగ ధరల(సీపీఐ) ద్రవ్యోల్బణం ఆర్థికవేత్తల అంచనా(8%)ల కంటే తక్కువగా 7.7 శాతానికి దిగివచ్చిందని (గురువారం రాత్రి) కార్మిక శాఖ వెల్లడించింది. పరుగులు తీస్తున్న ధరలు నెమ్మదించడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా యూఎస్ మార్కెట్లు భారీ లాభాలతో ట్రేడ్ అవుతున్నాయి. ప్రధాన సూచీలైన డోజోన్స్ 3%, ఎస్అండ్‌పీ 3.50%, నాస్‌డాక్ ఏకంగా ఐదుశాతం లాభంతో కదలాడుతున్నాయి.

ట్రేడింగ్‌లో 18 వేల దిగువకు నిఫ్టీ

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 509 పాయింట్ల నష్టంతో 60,524 వద్ద, నిఫ్టీ 113 పాయింట్లు క్షీణించి 18,044 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. కీలక రంగాల్లో తలెత్తిన అమ్మకాలతో సూచీలు ఏ దశలో కోలుకోలేకపోయాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 609 పాయింట్లు పతనమై 60,425 వద్ద, నిఫ్టీ 188 పాయింట్లు నష్టపోయి 17,969 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల ప్రకటన మరుసటి రోజు టాటా మోటార్స్ షేరు డీలాపడింది. బీఎస్ఈలో 5 శాతం నష్టపోయి రూ.412 వద్ద నిలిచింది.
- లిస్టింగ్ తరువాత లాకిన్ పీరియడ్ ముగియడంతో నైకా షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ కొత్త తరం టెక్ షేరు చివరికి నాలుగున్నర శాతం లాభపడి రూ.188 వద్ద నిలిచింది.

సిప్.. సిప్.. హుర్రే!

- క్రమానుగత పెట్టుబడులకు ఇన్వెస్టర్ల మొగ్గు
- అక్టోబర్ నెలకు రూ.13,000 కోట్లు
- ఇది నెలవారీ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (క్రమానుగత పెట్టుబడులు/సిప్)కు రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి ఆదరణ ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా అక్టోబర్ నెలలో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో రూ.13,040 కోట్లు సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి వచ్చాయి. సెప్టెంబర్ నెలలో వచ్చిన రూ.12,976 కోట్లను అధిగమించాయి. సిప్ ద్వారా ప్రతి నెలా నిర్దీత మొత్తం ఇన్వెస్ట్ చేయడం వల్ల.. మార్కెట్ ర్యాలీల్లో, పతనాల్లోనూ పెట్టుబడులు పెట్టడం సాధ్యపడుతుంది. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి రిస్క్ తగ్గుతుంది. దీర్ఘకాలంలో మంచి రాబడులకూ అవకాశం ఉంటుంది. పైగా నెలవారీ సంపాదనకు అనుగుణంగా ప్రణాళిక మేరకు, నిర్దేశిత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిప్ సానుకూలతలపై రిటైల్ ఇన్వెస్టర్లలో అవగాహన విస్తృతం అవుతున్న కొద్దీ, దీని రూపంలో వచ్చే పెట్టుబడులు కొత్త గరిష్టాలను తాకుతున్నాయి. అక్టోబర్ నెలకు సంబంధించి ఫండ్స్ పెట్టుబడుల వివరాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ 'యాంఫీ' గురువారం విడుదల చేసింది. ఈ ఏడాది మే నుంచి సిప్ పెట్టుబడులు ప్రతి నెలా రూ.12వేల కోట్లకు పైనే నమోదవుతున్నాయి. మే నెలలో రూ.12,286 కోట్లు, జూన్‌లో రూ.12,276 కోట్లు, జూలైలో రూ.12,140 కోట్లు చొప్పున వచ్చాయి. ఏప్రిల్ నెలకు రూ.11,863 కోట్లుగా ఉన్నాయి.

ఏడు నెలల్లో రూ.87,000 కోట్లు

ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో సిప్ రూపంలో ఈక్విటీల్లోకి వచ్చిన మొత్తం పెట్టుబడులు రూ.87,000 కోట్లుగా ఉన్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2021–22) మొత్తం మీద రూ.1.24 లక్షల కోట్లు సిప్ రూపంలో వచ్చాయి. ''మార్కెట్లు అంతర్జాతీయ పరిణామాలకు, స్థానిక రేట్ల పెంపునకు స్పందిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లు తమ నమ్మకాన్ని ప్రదర్శిస్తూ, సిప్ రూపంలో ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తూనే ఉన్నారు'' అని యాంఫీ సీఈవో ఎన్ఎస్ వెంకటేశ్ తెలిపారు. ఈక్విటీ నిర్వహణ ఆస్తులు, ఫోలియోల్లోనూ వృద్ధి ఉన్నట్టు చెప్పారు. అక్టోబర్ నెలలో కొత్తగా 9.52 లక్షల సిప్ ఖాతాలు నమోదయ్యాయి. ఒక పథకంలో ఒక ఇన్వెస్టర్ పెట్టుబడికి కేటాయించే నంబర్‌ను ఫోలియోగా పేర్కొంటారు. దీంతో మొత్తం సిప్ ఖాతాల సంఖ్య అక్టోబర్ చివరికి 5.93 కోట్లకు చేరింది. సిప్ రూపంలో స్థిరమైన పెట్టుబడుల రాక మన ఈక్విటీ మార్కెట్లలో కొంత స్థిరత్వానికి సాయపడుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ఈక్విటీల్లోకి రూ.9,390 కోట్లు

ఇక అక్టోబర్ నెలకు ఈక్విటీ పథకాల్లోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.9,390 కోట్లుగా ఉన్నాయి. దీంతో వరుసగా 20వ నెలలోనూ (2021 మార్చి నుంచి) ఈక్విటీ పథకాల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చినట్టయింది. కాకపోతే ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన రూ.14,100 కోట్లతో పోలిస్తే చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గాయి. మార్కెట్లలో అస్థిరతలు పెట్టుబడులపై ప్రభావం చూపించినట్టు తెలుస్తోంది. గోల్డ్ ఈటీఎఫ్‌లోకి రూ.147 కోట్లు వచ్చాయి. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి నికరంగా రూ.2,818 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. అన్ని రకాల విభాగాలు కలిపి చూస్తే ఫండ్స్ పరిశ్రమలోకి అక్టోబర్‌లో రూ.14,047 కోట్లు వచ్చాయి. దీంతో ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.39.5 లక్షల కోట్లకు చేరింది. సెప్టెంబర్ చివరికి ఇది రూ.38.4 కోట్లుగా ఉంది.

క్యూ2లో డ్రెడ్జింగ్ కార్ప్ రికార్డ్



దశాబ్ద కాలంలో తొలిసారి లాభాలు

సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) రెండో త్రైమాసికంలో దాదాపు దశాబ్దం తర్వాత డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) లాభాలు ఆర్జించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 28.61 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. రూ.3.98 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 151.4 కోట్ల నుంచి రూ. 239.6 కోట్లకు ఎగసింది. స్టాండెలోన్ ఫలితాలివి. 2012లో తొలిసారి రూ.కోటి వరకూ లాభాల్ని సాధించాక.. మళ్లీ 2022లో ఏకంగా రూ.28.61 కోట్లు లాభాల్ని ఆర్జించినట్లు ఎండీ, సీఈవో ఎస్.దివాకర్ వెల్లడించారు. ఇటీవల ఇంధన ధరలు అధికమైనప్పటికీ.. మెరుగైన పనితీరుని ప్రదర్శించినట్లు దివాకర్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ.1000 కోట్ల టర్నోవర్ సాధించే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో డ్రెడ్జింగ్ కార్ప్ షేరు 0.6 శాతం నీరసించి రూ. 357 వద్ద ముగిసింది.

సినిమా



ఫారిన్‌లో పాట

త్వరలో న్యూజిల్యాండ్‌లో ల్యాండ్ కానున్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ న్యూజిల్యాండ్‌లో ఆరంభం కానుందని తెలిసింది. ఈ నెల మూడోవారంలో రామ్‌చరణ్, శంకర్ అండ్ టీమ్ ఫారిన్ ప్రయాణం అవుతారు. ముందుగా న్యూజిల్యాండ్‌లోని అందమైన లొకేషన్స్‌లో రామ్‌చరణ్, కియారాలపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరిస్తారట. ఈ పాటకు బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ స్టెప్స్ సమకూర్చనున్నారని తెలిసింది. ఈ పాటతో పాటు కొన్ని కీలక సన్నివేశాలను కూడా ప్లాన్ చేశారట శంకర్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


● రామ్‌చరణ్



● అల్లు అర్జున్

అస్సలు తగ్గదేలే!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమా తొలి భాగం 'పుష్ప: ది రైజ్' గత ఏడాది విడుదలై అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. మలి భాగం 'పుష్ప: ది రూల్' చిత్రం షూటింగ్‌ను వెంటనే ఆరంభించాలనుకున్నారు మేకర్స్. కానీ కాస్త ఆలస్యమైంది. ఇక అస్సలు తగ్గదేలే అంటూ పక్కా ప్లానింగ్‌తో 'పుష్ప: ది రూల్' షూటింగ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లుగా తెలిసింది. అయితే ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్ పాల్గొనడం లేదు. ఓ పెళ్లికి హాజరయ్యేందుకు విదేశాలకు వెళ్లారు అల్లు అర్జున్. వచ్చీ రాగానే ఈ షూటింగ్‌లో జాయిన్ అవుతారు. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీ రోల్స్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.



● మహేశ్‌బాబు

గెట్.. సెట్.. గో

జిమ్‌లో వర్కౌట్ షురూ చేశారు మహేశ్‌బాబు. సో.. త్వరలోనే ఆయన సెట్స్‌లోకి కూడా అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మలి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్ చిత్రీకరణ కోసమే మహేశ్‌బాబు వర్కౌట్స్ స్టార్ట్ చేసినట్లుగా తెలుస్తోంది. కాగా ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఈ నెల చివర్లో లేదా వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఇక ఈ సినిమా కాకుండా మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.


మాస్టారు... నా మనసును గెలిచారు



● ధనుష్, సంయుక్తా మీనన్

''శీతాకాలం మనసు నీ మనసున చోటడిగింది. సీతకు మల్లే నీతో అడుగేసే మాటడిగింది. నీకు నువ్వే గుండెలోనే అన్నదంత విన్నాలే..' అని ప్రేమగీతం పాడుకున్నారు సంయుక్తా మీనన్. ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న సినిమా 'సార్' (తమిళంలో 'వాతి'). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా నుంచి 'మాస్టారు మాస్టారు నా మనసును గెలిచారు.. అచ్చం నే కలగన్నట్టే నా పక్కన నిలిచారు' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను గురువారం చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. మాస్టారు ధనుష్‌ని ఉద్దేశించి సంయుక్త పాడే ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, శ్వేతా మోహన్ ఆలపించారు. జీవీ ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. కాగా, ఈ పాట తమిళ వెర్షన్‌కు ధనుష్ సాహిత్యం అందించడం విశేషం.

వరుడు కాబోతున్న నాగశౌర్య



రీల్ లైఫ్‌లో కొన్ని సినిమాల్లో పెళ్లి పీటలు ఎక్కిన హీరో నాగశౌర్య త్వరలో రియల్ లైఫ్‌లో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. కర్నాటకకు చెందిన అనూషతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. ఈ నెల 20న బెంగళూరులో నాగశౌర్య–అనూషల వివాహం వైభవంగా జరగనుంది. అనూష బెంగళూరులో ప్రముఖ ఇంటీరియర్ డిజైనర్, ఆర్కిటెక్ట్. 2019–2020కి గాను ఇంటీరియర్ డిజైన్‌లో ఆమెకి కర్ణాటక స్టేట్ టాప్ రాంక్ కూడా వచ్చిందని తెలిసింది. నాగశౌర్య–అనూషలది ప్రేమ వివాహం అని సమాచారం. ఈ నెల 20న ఉదయం 11:25 గంటలకు వీరి వివాహం జరగనుంది. ఒకరోజు ముందు 19న జరిగే మెహందీ ఫంక్షన్‌తో ప్రీ వెడ్డింగ్ వేడుకలు ప్రారంభమవుతాయి.

మా సినిమాలో అదే ప్రత్యేకత

– అట్లూరి నారాయణరావు



''లవ్ స్టోరీ అంటే అమ్మాయి వెంట ఒక అబ్బాయి పడటం, బాధ్యత లేకుండా తిరగడం వంటివి చూపిస్తుంటారు. అయితే యువతకూ కొన్ని లక్ష్యాలు, బాధ్యతలు, దేశం పట్ల ప్రేమ ఉన్నాయని మా 'నచ్చింది గాళ్ ఫ్రెండూ' చిత్రం ద్వారా చెబుతున్నాం.. ఈ సినిమాలో అదే ప్రత్యేకత'' అని నిర్మాత అట్లూరి నారాయణరావు అన్నారు. ఉదయ్ శంకర్, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా గురు పవన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'. అట్లూరి ఆర్. సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ– ''హీరో నారా రోహిత్ నాకు మంచి మిత్రుడు. డిస్ట్రిబ్యూషన్ సైడ్ ఇన్వాల్వ్ అయి వ్యాపారం గురించి తెలుసుకున్నాక ప్రొడక్షన్ చేస్తే బాగుంటుందని నారా రోహిత్ నాకు సలహా ఇచ్చారు. దాంతో ఆయన నటించిన 'సావిత్రి' సినిమాను కొన్ని ఏరియాల్లో పంపిణీ చేశాను. ఆ తర్వాత శ్రీవిష్ణు హీరోగా 'నీదీ నాదీ ఒకే కథ' తీసి, హిట్ అందుకున్నాను. ఉదయ్ శంకర్ నాన్న శ్రీరామ్‌గారు నా గురువు. ఉదయ్‌తో సినిమా అనుకున్నప్పుడు గురు పవన్ వద్ద మంచి కథ ఉందని శ్రీరామ్‌గారు నాతో చెప్పారు.. నాకూ బాగా నచ్చడంతో 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'ని సెట్స్ మీదకు తీసుకెళ్లాం. ఉదయ్ కామెడీని బాగా డీల్ చేయగలడు. అందుకే ఈ చిత్రాన్ని థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తోనే కాకుండా కామెడీ, రొమాన్స్ చేర్చి రూపొందించాం. ఉదయ్ శంకర్‌తో మరో సినిమా చేస్తా. అలాగే నారా రోహిత్ హీరోగా ఓ సినిమాని డిసెంబర్ లేదా జనవరిలో ప్రారంభిస్తాం'' అన్నారు.

వాక్సిన్ వార్ ఖరార్



● వివేక్ అగ్నిహోత్రి

'ది కశ్మీరీ ఫైల్స్' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి. ఆయన దర్శకత్వం వహించనున్న తాజా చిత్రానికి 'ది వాక్సిన్ వార్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఐయామ్ బుద్ధ ప్రొడక్షన్స్‌పై పల్లవి జోషి నిర్మించనున్నారు. దేశంలో కోవిడ్ మహమ్మారి, టీకా కోసం జరిగిన కసరత్తులకు సంబంధించిన అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారని టైటిల్, పోస్టర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ ద్వారా అభిషేక్ అగర్వాల్ 2023 ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళ, కన్నడ, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, మరాఠీ, ఉర్దూ, అస్సామీ వంటి 11 భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ''మన అద్భుతమైన బయో సైంటిస్టుల విజయాన్ని ఈ సినిమా చాటుతుంది. వారి త్యాగం, అంకితభావం కృషికి నివాళిగా ఉంటుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని పల్లవి జోషి అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్



● శిల్ప, విశ్వంత్, రియా

విశ్వంత్ హీరోగా, శిల్పా మంజునాథ్, రియా సచ్‌దేవ ప్రధాన పాత్రల్లో కొత్త సినిమా షురూ అయింది. బసిరెడ్డి రానా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నిశాంత్ సమర్పణలో సహస్ర ఎంటర్‌టైన్మెంట్స్‌పై నరేంద్ర బుచ్చి రెడ్డిగారి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. డైరెక్టర్ 'బొమ్మరిల్లు' భాస్కర్, పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ ఈ చిత్రం ప్రారంభోత్సవంలో అతిథులుగా పాల్గొన్నారు. ''క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. హైదరాబాద్, కర్నూల్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ప్లాన్ చేశాం. ఈ 14న రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. నటుడు సాక్షి రంగారావు తనయుడు సాక్షి శివ, శ్రీధర్ రెడ్డి ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి సంగీతం: లిజో కె. జోష్.

'శ్రీశైలం' నీటిమట్టం 878 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 878.40 అడుగులకు చేరుకుంది. దిగువ ప్రాంతాలకు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో డ్యామ్ నీటిమట్టం రోజురోజుకు తగ్గుతోంది. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి 16,782 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 19,463 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 180.2860 టీఎంసీలు నిల్వ ఉంది.

మహిళా గ్రాండ్ మాస్టర్‌కు 'శాప్' సత్కారం



సాక్షి, అమరావతి: మహిళా గ్రాండ్ మాస్టర్ నూతక్కి ప్రియాంక విజయం రాష్ట్రానికి గర్వకారణమని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎండీ ప్రభాకరరెడ్డి కొనియాడారు. ఇటీవల ప్రతిష్టాత్మక ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్ షిప్‌లో 6.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించడంపై అభినందించారు. గురువారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో ప్రియాంకను ఘనంగా సత్కరించారు. ప్రియాంక మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు, విదేశీ కోచ్‌ల ద్వారా శిక్షణ తీసుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరగా శాప్ చైర్మన్, ఎండీలు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

రాజధానిని వదులుకుంటే చరిత్ర క్షమించదు..

- వికేంద్రీకరణ, విశాఖ పాలన రాజధాని అయితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి
- ఏకగ్రీవంగా తీర్మానించిన విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాలు
- శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చర్చా వేదిక

టెక్కలి : విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని వక్తలు నొక్కి వక్కాణించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో గురువారం నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. విద్యార్థి, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొని విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు కావాల్సిందేనంటూ తీర్మానించారు.

ప్రాంతీయ అసమానతలకు తావులేకుండా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాశయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖలో రాజధానికి శ్రీకారం చుట్టారని, దీనికి మనమంతా మద్దతు తెలపాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా సీఎం వైఎస్ జగన్ వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని, ఈ క్రమంలో విశాఖను పరిపాలన రాజధానిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి చెప్పారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసుకునేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకుంటే భావితరాలు మనల్ని క్షమించవని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హెచ్చరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖలో రాజధాని కోసం సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ఎవరు అడ్డుపడినా ఊరుకోం..



రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ పాలన వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి కోసం విశాఖలో పరిపాలన రాజధానిని ఏర్పాటు చేస్తున్నారు. అభివృద్ధి అంశాన్ని రాజకీయం చేస్తున్నారు. ఈ విషయంలో ఎవరు అడ్డుపడినా తొక్కుకుంటూ రాజధానిని ఏర్పాటు చేసుకుంటాం.

– ప్రొఫెసర్ గుంట తులసీరావు, శ్రీకాకుళం నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్.

మద్దతిద్దాం..



వికేంద్రీకరణలో భాగంగా విశాఖలో రాజధాని ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇలాంటి ప్రభుత్వ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలి. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతం కావాలి.

– పేడాడ పరమేశ్వరరావు, జర్నలిస్టు సంఘం రాష్ట్ర నేత

ఉత్తరాంధ్ర నుంచి వలస నివారణ



విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటును ఉద్యోగ సంఘాల తరఫున పూర్తి స్థాయిలో స్వాగతిస్తున్నాం. దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వలసలను నివారించవచ్చు. విశాఖలో రాజధాని వలన కలిగే ప్రయోజనాలపై గ్రామ స్థాయిలో చర్చా వేదికలు నిర్వహించాలి. సీఎం జగన్ తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

– చౌదరి పురుషోత్తంనాయుడు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర నేత

ఇప్పుడు వదిలేస్తే.. చరిత్ర క్షమించదు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఉత్తరాంధ్రపై అభిమానంతో విశాఖలో రాజధానిని ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఓ సువర్ణావకాశం. ఇలాంటి అవకాశాన్ని విడిచి పెడితే చరిత్ర మనల్ని క్షమించదు. విశాఖ రాజధాని కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి.

– హనుమంతు సాయిరాం, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు.

భావి తరాల భవిత కోసం..



విశాఖలో రాజధాని వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్యపరచాలి. రాజధాని ఏర్పాటుతో భావి తరాల భవిష్యత్తు ఎంతో బాగుంటుంది. విశాఖలో రాజధాని సాధన కోసం టెక్కలి నుంచే ఉద్యమాన్ని ప్రారంభించాలి.

– దానేటి శ్రీధర్, వైద్యుడు, జిల్లా నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్.

మలబార్ యుద్ధ విన్యాసాలు ప్రారంభం

- 15 వరకు జపాన్ వేదికగా నిర్వహణ
- భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా నౌకాదళాల హాజరు
- భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కమోర్తా, శివాలిక్ యుద్ధ నౌకలు



మలబార్ విన్యాసాలు ప్రారంభోత్సవం

సాక్షి, విశాఖపట్నం : ప్రతిష్టాత్మక 30వ మలబార్ యుద్ధ విన్యాసాలు జపాన్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. జపాన్‌లోని యెకొసోకు సాగరతీరంలో ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న యుద్ధ విన్యాసాల్లో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన యుద్ధనౌకలు పాల్గొంటున్నాయి. ఇండో–పసిఫిక్ సముద్ర జలాల్లో స్వేచ్ఛ, ఓపెన్ నేవిగేషన్ వ్యవస్థలను పరిరక్షించడంతోపాటు ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం చైనా కుటిల ప్రయత్నాలకు చెక్ చెప్పడమే ప్రధాన లక్ష్యంగా భారత నౌకాదళంతోపాటు యునైటెడ్ స్టేట్స్ నేవీ (యూఎస్ఎన్), జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జేఎంఎస్‌డీఎఫ్), రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ(ఆర్ఏఎన్) నౌకాదళం సంయుక్తంగా యుద్ధ విన్యాసాలను ప్రదర్శిస్తున్నాయి. ఇందులో భాగంగా యాంటీ సబ్ మెరైన్ వార్‌ఫేర్ ఆపరేషన్స్, క్రాస్‌డెక్ ల్యాండింగ్స్, సీమ్యాన్ షిప్ విన్యాసాలు ప్రదర్శిస్తాయి. భారతదేశం తరఫున ఐఎన్ఎస్ కమోర్తా, ఐఎన్ఎస్ శివాలిక్ యుద్ధ నౌకలు, మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లతోపాటు మెరైన్ కమాండోలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారత నౌకాదళ ఈస్ట్రన్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ రియర్ అడ్మిరల్ సంజయ్ భల్లా, యూఎస్ఏ నేవీ కమాండర్ వైస్ అడ్మిరల్ కార్ల్ థామస్, ఆస్ట్రేలియా ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోనాథన్, జపాన్ ఫ్లీట్ కమాండర్ వైస్ అడ్మిరల్ యూసా హెడికీ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఇండో పసిఫిక్ రీజియన్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఓపెన్ ఫ్రీగా మార్చాలన్నదే మలబార్ విన్యాసాల ప్రధాన ఉద్దేశమని ఆయా దేశాల ప్రతినిధులు ప్రకటించారు. క్వాడ్ దేశాలతో (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) పాటు మలబార్‌లోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని వెల్లడించారు.

భారత్–అమెరికాతో మొదలు...

ఇండో–పసిఫిక్ సముద్ర జలాల్లో స్వేచ్ఛ, ఓపెన్ నేవిగేషన్ వ్యవస్థల పరిరక్షణ కోసం భారత్–అమెరికా నౌకాదళాలు సంయుక్తంగా 1992లో మలబార్ విన్యాసాలు ప్రారంభించాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రెండు దేశాలు సంయుక్తంగా యుద్ధ విన్యాసాలు కొనసాగిస్తున్నాయి. ఈ రెండు దేశాలతో 2015లో జపాన్ కూడా చేరడంతో అప్పటి నుంచి మూడు దేశాలు పాల్గొంటున్నాయి. 2020లో రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ చేరడంతో ప్రస్తుతం నాలుగు దేశాల నౌకాదళాలు కలిసి యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తున్నాయి.

పంటల బీమాలో ఏపీ ఆదర్శం

- ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్
- ముంబైలో ఇండియన్ ఇన్సూరెన్స్ మార్కెట్ సెమినార్



సాక్షి, అమరావతి : రైతులపై పైసా భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. యూనివర్సల్ కవరేజ్ కింద నోటిఫైడ్ పంటలను సాగు చేసే రైతులందరికీ వర్తింపజేస్తున్నామని చెప్పారు. పంటల బీమా అమల్లో ఏపీ ప్రభుత్వ సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ముంబైలో రెండ్రోజుల పాటు జరిగిన నాలుగో ఇండియా క్రాప్ ఇన్సూరెన్స్ మార్కెట్ సెమినార్‌లో 'మెరుగైన భవిత కోసం పంటల బీమా – సాంకేతిక భాగస్వామ్యం' అనే అంశంపై జరిగిన చర్చలో స్పెషల్ కమిషనర్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకనుగుణంగా ఉచిత పంటల బీమాను అమలు చేస్తున్నామన్నారు. సీజన్ ముగియకుండానే పంటల బీమా పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు తెలిపారు. ఈ–పంట ఆధారంగా రాష్ట్రంలో సాగవుతున్న ప్రతి ఎకరా పంటను నమోదు చేయడమే కాదు.. రైతులందరికీ పూర్తి స్థాయిలో రక్షణ కల్పించేలా ఉచిత పంటల బీమా పథకాన్ని మూడేళ్లుగా అమలుచేస్తున్నట్టు చెప్పారు. గడిచిన మూడేళ్లలో 44.66 లక్షల మంది రైతులకు రూ.6,884.84 కోట్ల పరిహారాన్ని జమ చేశామన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం స్ఫూర్తితో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమల్లో పలు మార్పులు తీసుకొచ్చారని వెల్లడించారు. ఈ ఏడాది నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా–పీఎంఎఫ్‌బీవై పథకాలను అనుసంధానం చేసి దిగుబడి ఆధారిత పంటలకు అమలు చేస్తున్నామని, వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం గతంలో మాదిరిగా కంపెనీలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే క్లెయిమ్‌లు సెటిల్ చేస్తుందని హరికిరణ్ వివరించారు.

బాణసంచా పేలి ముగ్గురు మృతి

తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో ఘోర దుర్ఘటన

తాడేపల్లిగూడెం/సాక్షి, అమరావతి :పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో గురువారం రాత్రి బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 80శాతం గాయాలతో ఉన్న ఇతనిని మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తున్నారు. గ్రామంలోని రాజం చెరువు సమీపంలో ఉన్న ఈ కేంద్రంలో బాణసంచాను ఓ వాహనంలోకి లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు తయారీ కేంద్రంలో యజమాని సహా ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒక మహిళ ఇంటికి వంట చేసుకోవడానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

10కిమీ. దూరం వరకు ప్రకంపనలు

గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడేపల్లిగూడెం పట్టణంలోనూ పేలుడు ప్రకంపనలు వచ్చాయి. వీకర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో భూకంపం సంభవించిందేమోనని ప్రజలు భీతిల్లారు. ప్రమాదంలో చనిపోయిన వ్యక్తుల శరీర భాగాలు తునాతునకలై చెల్లాచెదురయ్యాయి. గూడెం పరిసర ప్రాంతాల్లోని అనంతపల్లి, జగ్గన్నపేట, అల్లంపురం, కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేయడానికి వస్తున్నారు. వీరిలో ఉదయం పూట పనిచేసినవారు ఇంటికి వెళ్లిపోగా సాయంత్రం పనికి వచ్చిన వారు ప్రమాదం బారిన పడినట్లు తెలుస్తోంది. తయారీ కేంద్ర నిర్వాహకుడుగా చెబుతున్న పండూరి అన్నవరం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఘటనా స్థలాన్ని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఏలూరు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఘటనా స్థలాన్ని సందర్శించారు సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. కడియద్ద గ్రామంలో జరిగింది దురదృష్టకరమైన సంఘటన అని చెప్పారు. తాను గడపగడపకు కార్యక్రమంలో ఉండగా సమాచారం తెలిసిందని.. వెంటనే అధికారులను హుటాహుటిన ఘటనాస్థలానికి పంపించి సహాయక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని.. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

మరోవైపు.. పేలుడు ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వెంటనే తగిన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున సహాయాన్ని అందించి వారికి తోడుగా నిలవాలని సీఎం కోరారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.